www.manatelangana.news
Mana Telangana
మన తెలంగాణ
హైదరాబాద్ | సంపుటి 7 | సంచిక: 204 | ఆదివారం | 13 జనవరి, 2019
Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 16 + 32 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ఊరెళ్లిపోతున్న నగరం

సంక్రాంతి పండగ కోసం హైదరాబాద్ నుంచి 30లక్షల మంది స్వగ్రామాలకు వెళ్లే అవకాశం

వాహనాల రద్దీతో కిలోమీటర్ల పొడవునా స్తంభించిన జాతీయ రహదారి, బస్సుల్లో, రైళ్లలో చోటుకోసం పడరాని పాట్లు, విపరీతంగా పెంచేసిన చార్జీలు

పంతంగి, కొర్లపహాడ్ టోల్ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్

సంక్రాంతికి టోల్ టాక్స్ రద్దు

పలు ప్రాంతాలకు నేడు జన సాధారణ్ రైళ్లు

రహదారి


హైదరాబాద్--విజయవాడ జాతీయ రహదారి పంతంగి టోల్ప్లాజా వద్ద వాహనాల రద్దీ

రైలుదారి


సికింద్రాబాద్ స్టేషన్లో రైల్లో సీటు కోసం ఎదురు పరుగులెత్తుతున్న ప్రయాణీకులు

7



ఆర్థిక సంఘం తీరు మారాలి

కేంద్రంలో వచ్చిన ప్రభుత్వాలేవీ గుణాత్మక మార్పు తీసుకురాలేక పోయాయి

ఇందుకు కాంగ్రెస్, బిజెపిలే కారణం

- రాష్ట్రాల హక్కుల మేరకు నిధుల విడుదలపై దృష్టి పెట్టాలి
- ప్రజల జీవికకు స్పష్టమైన నిర్వచనం ఇవ్వాలి
- బడ్జెట్ తయారీకి పలు అంశాలపై టాస్క్‌ఫోర్స్‌లు
- గ్లోబల్ సిటీగా హైదరాబాద్, పర్యాటక కేంద్రంగా కాళేశ్వరం
- సీనియర్ అధికారులతో సమీక్షలో సిఎం కెసిఆర్

మన తెలంగాణ /హైదరాబాద్

భారత ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి వుందని, మూసపద్ధతిలో కాకుండా తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం వున్నదని ముఖ్యమంత్రి కెసిఆర్ అభిప్రాయ పడ్డారు. త్వరలో 15 వ ఫైనాన్స్ కమిషన్ బృందం రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ, ఇతర సీనియర్ అధికారులతో శనివారం ప్రగతి భవన్‌లో కీలక సమీక్ష నిర్వహించారు. స్వాతంత్ర్యకాలం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక పార్టీల ప్రభుత్వాలు వచ్చాయి పోయాయి కానీ ఎటువంటి గుణాత్మక మార్పును తీసుకురాలేక పోయాయని, ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం లోతైన విశ్లేషణ, ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇంతకాలం పాలన సాగించిన ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, నిరసన వ్యక్తం చేయాలన్న ఆలోచనతో ఉండడం విచారకరమన్నారు. దీనికి కాంగ్రెస్, బిజెపి అనే రెండు జాతీయ రాజకీయ పార్టీలు, రాజకీయ వ్యవస్థలే ప్రధాన కారణమని సిఎం స్పష్టంచేశారు. దేశానికి విశాలమైన ఆర్థిక విధానం వున్నదని, రాష్ట్రాల అవసరాలకు అనగుణంగా వాటికి ఇచ్చే అధికారాలను వికేంద్రీకరణ చేయాల్సిన అవసరం ఉందని, కానీ అందుకు విరుద్ధంగా కేంద్రీకరించుకుంటోందని వ్యాఖ్యానించారు. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యం చేసుకోవద్దని తాను నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొన్నప్పుడే స్పష్టం చేశానని, రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలని సూచించానని, పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను ప్రోత్సహించాలే తప్ప నిరుత్సాహపర్చొద్దని కూడా స్పష్టంగా చెప్పానని సిఎం కెసిఆర్ గుర్తుచేశారు. కేంద్రం నుంచి పొందే స్వల్ప స్థాయి నిధులకు సైతం అనేక నిబంధనలు ఉంటున్నందున పొందడానికి రాష్ట్రాలు అనేక ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రానికి తరువాయి 6లో

రాష్ట్రంలో ధాన్య సేకరణ
విధానం అద్భుతం

కేంద్ర అధికారి ప్రశంస

మన తెలంగాణ/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ధాన్యం సేకరణ విధానం అద్భుతంగా ఉందని కేంద్ర ఆహార ప్రజా పంపిణి వ్యవస్థ కార్యదర్శి రవి కాంత్ అన్నారు. ప్రతి ఐదు కిలో మీటర్లకు ఒక కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర లభించేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఐరిస్, బయోమెట్రిక్, పోర్టబులిటి తదితర విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా తరువాయి 6లో

అగ్రవర్ణ కోటాకు ఆమోద ముద్ర


సంతకం చేసిన రాష్ట్రపతి కోవింద్

10

నలుగురు ఎంఎల్‌సిలపై
త్వరలో వేటు

పార్టీ మారిన వారిపై నిర్ణయాన్ని కౌన్సిల్ చెర్మన్ వాయిదా వేశారు : పల్లా

మన తెలంగాణ/హైదరాబాద్



తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలో పార్టీ ఫిరాయించిన నలుగురు ఎంఎల్‌సిలపై వేటుకు రంగం సిద్ధమైంది. టిఆర్ఎస్ పార్టీ తరపున గెలిచి ఎంఎల్‌సిలుగా ఉండి సరిగ్గా ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఎల్‌సిలు తరువాయి 6లో

టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ శాఖలు పటిష్ఠం

7

త్వరలో విధాన ప్రకటన : ఎంపి కవిత



యుపిలో పొడిచిన పొత్తు



లోక్‌సభ ఎన్నికలకు కలిసిన ఎస్‌పి, బిఎస్‌పి

చెరి 38స్థానాల్లో పోటీ

అమేథీ, రాయబరేలీలో పోటీ చేయరాదని నిర్ణయం

లక్నో: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరపదేశ్‌లో పట్టు సాధించేందుకు ఒకప్పుడు బద్ధ విరోధులైన సమాజ్ వాది పార్టీ(ఎస్‌పి), బహుజన్ సమాజ్ తరువాయి 6లో



కూటములు వేస్ట్

బిజెపి జాతీయ మండలి సమావేశంలో ప్రధాని మోడీ

12

కుంచెపోటు



పొగమంచులో వాహనాలు ఢీ



షాద్‌నగర్-హైదరాబాద్ మధ్య 16 బళ్లు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలు

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

మన తెలంగాణ/నందిగామ

పొగ మంచుతో భారీ రోడ్డు ప్రమాదం జరిగిన సంఘటన రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చలి కాలం ఉండటంతో పొగ మంచు కమ్ముకున్నందున వాహనాలకు ముందు వెళుతున్న వాహనాలు కనిపించకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని అన్నారు. షాద్‌నగర్ నుంచి తరువాయి 6లో

టీటా నూతన కార్యవర్గం

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టీటా) తన సంఘానికి సంబంధించిన గ్లోబల్ వర్కింగ్ కమిటీలను ప్రకటించింది. శనివారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఈ సంఘం ఎన్నికలు నిర్వహించిన రిటర్నింగ్ అధికారులు సి.విఠల్,అశ్విన్ చంద్ర నూతన కార్యవర్గ సభ్యులను ప్రకటించారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు,గ్లోబల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ కుమార్ మక్తాల మాట్లాడుతూ నూతన సభ్యులను స్వాగతించారు. స్వరాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తమ వంతు కృషి చేయడంతో పాటు ఐటి ఉద్యోగులకు అండగా నిలవడం, సాంకేతిక అక్షరాస్యత కొనసాగించడం సంస్థ కార్యకలాపాలుగా చెప్పారు. లాగే ఇన్నోవేషన్ ఇంక్యూబేషన్ కార్యక్రమాలకు అండగా ఉండనున్నట్లు తెలిపారు. కొత్తగా ఎంపికైన సభ్యులతో ఈనెల 19న జింఖానా క్లబ్‌లో సమావేశం కానున్నట్లు ఆయన తెలిపారు.

చర్యలకు 'రెరా' రెడీ

- రిజిస్ట్రేషన్‌కు మరో రెండురోజులే గడువు
- ముందుకు రాని స్థిరాస్తి వ్యాపారులు
- భయపడుతున్న రియల్టర్లు
- చర్యలు తీసుకోవడానికి రెరా అథారిటీ సిద్ధం



మన తెలంగాణ/హైదరాబాద్ : స్థిరాస్తి నియంత్రణ (రెరా) చట్టం కింద నమోదు కోసం వివరాలు ఇవ్వడానికి రియల్టర్లు భయపడుతున్నారు. రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి చాలామంది డెవలపర్లు ముందుకు రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ గడువు పొడిగిస్తూ వచ్చినా ఆశించిన స్పందన రావడంలేదు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ చేయించుకోనివారిపై చర్యలు తీసుకోవడానికి 'రెరా' అధికారులు సిద్ధమయ్యారు. రెరా కింద రిజిస్ట్రేషన్ చేసుకునే వారు పార్కింగ్ వివరాలు, ఆ స్థలం లో అభివృద్ధిదారులకు ఉన్న హక్కు పత్రాలు వాటికి సంబంధించిన అనుబంధ డాక్యుమెంట్లను జతచేయాల్సి ఉంటుంది. దీనితో పాటు యాజమాన్య హోదాపై రెవెన్యూ అధికారి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది. యజమానితో కుదిరిన ఒప్పందం వివరాలు, ప్రాజెక్టు చైర్మన్, భాగస్వాముల వివరాలు, డైరెక్టర్ల చిరునామాలు తదితర వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇవన్నీ సరిగ్గా ఉంటేనే అధికారులు రెరా కింద రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అనుమతి ఇస్తున్నారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకొని వారికి నోటీసులు సైతం జారీ చేశారు. అయినా స్పందించని వారిపై కొరడా ఝుళిపించడానికి రంగం సిద్ధం చేస్తున్నా రు. స్థిరాస్తి వ్యాపారుల విజ్ఞప్తి మేరకు ఇప్పటికే రిజిస్ట్రేషన్ల గడువు రెండు, మూడు సార్లు రెరా అధికారులు పొడిగించారు.

వివరాలను సేకరించే పనిలో అధికారులు

అయినా చాలామంది వ్యాపారులు, ఏజెంట్లు ముందుకు రావడం లేదని అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో వారి వివరాలను రెరా అధికారులు సేకరించే పనిలో పడ్డారు. వారికి నోటీసులు జారీ చేయాలన్న ఆలోచన దిశగా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనుమతి పొందిన వాటిలో మూడోవంతు ప్రాజెక్టులు రిజిస్ట్రేషన్లు చేసుకోలేదని అధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు దారుల ప్రయోజనమే లక్ష్యంగా రెరా చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. స్థిరాస్తి వ్యాపారంలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం రెరా చట్టాన్ని తీసుకొచ్చింది. దీనినే మన రాష్ట్రం కన్నా ముందు మహారాష్ట్ర అమలు చేస్తోంది. మనరాష్ట్రంలో 2017 జనవరి 1వ తేదీ నుంచి అనుమతి పొందిన వాటిలో 8 ప్లాట్లు లేదా 500 చదరపు మీటర్ల విస్తీర్ణంలోని అన్ని స్థిరాస్తి ప్రాజెక్టులు (అపార్ట్‌మెంట్లు, ఇతర రియల్‌ఎస్టేట్ వెంచర్లతో పాటు) ప్లాట్లు (స్థలాలు) లే ఔట్లను రెరా కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెరా అథారిటీ 2018 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మాజీ మంత్రి కెటిఆర్ ప్రారంభించారు. రిజిస్ట్రేషన్ ప్రారంభం అయిన తరువాత నవంబర్ 30వ తేదీ వరకు (మూడునెలల) పాటు రియల్టర్లకు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రెరా అథారిటీ గడువు ఇచ్చింది.

30 శాతానికి పైగా ప్రాజెక్టులు

రెరా ఏర్పాటు తరువాత రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 5 వేలకు పైగా స్థిరాస్తి ప్రాజెక్టులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అందులో మూడు నెలల్లో సగం మంది రియల్టర్లు కూడా రిజిస్ట్రేషన్లు చేయించుకోవడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో రెరా అథారిటి అధికారులు రూ.50 వేల జరిమానాతో రిజిస్ట్రేషన్ తేదీని పొడిగించారు. దీనికోసం 15 రోజుల గడువును స్థిరాస్తి ప్రాజెక్టు వ్యాపారులకు సమయం ఇచ్చారు. అయినా చాలామంది రిజిస్ట్రేషన్లు చేసుకోవడానికి ముందుకు రాలేదు. మరోసారి లక్ష రూపాయల జరిమానా తో డిసెంబర్ 31 వరకు రిజిస్ట్రేషన్ తేదీని పొడిగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. తాజాగా రూ.2 లక్షల జరిమానాతో జనవరి 15వ తేదీ, 2019 వరకు అధికారులు మరోసారి అవకాశం ఇచ్చారు. 30 శాతానికి పైగా ప్రాజెక్టులు నమోదు చేసుకోవాల్సి ఉంది. మిగిలిన 2 రోజుల్లో ఎంతమంది ముం దుకు వస్తారన్న విషయంలో క్లారిటీ లేకపోవడంతో అధికారులు దీనిపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో భవన నిర్మాణ అనుమతులు, నగరాభివృద్ధి సంస్థలు, డిటిసిపి ఇచ్చిన లే ఔట్ అనుమతుల ద్వారా ఆయా ప్రాజెక్టులను గుర్తించి చర్యలు తీసుకోవాలని రెరా అధికారులు నిర్ణయించారు.

మరోసారి గడువు పొడిగింపునకు నో...

ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో భారీ జరిమానాలు విధించాలని కూడా వారు నిర్ణయించినట్టు తెలిసింది. మరోసారి గడువు పొడిగించాలని స్థిరాస్తి సంఘాలు కోరినప్పటికి రెరా వారి వినతులను పరిగణలోకి తీసుకోలేదు.

వ్యాపారులకు మేలే జరుగుతుంది



రెరా కింద స్థిరాస్తి వ్యాపారులు రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలి. ఇప్పటికే ప్రభుత్వం రెండు, మూడు విడతలుగా రిజిస్ట్రేషనల గడువును పొడిగించింది. దీనిపై స్థిరాస్తి వ్యాపారులు అవగాహన పెంచుకోవాలి. కొనుగోలుదారులతో పాటు అమ్మకం దారులకు దీనివలన మేలు కలుగుతుంది. మోసాలకు తావులేకుండా ఉండడానికే ప్రభుత్వం ఈ రెరా చట్టాన్ని అమలు చేస్తోంది. వేరే రాష్ట్రాల్లో కూడా ఈ చట్టం వలన సత్ఫలితాలు వచ్చాయి.

— గుమ్మి రాంరెడ్డి, క్రెడాయ్ తెలంగాణ అధ్యక్షుడు

అమెరికా ప్రెసిడెంట్ బరిలో తులసీ గబ్బార్డ్

వాషింగ్టన్ : 2020 అమెరికా అధ్యక్ష ఎన్నికలలో తాను పోటీ చేస్తానని, ట్రంప్‌తో తలపడుతానని డెమొక్రాట్ సెనెటర్ తులసీ గబ్బార్డ్ ప్రకటించారు. యుఎస్ కాంగ్రెస్‌కు తొలిసారిగా ఎన్నికైన తొలి హిందూనేతగా తులసీ ఖ్యాతి గడించారు. హవాయి నుంచి నాలుగు సార్లు అమెరికా ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు.

హజ్ యాత్రకు 4,169 మంది

- జిల్లాల వారీగా యాత్రికులు, డ్రా ద్వారా ఎంపిక
- జూలై 1 నుంచి అగస్టు 3 వరకు విమానాల ద్వారా యాత్ర



మన తెలంగాణ/ నాంపల్లి : తెలంగాణ నుంచి 2019 సంవత్సరం హజ్ యాత్రకు వెళ్లేందుకు సెంట్రల్ హజ్ కమిటీ యాత్రీకుల కోటాను 4,169 మందికి కేటాయించిందని రాష్ట్ర హజ్ కమిటీ ప్రత్యేక అధికారి ఆచార్య ఎస్.ఎ.షూకూర్ వెల్లడించారు. ఇందులో రిజర్వడ్ కెటగిరి — ఎ కింద 70 ఏళ్ల పైబడిన వృద్ధులను పవిత్ర హజ్ యాత్రకు ఎంపిక చేశామని, వీరికి సహాయం చేసేందుకు వెంట ఒకరు వెళ్లవచ్చన్నారు. శనివారం నాంపల్లిలోని హజ్‌భవన్‌లో హజ్ యాత్రకు వెళుతున్న వారి డ్రా తీసే కార్యక్రమం జరిగింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వరకు జిల్లాల వారీగా యాత్రీకులను డ్రా ద్వారా ఎంపిక చేసి వారి జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ సందర్భంగా షూకూర్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు 12,884 దరఖాస్తులు అందాయని, ఇందులో అత్యధికంగా హైదరాబాద్ నుంచి 8,116 సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని, ఇందులో ముస్లీం జనాభా ప్రకారం 38 శాతం ప్రకారం 1,459 దరఖాస్తుదారులను హజ్ యా త్రకు డ్రా ద్వారా ఎంపిక చేశామని వివరించారు. అతి తక్కువ సంఖ్యలో మహబూబాబాద్ జిల్లా నుంచి కేవలం నా లుగు దరఖాస్తులే అందాయని తెలిపారు.

మిగతా జిల్లాల వారీగా యాత్రీకుల కోటా డ్రా ద్వారా తీశామని, జాబితా లోవారి పేర్లను వెబ్‌సైట్‌లో పెట్టామని వివరించారు. దేశం నుంచి మొత్తం 1.75వేల మంది యాత్రీకులను సెంట్రల్ హజ్‌కమిటీ కేటాయించిందని తెలిపారు. ఇందులో ప్రభుత్వం కోటా, ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు, ఇతర వర్గాల నుంచి ఎంపిక చేస్తుందని,మిగిలిన అన్ని రాష్ట్రాల నుంచి 1లక్ష 25వేల మంది యాత్రీకులను ఎంపికచేస్తుందని ఆయన వివరించారు. ఈ దఫా తెలంగాణ నుంచి వేయిటింగ్ లిస్టులో అనేకమంది యాత్రీకుల పేర్లు ఉన్నాయని, వివిధ రాష్ట్రాల్లో ఈ సారి యాత్రీకుల దరఖాస్తుల సంఖ్య తగ్గిందని, వివిధ కారణాల వల్ల రద్దు అయ్యే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో వేయిటింగ్ లిస్టులో పేర్లున్న వారికి పవిత్ర యాత్రకు బయలుదేరే అవకాశం లభించవచ్చని షూకూర్ వెల్లడించారు. తెలంగాణ నుంచి కూడా ఈ దఫా దరఖాస్తులు తక్కువ సంఖ్యలో రావడానికి జీఎస్‌టి ఇతర కారణాలు ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. వచ్చే జూలై 1 తేదీ నుంచి ఆగస్టు 3 వరకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి సౌదీ ఆరేబియాకు విమానాల ద్వారా యాత్రీకులు బయలుదేరుతారని, సుమారు 40 రోజుల పాటు ప్యాకేజీ ఉంటుందన్నారు. పవిత్ర స్థలిలో యాత్రీకులకు వంటలు చేసుకునేందుకు ఉచితంగా ప్రతి ఒక్కరికి రెండు సీలిండర్లతోపాటు ఉచిత బస్ సౌకర్యం, బస తదితర సౌకర్యాలను హజ్‌కమిటీ సమకూరుస్తుందని వెల్లడించారు. ఎంపికైన యాత్రీకులు వాయిదాల పద్ధతుల్లో తొలుత 85 వేల, తర్వాత 81వేలు ఇలా డబ్బులు సకాలంలో చెల్లించాలని కోరారు. యాత్రీకులకు సౌదిఅరేబియాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా విస్తృత స్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

వివేకానందుని జీవితం యువతకు ఆదర్శప్రాయం

ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



మన తెలంగాణ/హైదరాబాద్ : భారతీయ సంస్కృతికి స్వామి వివేకానంద ప్రతిరూపమని, యువత దృఢ సంకల్పానికి ప్రతిబింబమని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. జాతీయ యువదినోత్సవం సందర్భంగా శనివారం శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యువతను ఉద్దేశించి ఉప రాష్ట్రపతి ప్రసంగిస్తూ, వివేకానందుని బోధనలు అసాధారణమైనవని, కాలదోషం పట్టనివి అని అన్నారు. ఆయన ఆలోచనలు, బోధనలు అన్ని కాలాలాకు వర్తించే నిరంతర గంగా ప్రవాహం లాంటిదని వ్యాఖ్యానించారు. భారతీయ సంస్కృతిలో తాత్వికమైన, సమీకృతమైన, సార్వత్రికమైన లక్షణాలు ఉన్నాయన్నారు. నేటి ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారాలు ఆయన బోధనలు, ప్రసంగాల్లో ఉన్నాయని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వైవిధ్యమైన మతాలను, సాంస్కృతిక నమ్మకాలను, వివిధ అభిప్రాయాలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, వివిధ అభిప్రాయాల మధ్య చక్కని వారధి నిర్మించిన ఘనత వివేకానందుని సొంతమని ప్రశంసించారు. ఆయన బోధనలను జీవితంలో ఆచరించడం ద్వారా ప్రజా జీవితాల్లో సానుకూలమైన మార్పులు తీసుకరావడం సాధ్యమని అభిప్రాయపడ్డారు. 125 ఏళ్ళ క్రితం చికాగో సర్వమత సమ్మేళనంలో వివేకానందుని ప్రసంగం యావత్ ప్రపంచానికే దిశానిర్దేశం చేసిందన్నారు. ఆయన వాక్పటిమ, నిజాయితీతో కూడిన సంభాషణ ప్రతి ఒక్కరినీ సమ్మోహితుల్ని చేసిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం, ధైర్యం లాంటి అంశాల గురించి వివేకానంద తెలియజేసిన సూక్తులు నేటి యువతకు ఆదర్శనీయమన్నారు. యువత తలుచుకుంటే అద్భుతాలు సాధించగలమని వివేకానందుడుడు మనసా, వాచా, కర్మణా నమ్మారన్నారు. వివేకానందుని సందేశాలు సూటిగా యువత హృదయాన్ని తాకుతాయని, ముప్పైతొమ్మిదేళ్ళ వయసులో తనువు చాలించిన వివేకానందుడు సంపూర్ణంగా భారతీయ యువత మనసుల్ని ప్రతిబింబించారని తెలిపారు. వివేకానందుని మాటలను ఆచరణలో పెట్టడం ద్వారా జీవితంలో యువత మరింత ఎత్తుకు ఎదగాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని ప్రసంగించారు.

నేటి నుంచి కైట్, స్వీట్ ఫెస్టివల్

పరేడ్ మైదానంలో ప్రారంభించినున్న ఉపరాష్ట్రపతి

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వరుసగా నాల్గవసారి నిర్వహిస్తున్న కైట్, స్వీట్ ఫెస్టివల్ ఏర్పాట్లను పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, పోలీసు అధికారులు శనివారం సాయంత్రం పరిశీలించారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆదివారం ఉదయం ఈ కార్యక్రమాన్ని స్థానిక పెరేడ్ గ్రౌండ్స్‌లో ప్రారంభించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమంలో వివిధ దేశాల నుంచి పతంగులను ఎగురవేసే ప్రావీణ్యులు, సుమారు 1200 రకాల తీపి వంటలను చేసే వివిధ రాష్ట్రాలు, దేశాలకు చెందినవారు పాల్గొంటున్నారు. నాల్గవ అంతర్జాతీయ కైట్ ఫెస్టివల్‌కు 20 దేశాల నుండి 42 మంది అంతర్జాతీయ స్థాయి కైట్ ఫ్లైయర్స్, 60 మంది దేశవాళీ కైట్ క్లబ్‌ల సభ్యులు పాల్గొంటున్నారు. ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్ కు అనుబంధంగా నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్‌లో 22 దేశాల మహిళా హోమ్ మేకర్స్, 25 రాష్ట్రాలకు చెందిన 2500 మంది హోమ్ మేకర్స్ తయారు చేసిన 1200 రకాల స్వీట్ వెరైటీల స్వీట్స్‌ను 1200 స్టాల్స్ ద్వారా ప్రదర్శించడంతో పాటు విక్రయిస్తారు. వీటికి అనుబంధంగా పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరిగేలా పర్యాటక శాఖ కార్యదర్శి ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు ఉండేలా షెడ్యూలు రూపొందింది. ప్రతి రోజు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రముఖ గాయకుడు రామాచారి ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు, సంగీత విభావరి జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు తెలంగాణ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా ప్రదర్శనలు, అనంతరం రాత్రి 10 గంటల వరకు 25 రాష్ట్రాల కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. ఈ అంతర్జాతీయ కైట్, స్వీట్ ఫెస్టివల్‌లో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఫుడ్ ఫెస్టివల్‌ను కూడా నిర్వహిస్తున్నట్లు బుర్రా వెంకటేశం తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో దేశంలోని అన్ని ప్రాంతాలకు చెందిన ఆహార పదార్థాలను అందుబాటులో ఉండే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.



కోరుకున్నది అందించేది 'వేదం'

చినజీయర్ స్వామీజీ

మనతెలంగాణ, సిటీబ్యూరో : మన స్వతంత్రులం కాము. మనల్ని ఏదో వెనుక ఉండి ఓ అద్భుత దివ్య శక్తి నడిపిస్తుందని ఆండాళ్ తన ఐదు పాటల్లో వివరించారని ప్రముఖ ఆద్యాత్మిక గురువు చిన జీయర్ స్వామీజి చెప్పారు. నగరంలోని నందగిరిహిల్స్‌లోని మై హోం గ్రూపుల అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు నివాస ప్రాంగణంలో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 28వ రోజు ఆయన తన ప్రవచనాల ద్వారా ఆద్యాత్మిక విషయాలను వెల్లడించారు. ''అంతర్ బహిశ్చ తత్సర్వం వ్యాప్య స్థిత:'' ఈ కనిపించే, కనిపించని వస్తువులకు, అన్నింటికి దివ్యమైన శక్తి లోపల, బయట ఉంటుందని వేదం చెప్పిందని ఆయన తెలిపారు. అణువు దగ్గర నుంచి మహత్ వరకు ఓ శక్తి నడిపిస్తుందని, ఈ కనిపించే వస్తువుల్లో రెండు రకాల పదార్థాలున్నాయని, ఒకటి ప్రాణరహిత పదార్థం, రెండవది సప్రాణం అనేవి ఉన్నాయని ఆయన చెప్పారు. మనుష్యులకు కనిపించనివి కూడా ఉన్నాయని వాటిని దేవతలు అని పిలవడం జరుగుతుందని, ప్రాణం ఉండి కదులుతూ ఉన్నవి, ప్రాణరహితంగా ఉన్న రెండు విభాగాలు చేస్తే తిరిగే వాటిని 'జంగములు' తిరగని వాటిని 'స్థావరము'లు అని అంటారని ఆయన చెప్పారు. స్థావర జగమములుగా ఉండే సమస్త జీవరాశిలో తిరిగే వాటిలో నేనునేను అనే ఒక చైతన్య వస్తువు ఉంటుందని దానినే 'ఆత్మ' అని అంటారని జీయర్ స్వామీజి తెలిపారు. తిరిగే వాటిలో ఆత్మ ఉన్న వాటిని జీవుడు లేదా చేతనుడు అని పిలుస్తారని, తిరిగే వాటిల్లో మిగతా పాణికోటికి రేపటి గూర్చి ఆలోచించే అవకాశం తక్కువ అది బాగా ఆలోచన చేసేవాడే 'మానవుడు' అని, ఈ మానవుడి జాతికి కొంత విజ్ఞానం ఇవ్వటం తగును అని వేదాలు కృషి చేసి అందించాయని, భగవంతుడు కూడా అదే తరహాలోనే అందించాడని జీయర్ స్వామీజి వివరించారు. దేవుడు ఒక సారి వేదాన్ని స్మరించి ఏ ఆనుపూర్వి(ఆరంభం నుంచి చివరి వరకు ఒకే పద్ధతిలో సాగుట)లో ఇదివరకు తాను తెలుసుకున్నాడో..



వేదంను భగవంతుడు రాయలేదని, కనిపెట్టలేదని, అది ఆయన ఉచ్వాస, నిశ్వాసలాంటిందని, వేదం అంటే విజ్ఞానమని, దీనిని ఆంగ్లంలో సైన్స్ అని పేరుపెట్టారని ఆయన వివరించారు. కోరుకున్నవాటిని లభింపజేసేది వేదం, వేదం రెండు అర్థాలు.. అవి ఒకటి మీకు అవసరమైనది అందించేది, రెండవది మీకు తెలియవలసింది తెలిపేది అందుకే అది వేద: అని ఆయన పేర్కొన్నారు. ''ప్రకశయేనా లియతేన్'' ప్రళయం అంటే కంటికి కనిపించకుండా తీసుకెళ్ళి ఉంచుట అని, జీవుడి లోపలికి తీసుకెళ్ళితే ప్రళయమని, బయటకు తీసుకువస్తే 'సృష్టి' అని అంటారని జీయర్ స్వామీజి తెలిపారు. ఏది లేనిది బయటకు రాదని, ఉన్నవే వెలుపలికి వస్తాయని, మానవుడికి శరీరం ఏర్పడిన తర్వాత చైతన్య అవకాశాలుంటాయని, వాటిని సద్వినియోగం చేసుకునే, దుర్వినియోగం చేసుకునే వెసులుబాటు ఉంటుందని, మిగతా జీవరాశికి ఈ సదుపాయం ఉండదని ఆయన తెలిపారు. జీవుడిలోని అహం భావం వల్ల పెరుగుట, అదే క్రమంలో క్రిందికి జారుట జరుగుతుందని, దేవుడినే 'సత్యం' అని, 'సత్ తి యం' సత్ అంటే ఎప్పుడు మారకుండా ఉండేదని, తి సతతము మార్పు చెందునదని, య అంటే యచ్చతి అని కూర్చునది అని అర్థమని, జీవులను, ప్రకృతిని ఒక్కటిగా తీసుకు రావడం జరుగుతుందని, 'సత్యమ్ జ్ఞానమనంతమ్ బ్రహ్మ' అని జీయర్ స్వామీజి తెలిపారు. ఏ శరీరం నీకు వచ్చిందో ఆ శరీరాన్ని నీవు తెలివిగా జాగ్రత్తగా వాడుకుంటే నీకున్నవాటినన్నిటినీ తొలగించుకోవచ్చని, తద్వారా తరింపజేసుకోవచ్చని ఆయన చెప్పారు.

22న హైదరాబాద్‌కు అమిత్‌షా

మన తెలంగాణ/హైదరాబాద్ : బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ నెల 22న హైదరాబాద్‌కు రానున్నారు. గత నెల చివరి వారంలోనే ఆయన రాష్ట్రానికి రావాల్సి ఉన్నప్పటికీ పలు కారణాల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ నేతలకు దశా, దిశను నిర్దేశించేందుకు ఆయన ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వస్తున్నారు. రాష్ట్రం ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ క్షేత్ర స్థాయిలో చాలా బలంగా ఉందని భావించినప్పటికీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలు కావడం, కనీసం స్వతంత్ర్య అభ్యర్థులతో కూడా పోటీపడి ఓట్లు తెచ్చుకోకపోవడం, పార్టీ పోటీ చేసిన 118 అసెంబ్లీ నియోజకవర్గాలకుగానూ 105 సెగ్మెంటల్లో పార్టీ డిపాజిట్లు కోల్పోవడం వంటి అంశాలపై 22వ తేదీన పార్టీ నేతలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై లోతుగా చర్చిస్తారు. రాష్ట్రంలో పార్టీ ఓటమికి దారి తీసిన పరిస్థితులపై ప్రధానంగా తెలుసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఈ మేరకు బిజెపి రాష్ట్ర నాయకత్వం అభ్యర్థుల ఓటమికి దారి తీసిన పరిస్థితులపై విపులంగా అమిత్‌షాకు ఇచ్చేందుకు ఇప్పటికే తగు నివేదికలను సిద్ధం చేసింది. అలాగే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కూడా అమిత్‌షా చర్చించనున్నారు. లోక్‌సభ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిని స్వయంగా తెలుసుకోవడంతో పాటు టికెట్లను ఆశిస్తున్న నేతల వివరాలను కూడా సేకరిస్తారు. అలాగే అసెంబ్లీ నాయకుల పనితీరు, అంతర్గత విభేదాలపై కూడా పార్టీ నేతలతో అమిత్‌షా కూలంకషంగా చర్చించే అవకాశమున్నట్లుగా తెలుస్తోంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోనూ రాష్ట్రంలో ప్రస్తుతం ఎవరితో పొత్తు ఉండే అవకాశం లేదన్న విషయాన్ని ఆయన స్పష్టం చేసే అవకాశాలు కూడా ఉన్నట్లుగా సమాచారం.

బద్ధ శత్రువులు మళ్లీ మిత్రులయ్యారు!

23 ఏళ్ల వైరాన్ని పక్కన పెట్టిన ఎస్‌పి, బిఎస్‌పి



లక్నో: 'రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు' అనే సామెత యుపిలో సమాజ్‌వాది పార్టీ, బిఎస్‌పిల పొత్త విషయంలో అక్షర సత్యమని రుజువైంది. దాదాపు 23 ఏళ్ల బద్ధ శత్రుత్వాన్ని పక్కన పెట్టి ఈ రెండు పార్టీలు చేతులు కలపడం ఎవరికైనా ఆశ్చర్యం కలిగించక మానదు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో తమ రెండు పార్టీలు చెరి 38 స్థానాల్లో పోటీ చేస్తాయని ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి శనివారం ప్రకటించారు. కాంగ్రెస్‌తో పొత్తు ఉండదంటూనే ఆ పార్టీకి అమేథి, రాయబరేలి స్థానాలను వదిలిపెడుతున్నట్లు వారు చెప్పడం గమనార్హం. ఒక రాజకీయ విప్లవం కోసం ఆ రెండు పార్టీలు దశాబ్దాల తమ శత్రుత్వాన్ని సైతం పక్కన పెట్టినట్లు కనిపిస్తోంది.' దేశ ప్రయోజనాల కోసం, ప్రజలకు సేవ చేయడం కోసం నేను 1995 నాటి గెస్ట్‌హౌస్ సంగటనను మరిచి ముందుకు సాగుతున్నాను' అన్న మాయావతి మాటల్లోనే ఈ విషయం స్పష్టమవుతోంది. రామమందిర ఉద్యమం తర్వాత అప్రతిహతంగా దూసుకుపోతున్న జిజెపిని అడ్డుకోవడానికి 1993 అసెంబ్లీ ఎన్నికల్లో ఎస్‌పి, బిఎస్‌పిలు పొత్తు పెట్టుకున్నాయి. అప్పటి ఎస్‌పి అధ్యక్షుడు ములాయం సింగ్, బిఎస్‌పి అధ్యక్షుడు కాన్షీరామ్‌ల మధ్య కుదిరిన ఈ పొత్తు ఫలించి ఆ కూటమి167 స్థానాలను గెలుచుకుంది. బిఎస్‌పి 67 స్థానాలను గెలుచుకోగా, ఎస్‌పి 109 సీట్లు గెలుచుకుంది. అయితే ఈ పొత్తు ఎంతోకాలం కొనసాగలేదు. ఎస్‌పి కార్యకర్తలు మాయావతిపై అమర్యాదకరంగా ప్రవర్తించిన మీరాబాయ్ మార్గ్ గెస్ట్ హౌస్ ఉదంతం రెండు పార్టీల బంధానికి ముగింపు పలికింది. లక్నోలోని మీరాబాయ్ గెస్ట్‌హౌస్‌లో మాయావతి తమ పార్టీ ఎంఎల్‌ఎలతో మంతనాలు జరుపుతున్న సమయంలో ఎస్‌పి కార్యకర్తలు ఆమె గదిలోకి చొరబడి విధ్వంసం సృష్టించడమే కాకుండా మాయావతిపై చేయి కూడా చేసుకున్నారు. బిఎస్‌పి ఎంఎల్‌ఎలు ఆమెను రక్షణ కల్పించలేక పోతే బిజెపి ఎంఎల్‌ఎ బ్రహ్మదత్ ద్వివేది ఆమెను క్షేమంగా గెస్ట్‌హౌస్‌నుంచి బైటికి తీసుకు వచ్చారు. ఆ సంఘటనే తర్వాత బిఎస్‌పి, బిజెపితో చేతులు కలిపి యుపిలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి కారణమైంది. ఈ సంఘటన రెండు పార్టీల సంబంధాల్లో మాయని మచ్చగా మిగిలిపోయింది. రెండు పార్టీల మధ్యపొతుత్కు కాన్షీరామ్ లెక్కలేనన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ మాయావతి ససేమిరా అన్నారని చెప్తారు. అయితే 23ఏళ్ల తర్వాత మాయావతే ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. ఇటీవల యుపిలో జరిగిన గోరఖ్‌పూర్, ఫూల్పూర్ లోక్‌సభ ఉప ఎన్నికల సందర్భంగా ఎస్‌పి అభ్యర్థులకు బిఎస్‌పి మద్దతు ఇచ్చింది. దీంతో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఖాళీ చేసిన ఆ రెండు స్థానాలను ఎస్‌పి గెలుచుకుంది. ఇక 2019 లోక్‌సభ ఎన్నికల్లో గనుక రెండు పార్టీలు తమ ఓటు బ్యాంకులపై పట్టును కొనసాగించినట్లయితే రాష్ట్రంలో బిజెపికి గడ్డుకాలం తప్పదు. రాజకీయంగా అత్యంత కీలకమైన యుపిలో దళితులు 22 శాతం, ఒబిసిలు 45 శాతం, ముస్లింలు 19 శాతం ఉన్నారు. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు చెరి 22 శాతం ఓట్లు వచ్చాయి.అది అలాగే కొనసాగిన పక్షంలో గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 71 సీట్లు గెలుచుకున్న బిజెపికి గడ్డుకాలం తప్పదని రాజకీయ విశ్లేషకుల అంచనా. మరో నాలుగు నెలల్లో జరగబోయే లోక్‌సభ ఎన్నికలు ఈ కూటమి భవిష్యత్తుతో పాటు దేశ రాజకీయాలను సైతం నిర్ణయించనున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో మన సత్తా చాటాలి

- కెసిఆర్ పాలనలోనే క్రీడా రంగం బలోపేతం : హరీశ్‌రావు



మన తెలంగాణ /సిద్దిపేట ప్రతినిధి : అంతర్జాతీయ స్థాయిలో జరిగే ఒలింపిక్స్, ఏషియన్ క్రీడా పోటీల్లో గెలుపొంది క్రీడాకారులు దేశం సత్తాను చాటాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 64వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ సిఎం కెసిఆర్ 14 సంవత్సరాలు సుదీర్ఘ పోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, అమలు చేసిన ఘనత సిఎం కెసిఆర్‌కే దక్కుతుందని అన్నారు. వ్యవసాయ రంగానికి నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు పంట పెట్టుబడి సాయం, రైతు బీమా పథకాలు దేశానికి దిక్సూచిగా మారాయన్నారు. అతి తక్కువ సమయంలోనే ఎక్కువగా అభివృద్ధి చెందింది తెలంగాణ రాష్ట్రమేనని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలను ఇతర రాష్ట్రాల వారు తమ తమ రాష్ట్రాల్లో అమలు చేసే విధంగా అడుగులు వేస్తున్నారని అన్నారు. సిద్దిపేటలో జాతీయ స్థాయి క్రీడా పోటీలు జరగటం ఎంతో సంతోషంగా ఉందని, క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని హరీశ్‌రావు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు పాతూరి సుధాకర్ రెడ్డి, ఫారూఖ్ హుస్సేన్, భూపాల్ రెడ్డి, కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్, స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రతినిధి ఆనంద్ ఈశ్వర్ పాండే, హ్యాండ్ బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.జగన్ మోహన్‌రావు, డీఈవో రవి కాంత్ రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి సుజాత తదితరులు ఉన్నారు.



రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్‌ను కలిసిన రాష్ట్ర వికలాంగుల సంస్థ ఛైర్మన్ వాసుదేవరెడ్డి

జాగృతి 'అంతర్జాతీయ' సదస్సు

- గవర్నర్‌ను కలిసి ఆహ్వానించిన ఎంపి కవిత

మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 20 వరకు నగరంలోని నోవాటెల్ హోటల్‌లో జరిగే అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సుకు రావాల్సిందిగా గవర్నర్ నరసింహన్‌ను ఎంపి కవిత శనివారం రాజ్‌భవన్‌కు వెళ్లి ఆహ్వానించారు. 19వ తేదీన కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా అన్నాహజారే హాజరవుతున్నారని గవర్నర్ కు వివరించగా, ముగింపు కార్యక్రమానికి (20వ తేదీన) హాజరుకానున్నట్లు స్పష్టత ఇచ్చారు. 'గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి నూతన ఆవిష్కరణలు' అనే అంశంపై ఈ సదస్సులో చర్చ జరుగుతుందని గవర్నర్‌కు కవిత వివరించారు. 2030 వ సంవత్సరం వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుదల చేసిన 17 అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి నిర్వహిస్తోందని ఆమె పేర్కొన్నారు. 103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతారని, 16దేశాల నుంచి 70 మంది వక్తలు 40మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారని ఎంపి కవిత పేర్కొన్నారు.



కార్యక్రమ వివరాలు

మొదటిరోజు యువత అభివృద్ధిపై ప్రముఖ సీనియర్ పాత్రికేయులు శేఖర్ గుప్తా చర్చాగోష్టిని నిర్వహిస్తారు. పది వేర్వేరు హాళ్లలో వేర్వేరు అంశాలపై చర్చాగోష్టులు జరగనున్నాయి. ప్రపంచ ప్రగతిలో యువత పాత్రపైనా యువ నాయకులు మాట్లాడుతారు. రెండోరోజు నైపుణ్య శిక్షణ, సమతులాభివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు, ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. వీటిని అంతర్జాతీయంగా ఆయా రంగాల్లో నిష్ణాతులు నిర్వహిస్తారు.

బిగ్ సి దొంగలు దొరికారు

- రూ.5,54,439 విలువైన మొబైల్ ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సిపి అంజనీ కుమార్

మనతెలంగాణ, సిటీబ్యూరో : ఖరీదైన మొబైల్ ఫోన్లను చోరీ చేసిన దొంగలను వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది శనివారం పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5,54,439విలువైన 35 మొబైల్ ఫోన్లు, ఆరు మెమోరి కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ అంజనీ కుమార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని బహదూర్‌పుర, కిషన్‌భాగ్, మహమూద్ నగర్‌కు చెందిన ఫయాజుల్లా ఖాన్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పాత బట్టలు, అల్లం విక్రయం వ్యాపారం చేస్తున్నాడు. మద్యం తాగడం, పేకాట, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడేవాడు. ఫయాజుల్లా ఖాన్ స్నేహితుడు షేక్ అహ్మద్‌తో కలిసి 2014 నుంచి 2016 వరకు ఆరు దొంగతనాలు చేశారు. ఇద్దరిపై చాదర్‌ఘట్, బేగంపేట, చిలకలగూడ, ఎల్‌బినగర్ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. 2016లో చాదర్‌ఘట్ పోలీసులు అరెస్టు చేసి పిడి యాక్ట్‌పై జైలుకు పంపారు. విడుదలైన తర్వాత శంషాబాద్ ఇంటర్‌నేషనల్ ఏయిర్ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో , రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో చోరీలకు పాల్పడడంతో అరెస్టు చేసి జైలుకు పంపారు. విడుదలైన తర్వాత పాత వ్యాపారం చేశాడు. వ్యసనాలకు డబ్బులు సరిపోకపోవడంతో గత ఏడాది డిసెంబర్28వ తేదీన సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని భీరమ్‌గూడలోని బిగ్ సిలో చోరీ చేసి 35 మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లాడు. చోరీ చేసిన మొబైల్ ఫోన్లను జగదీష్ మార్కెట్ విక్రయించేందుకు రాగా వెస్ట్ జోన్ పోలీసులు ఫయజుల్లా ఖాన్ పట్టుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డిసిపి రాధాకిషన్ రావు పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు, ఎస్సైలు మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి, దుర్గారావు, ఎండి ముజఫర్ ఆలీ, కానిస్టేబుల్ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.



బయోమెట్రిక్ ఉంటేనే 'అనుబంధం'

- ఇంజనీరింగ్ అఫిలియేషన్లకు జెఎన్‌టియు నిబంధన

మనతెలంగాణ/హైదరాబాద్:ఇంజనీరింగ్ కళాశాలల్లో బయోమెట్రిక్ హాజరు విధానం తప్పనిసరి కానుంది. విద్యార్థులు, అధ్యాపకులకు బయోమెట్రిక్ విధానం కచ్చితంగా అమలు చేస్తేనే కళాశాలకు అనుబంధం గుర్తింపు జారీ చేస్తామని జెఎన్‌టియుహెచ్ స్పష్టం చేసింది. 2019–20 విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల నుంచి అఫిలియేషన్ల దరఖాస్తుల మార్గదర్శకాలలో బయోమెట్రిక్ హాజరు నిబంధనను పొందుపరిచింది. బయోమెట్రిక్ హాజరుతో రిజిస్టర్‌లో పొందుపరిచిన హాజరు ఒకే విధంగా ఉండాలని పేర్కొంది. అధ్యాపకులు యూనివర్సిటీ నిబంధనల మేరకు మాత్రమే సెలవులు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా తీసుకునే సెలవులను అంగీకరించమని పేర్కొంది. కళాశాలలకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఎఐసిటిఇ) మంజూరు చేసిన సీట్ల ఆధారంగా అధ్యాపకులను భర్తీ చేసుకోవాలని తెలిపింది. ఇదివరకు భర్తీ అయిన సీట్లను బట్టి అధ్యాపకులను నియమించుకునే విధంగా జెఎన్‌టియుహెచ్ వెసులుబాటు కల్పించేది. ఈ సారి నుంచి మాత్రం ఎఐసిటిఇ మంజూరు చేసిన కోర్సుల సీట్ల ఆధారంగా అధ్యాపకులను భర్తీ చేసుకోవాలని స్పష్టం చేసింది. కచ్చితంగా టైం ప్రకారం తరగతులు నిర్వహించడంతోపాటు ల్యాబ్‌లలో విద్యార్థులతో ప్రయోగాలు చేయించాలని తెలిపింది. గడిచిన మూడేళ్లలో 25 శాతం లోపు ప్రవేశాలు నమోదైన కళాశాలలకు అనుబంధం గుర్తింపు ఇవ్వమని జెఎన్‌టియుహెచ్ స్పష్టం చేసింది.

నామినేషన్ల ఉపసంహరణకు నేడు లాస్ట్

- పోటీ ఉన్నచోట విత్‌డ్రాలకు విశ్వప్రయత్నాలు
- రంగంలోకి దిగిన టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు



మన తెలంగాణ/హైదరాబాద్: మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్, వార్డు స భ్యులకు నామినేషన్ల ఉపసంహరణకు ఆదివారం చివరి రోజు కావడంతో పోటీ ఉన్నచోట ఏకగ్రీవాలు చేసేందుకు టిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎలు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. చిన్నా పెద్ద నాయకులను మచ్చిక చేసుకుంటున్నారు. పార్టీలకతీతం గా పోటీలో ఉన్న వారిని బుజ్జగిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 300లకు పైగా గ్రామ పంచాయతీల్లో ఒకే ఒక్క నామినేషన్ దాఖలు కావడంతో దాదాపు అవి ఏకగ్రీవాలకే కిందకు రానున్నాయి. వీటన్నింటిపై ఆదివారం సాయంత్రానికల్లా స్పష్టత రానుంది. టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వీలైనన్నీ ఎక్కువ స్థానాలు ఏకగ్రీవం చేయాలని అందుకు ఎంఎల్‌ఎలు కృషి చేయాలని ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి విడతలో 4468 గ్రామ పంచాయతీలకు ఆదివారం మూడు గంటల వరకే నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండటంతో టిఆర్‌ఎస్ నేతలు వారి ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఏ విధంగానైనా అభ్యర్థులను ఉపసంహరించే విధంగా చేసి ఎక్కువ ఏకగ్రీవాలు చేయించిన ఘనత ఉండాలని పాకులాడుతున్నారు. కానీ మేజర్ పంచాయతీల్లో కొంతమంది అభ్యర్థులు గ్రామ ప్రథమ పౌరుడి పీఠాన్ని దక్కించుకునేందుకు పోటీ నుంచి తప్పుకునే పరిస్థితి కనిపించడంలేదు. రాష్ట్రంలో నాలుగు వేలకు పైగా కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు అయిన విషయం తెలిసిందే. వీటిలో మొదటి సర్పంచ్‌గా గెలిస్తే చిరస్థాయిగా మొదటి సర్పంచ్ పేరు ఉంటుందని ప్రలోభాలకు లొంగకుండా పోటీలో ఉండేందుకు నిర్ణయించుకున్నవారు అధికంగా ఉన్నారు. అలాంటి వారి బలహీనతలను ఆసరాగా తీసుకునేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. మరోవైపు కొన్ని పంచాయతీల్లో వేలం పాట, బెదిరింపులకు గురిచేయడం వంటివి చేయడంతో రాష్ట్ర ఎన్నికల సంఘం తీవ్రంగా స్పందించింది. వీటిపై విచారణ చేయాలని డిజిపిని ఆదేశించడంతో ఇలాంటి ఏకగ్రీవాలకు చెక్ పడింది.

ఏకగ్రీవం.. అభివృద్ధి మంత్రం

ఏకగ్రీవమైతే గ్రామాభివృద్ధి జరుగుతుంది.. అధిక నిధులొస్తాయని ప్రజాప్రతినిదులు పలు గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామసభలు పెట్టి మరీ వివరిస్తున్నారు. అభివృద్ధిపై ఆశలు చూపుతున్నారు. వివిధ గ్రాంట్‌ల రూపంలో వచ్చే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల వివరాలు తెలుపుతున్నారు. ఏకగ్రీవం చేసేపంచాయతీలకు జనాభా 5 వే ల లోపు ఉంటే రూ.9 లక్షలు, 5 వేల కంటే పైగా ఉంటే రూ.15 లక్షలు నజరానా అందుతుంది. ఎంఎల్‌ఎల సిడిఎఫ్ నుంచి మరో రూ.10 లక్షలు నిధులు కేటాయిస్తామని ఇటీవల టిఆర్‌ఎస్ అధినేత ప్రకటించిన విషయం విదితమే.

ఎస్‌పి, బిఎస్‌పి పొత్తు

సంపాదకీయం

ఇటీవల కొంతకాలంగా వినవచ్చిన రీతిలోనే ఉత్తరప్రదేశ్‌లో ప్రధాన ప్రాంతీయ రాజకీయ పక్షాలైన, సామాజిక న్యాయ సాధన వేదికలైన సమాజ్‌వాదీ (ఎస్‌పి), బహుజన సమాజ్ (బిఎస్‌పి) పార్టీలు పొత్తు కుదుర్చుకున్నాయి. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో చెరి 38 స్థానాల్లో పోటీ చేయాలని అమేథీ, రాయ్‌బరేలీ సీట్లు రెండింటినీ కాంగ్రెస్‌కు విడిచిపెట్టాలని నిర్ణయించాయి. ఎస్‌పి అధినేత అఖిలేశ్ యాదవ్, బిఎస్‌పి సారథి మాయావతి ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. బిజెపి పాలనకు సమాధికడతామని, ప్రధాని మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని అందుకోసమే తాము పొత్తు కుదుర్చుకున్నామని స్పష్టంగా ప్రకటించారు. కాంగ్రెస్‌పై మాత్రం పెద్దగా బాణాలు సంధించలేదు. అదే సమయంలో దానికి పొత్తులో చోటు కూడా ఇవ్వలేదు. అమేథీ, రాయ్‌బరేలీ స్థానాలను దానికి వదిలిపెడుతున్నట్టు ప్రకటించడం ద్వారా దానిని సఖ్యపక్షంగా గుర్తిస్తున్నట్టు గట్టి సంకేతమిచ్చారు. ఈ రెండు పార్టీలు గతంలో ఒక్క త్రాటిపై నడిచినప్పటికీ ఆ తర్వాత బద్ధ శత్రువులుగా మారిపోయాయి. ఒకరి పొడ ఒకరికి గిట్టని రీతిలో ద్వేషించుకున్నాయి.

గత లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలలో యుపిలో బిజెపి ప్రభంజనాలు వీచి అది అత్యధిక స్థానాలు గెలుచుకొని కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్కడ రాజకీయ పరిస్థితిలో మార్పు చోటుచేసుకున్నది. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల్లో యుపిలోని 80 స్థానాల్లో 72 సీట్లను గెలుచుకొని ఆ బలమ్మీదనే కేంద్రంలో అధికారాన్ని బిజెపి చేజిక్కించుకోవడం ఎస్‌పి, బిఎస్‌పిలలో అంతర్మథనానికి దారి తీసింది. అది, అవి రెండూ అనూహ్యంగా చేరువకావడానికి దోహదపడింది. గత ఏడాది కైరాన్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్‌ఎల్‌డి) ని కూడా కలుపుకొని ఏర్పాటయిన మహాకూటమికి ఈ రెండు పార్టీల స్నేహం ప్రాణమయింది. అక్కడ ఆర్‌ఎల్‌డికి చెందిన తబస్సుమ్ హసన్ బిజెపి అభ్యర్థి మీద ఘన విజయం సాధించారు. ఆ తర్వాత ఆర్‌ఎల్‌డి, కాంగ్రెస్‌లను కలుపుకొని ఈ రెండు పార్టీలు మహాకూటమిని కొనసాగిస్తాయనే ఊహాగానాలు వెలువడ్డాయి. కాని అవి ఇప్పుడు నిరూపణ కాలేదు. యుపిలో ఇప్పుడు ఎస్‌పి, బిఎస్‌పిలు పులి, సింహం వంటివి. ప్రధాన ఓటు బ్యాంకులయిన బిసిలు, ఎస్‌సిలు, ముస్లింలు వారి వెంట కలిసి కట్టుగా నడుస్తారని అనడం అతిశయోక్తి కాజాలదు. వాటి బలం ముందు కాంగ్రెస్‌ది నామమాత్రమే. అయితే ఇవి కాంగ్రెస్‌ను దూరం పెట్టడం ఒక రకంగా బిజెపికి సంతోషదాయకమనవచ్చు. కాంగ్రెస్ ముస్లిం ఓట్లను చీలుస్తుందని ఆ మేరకు తమకు మంచి జరుగుతుందని కమలనాథులు ఆశిస్తున్నారు. ఎస్‌పి, బిఎస్‌పి, కాంగ్రెస్, ఆర్‌ఎల్‌డి కలిస్తే వాటి ఉమ్మడి ఓటు వాటా 50 శాతానికి మించుతుందనే అంచనా ఉంది. కేవలం ఎస్‌పి, బిఎస్‌పి కలయిక వల్ల ఇది 43–44 శాతం వద్ద ఆగిపోవచ్చనే అభిప్రాయమూ వ్యక్తమవుతు న్నది. అయితే ప్రజలకు దూరమవుతున్న బిజెపిని కేంద్రంలో అధికారం నుంచి దించివేయడమనే మహా లక్ష్యంతో ఈ రెండు పార్టీలు ఏకమయినందున వీటికి ఊహించిన దానికంటే ఎక్కువగా ఓటు విజయం లభించే అవకాశాలు లేకపోలేదు.

తిరుగులేని దళిత పార్టీగా నిరూపించుకుంటున్న బిఎస్‌పికి, దాని సారథి మాయావతికి యుపిలోని ప్రతి నియోజకవర్గంలో 25 నుంచి 40 వేల వరకు ఓట్లు ఉన్నాయని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ రెండూ కలిసి 80 లోక్‌సభా స్థానాల్లో 50 మేరకు గెలుచుకోగలిగితే కేంద్రంలో తదుపరి ప్రభుత్వం ఏర్పాటులో నిర్ణాయకమైన శక్తిగా తమ మాటను నెగ్గించుకోగలుగుతాయి. ఇప్పటికే మాయావతి ప్రధాని అభ్యర్థిగా ప్రచారంలో ఉన్నారు. ఆమెను ప్రధానిని చేయగలిగితే యుపిని తాను పరిపాలించవచ్చుననే ఆశ అఖిలేశ్‌లో ఉండడం సహజం. ఈ పొత్తు తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందని వీరిద్దరూ స్పష్టం చేశారు. అఖిలేశ్ మాట్లాడుతూ మాయావతి తమకు తక్కువ స్థానాలు కేటాయించినా పరవా లేదనుకున్నానని ఆమె ఔదార్యం చూపి సమాన వాటా ఇచ్చారని అన్నారు. దీనిని బట్టి యుపి ఓటు బలంలో బిఎస్‌పిదే ఒకింత పైచేయిగా ఉన్నట్టు భావించవలసి ఉన్నది. ఏమైనప్పటికీ కేంద్రంలో రెండు జాతీయ పార్టీలను పక్కనపెట్టి చక్రం తిప్పాలనే ప్రాంతీయ పక్షాల చిరకాల ఆకాంక్ష నెరవేరే వైపు ఈ పొత్తు దారితీస్తే అది ఎంతైనా హర్షించదగిన పరిణామం కాగలదు.

రైతు బంధు... ఆదాయ హామీ



చూపు


ప్రధాని నరేంద్ర మోడీ రైతులకు ప్రత్యక్షంగా కనీస ఆదాయ హామీ పథకం ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నారన్న వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మూడు హిందీ రాష్ట్రాల్లో బిజెపి ఓటమి తర్వాత ఈ ఊహాగానాలు మరింత ఎక్కువయ్యాయి. 2019 సార్వత్రిక ఎన్నికలు త్వరలో రానున్నాయి కాబట్టి రైతు సమస్యలపై తక్షణం చర్యలు తీసుకోవలసిన అవసరం కూడా ఉంది. లేకపోతే సార్వత్రిక ఎన్నికల్లో భంగపాటు తప్పకపోవచ్చు. రైతులకు కనీస ఆదాయ హామీ విషయంలో ఇంతకు ముందు కూడా చర్చలు జరిగాయి. 2017లో అప్పటి ఆర్థిక సలహాదారు డా. అరవింద్ సుబ్రహ్మణ్యం చేపట్టిన వార్షిక ఆర్థిక సర్వే (2016– 17)లో దీన్ని ప్రస్తావించారు. ఈ సర్వే నివేదిక పార్లమెంటుకు సమర్పించడం జరిగింది. ఈ సర్వే నివేదికలో ఆయన ''సాధారణ కనీస ఆదాయం : మహాత్మతో మహాత్ముని‌లో సంభాషణ'' పేరుతో ఉన్న ఒక అధ్యాయంలో దీని గురించి రాశారు. అందులో సాధారణ కనీస ఆదాయ హామీ గురించి ప్రస్తావిస్తూ, పేదరిక నిర్మూలనకు ఇది తోడ్పడుతుందని చెప్పారు. పూర్తి స్థాయిలో కనీస ఆదాయ హామీ అనేది భారతదేశంలో ఇప్పటికిప్పుడు సాధ్యం కాకపోవచ్చు కానీ, పాక్షికంగా అమలు గురించి అయినా ఆలోచించాలని సిఫారసు చేశారు. దీని ప్రకారం గుర్తించిన జన సముదాయాలకు ఎలాంటి ఆంక్షలు, అర్హతా ప్రమాణాలు లేకుండా కనీస ఆదాయం అందించాలి. నిజానికి దేశంలోని మహిళలందరికీ దీన్ని వర్తింపజేయాలని కూడా ఆయన చెప్పారు. దీని వల్ల ప్రతి కుటుంబానికి కనీస ఆదాయం లభిస్తుందని, అది ఎంతో అవసరమని అన్నారు. కాని అంతకు మించి చర్చ ముందుకు వెళ్ళలేదు. ఎందుకంటే ప్రధానికి దీనిపై పెద్దగా ఆసక్తి కలగ లేదు. దీనివల్ల రాజకీయ ప్రయోజనాలు కూడా ఆయనకు కనిపించలేదు అప్పుడు కాని తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు రైతు సమస్యలకు ప్రతిస్పందించిన తీరు ఆ తర్వాత చర్చనీయాంశమైంది. ఇటీవల తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో రైతు సమస్యలే ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చాయి. రైతు రుణాలను రద్దు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. గెలిచిన తర్వాత వెంటనే ఈ హామీ అమలు కూడా చేసింది. తెలంగాణ విషయానికి వస్తే, ఇక్కడి పాలక పక్షం ఒక అడుగు ముందే ఉంది. ఎన్నికలకు చాలా ముందే రైతుబంధు పథకాన్ని జయప్రదంగా అమలు చేసింది. రైతులకు ఏటా ఎకరానికి 8 వేల రూపాయల ఆర్థిక సహాయం ఇచ్చే పథకమిది. నిజానికి ఇది కూడా అరవింద్ సుబ్రహ్మణ్యం చెప్పిన పాక్షిక సాధారణ కనీసాదాయ హామీ పథకం వంటిదే. ఇక్కడ ఎంపిక చేసుకున్న జన సముదాయం రైతులు. ఈ పథకంలో ముఖ్యమైన కీలకమైన అంశం ఏమంటే, ఎలాంటి ఆంక్షలు లేకుండా సహాయం ప్రత్యక్షంగా అందించడం. హామీ పథకాల్లో కీలకమైనది. రైతులు సేద్యం చేసినా చేయకపోయినా, వారికి అవసరం ఉన్నా లేకపోయినా ఈ ఆర్థిక సహాయం వారి ఖాతాలో జమ అవుతుంది. తెలంగాణలో కోటి నలభై లక్షల ఎకరాల సేద్యపు భూములకు చెందిన కోట్లాది రైతులకు దీని వల్ల ప్రయోజనం కలిగింది.

2017లో మధ్యప్రదేశ్‌లో రైతు ఆందోళనల తర్వాత అక్కడి ప్రభుత్వం విభిన్నమైన స్కీము అమలులోకి తీసుకువచ్చింది. భవంతర్ భుక్తాన్ యోజన దీని పేరు. ఇదేమిటంటే, గిట్టుబాటు ధరకు, మార్కెట్ ధరకు మధ్య ఉన్న తేడాను రైతుకు చెల్లించడం. ఆ తర్వాత ప్రభుత్వం ఒక మోడల్ ధర ప్రకటించింది. అంటే మధ్యప్రదేశ్, ఇరుగుపొరుగు రాష్ట్రాల్లో వ్యవసాయ ఉత్పత్తుల సగటు ధర. ఈ పథకాలపై విమర్శలు కూడా ఉన్నాయి. రైతుబంధు విషయంలో కౌలుదారులకు ప్రయోజనాలు లేవన్న విమర్శ వచ్చింది. పైగా సంపన్నులైన రైతులకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్నారన్న విమర్శ కూడా వచ్చింది. ప్రభుత్వం వెంటనే ఈ విమర్శలకు ప్రతిస్పందించి జె.పాల్ గ్రూపును నియమించింది. పథకం అమలును పర్యవేక్షించడానికి, సమీక్షించడానికి ఈ గ్రూపు పనిచేసింది. ఈ సర్వేలో తేలిందేమంటే, 2018లో జారీ అయిన చెక్కుల్లో దాదాపు అన్నీ ఇరవై వేలకు తక్కువ ఉన్న చెక్కులే. అంటే మోతుబరి రైతులెవ్వరు ఈ సహాయాన్ని తీసుకోలేదు. కేవలం 0.8 శాతం రైతులు మాత్రమే యాభై వేల రూపాయల చెక్కులు తీసుకున్నారు. అంతేకాదు, ఈ సర్వేలో తెలిసిన మరో వాస్తవం, రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకున్నారు. 77 శాతం మంది సేద్యం చేయడానికి అవసరమైన కొనుగోళ్ళకు ఉపయోగించారు. 92 శాతం రైతులు ఈ పథకం అమలు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సర్వే విమర్శలకు సమాధానమైంది.

మధ్యప్రదేశ్‌లో వచ్చిన విమర్శలు వేరు. అక్కడ మోడల్ రేటుకు మార్కెట్ ధరకు మధ్య చాలా తేడా వచ్చింది. మార్కెట్ ధరకు, గిట్టుబాటు ధరకు మధ్య తేడా ప్రభుత్వం ఎలాగూ చెల్లిస్తుందన్న నమ్మకంతో రైతులు తమ ఉత్పత్తులను అమ్మేశారు. కాని వారికి నష్టపరిహారం చాలా తక్కువ వచ్చింది. ఈ పరిణామం తర్వాత రైతులు ఈ పథకానికి దూరమయ్యారు. ఆంక్షలతో సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వచ్చే ఇబ్బందులు ఇలాగే ఉంటాయి. పైగా ఇంకా అనేక ఆంక్షలు కూడా మధ్యప్రదేశ్ ప్రభుత్వం అప్పుడు పెట్టింది. రైతు సమస్యల పరిష్కారానికి మూడు ప్రతిపాదనలు ముందుకు వస్తున్నాయి. మొదటిది రుణాల రద్దు. ఇప్పుడు ఎన్నికైన కాంగ్రెస్ ప్రభుత్వాలు వెంటనే ఈ పని చేశాయి. రుణాల రద్దు వల్ల ఎలాంటి ప్రయోజనం లేదన్న విమర్శలు కూడా వచ్చాయి. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ రాసిన ఒక పత్రం ఈ నేపథ్యంలో ముందుకు వచ్చింది. ఆయన కూడా రుణాల రద్దును ఇష్టపడలేదు. అలాగే అరవింద్ సుబ్రహ్మణ్యం కూడా రుణాల రద్దు పట్ల వ్యతిరేకతే చూపించారు. పైగా చిన్నకారు, సన్నకారు రైతులు జాతీయ బ్యాంకుల నుంచి లేదా కోఆపరేటివుల నుంచి తీసుకునే రుణాలు తక్కువ. వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకునేవి ఎక్కువ ఉంటాయి. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్ కూడా రుణాల రద్దును వ్యతిరేకించారు. రెండవ పరిష్కారం తెలంగాణ ముఖ్యమంత్రి అమలు చేస్తున్న రైతుబంధు పథకం. ఈ పథకం ఎన్నికల్లో గొప్ప రాజకీయ విజయాన్ని సాధించి పెట్టింది. ఇందులో ప్రత్యేకత ఏమంటే, ఖచ్చితంగా ప్రయోజనం పొందవలసిన సముదాయాన్ని గుర్తించడం, ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రత్యక్షంగా ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాలో వేయడం. భారతదేశంలో సంక్షేమ పథకాలకు అవినీతి చెదలు పట్టడానికి ముఖ్యమైన కారణం అనేక ఆంక్షలతో సహాయాన్ని అందించే ప్రయత్నాలు. రైతు బంధు పథకం వినూత్నమైనది. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఆర్థిక సహాయం అందించడం వల్ల అవినీతికి, దుర్వినియోగానికి ఆస్కారం ఉండదని నిరూపించింది. మరో ముఖ్యమైన విషయమేమంటే, రైతులు అప్పులు చేసిన తర్వాత రుణాల రద్దు వంటిది కాదు, అప్పు చేయవలసిన అవసరం లేకుండా ముందే కావలసిన ఆర్థిక సహాయం అందించే పథకమిది. దీనికి తోడు తెలంగాణ ప్రభుత్వం రైతు బీమాను కూడా ప్రవేశపెట్టింది. ఇది రైతులకు జీవిత బీమా పథకం. ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తుంది. 5 లక్షల రూపాయలకు బీమా సౌకర్యం రైతులకు కల్పించింది. బహుశా తెలంగాణలో కెసిఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమా పథకాలే ప్రాతిపదికగా కొత్త పథకాలను ప్రధాని మోడీ ప్రకటించే అవకాశం ఉంది. యావత్తు దేశంలో రైతుబంధు పథకం అమలు చేయాలని ఎన్నికల తర్వాత కెసిఆర్ చెప్పిన మాటలు నిజమయ్యేలా ఉన్నాయి.

✻ శరత్ దావల (ది వైర్)

మహిళల పాలన పాకానపడుతుందా?



అనిల్ మేర్జ

దాదాపు 6 వేలకు పైగా గ్రామ పంచాయతీలకు మహిళలు నేతృత్వం వహించనున్నారు. అయితే కేవలం పేపర్ల మీదనే కాకుండా నిజమైన అధికారాలు మహిళలు చేతుల్లో ఉండాల్సిన అవసరం ఉంది. విధాన నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. అయితే ప్రస్తుత సమాజంలో ఆ పరిస్థితులు కనబడడం లేదు. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాల్సిన మహిళలు ఆ దిశగా ఆలోచించడం లేదు. ఇది బాధాకరమైన అంశం. మహిళా రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలి అంటే మహిళలు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి. రాజకీయ హక్కులు పూర్తి స్థాయిలో మహిళలు ఉపయోగించుకున్నపుడు మాత్రమే మహిళా సాధికారికత సాధ్యపడుతుంది.

తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో గ్రామ పంచాయతీలు క్రీయాశీలక పాత్ర పోషిస్తూ ఉంటాయి. మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థలో గ్రామీణ ప్రాంతాల సంస్థాగత అభివృద్ధి అవసరం. దాని కోసం గ్రామాల్లో పంచాయతీ వ్యవస్థ పటిష్ఠంగా నిర్మాణం జరగాల్సిన అవసరం ఉంది.

గత ఏడాది గ్రామ పంచాయతీ సభ్యుల పదవీ కాలం ముగియడంతో తాత్కాలిక ప్రాతిపదికన అధికారులకు గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించడం జరిగింది. అయితే ప్రత్యేకాధికారుల పాలనలో గ్రామాల్లో పరిపాలన గాడి తప్పింది. సరియైన నిర్వహణ లేక అనేక గ్రామ పంచాయతీలు ఒడిదుడుకులు ఎదుర్కొన్నాయి.



ఇక తెలంగాణలో ఎన్నికలు ముగిసిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలపట్ల దృష్టి పెట్టింది. నూతన పంచాయతీరాజ్ చట్టం 2018 వచ్చిన తర్వాత జరుగుతున్న తొలి తెలంగాణ పంచాయతీ ఎన్నికలు కావడంతో ఈ ఎన్నికలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. గ్రామ పంచాయతీ రిజర్వేషన్ల ఖరారులో ప్రభుత్వం కొంత ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ చివరకు వాటికి రిజర్వేషన్ల ఖరారు చేయడం, ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ఎన్నికల ప్రారంభమై సాగుతోంది.

అయితే గ్రామాల అభివృద్ధిలో పురుషులతో పాటుగా మహిళలకు కూడా సమానమైన పాత్ర ఉంటుంది. మహిళా భాగస్వామ్యాన్ని పంచాయతీరాజ్ వ్యవస్థలో పెంపొందించడం ద్వారా మహిళలకు రాజకీయ వ్యవస్థ పట్ల, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పట్ల పూర్తి స్థాయిలో అవగాహన కల్పించవచ్చు. తద్వారా మహిళా సాధికారత సాధ్యపడుతుందనే ఉద్దేశంతో 73వ రాజ్యాంగ సవరణ ద్వారా 243వ ఆర్టికల్ లో స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం జరిగింది. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో 50 శాతం సీట్లు మహిళలకు కేటాయించడ్డాయి. ఇది మహిళల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుంది.

అయితే భారతదేశం పితృస్వామిక దేశం. భారతీయ సమాజంలో పురుషాధిక్యత ఉంటుంది. ఇది పట్టణ ప్రాంతాలలో కన్నా గ్రామీణ ప్రాంతాలలో అధికంగా కనిపిస్తూ ఉంటుంది. సామాజిక సమానత్వం సాధించాలి అంటే అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలి అనే ఉద్దేశంతో రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. పురుషులతో పాటు మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించబడ్డాయి. ''సమాజ అభివృద్ధిని నేను ఆ సమాజంలో ఉన్న మహిళల అభివృద్ధితో కొలుస్తాను'' అన్నారు డా.బి.ఆర్.అంబేద్కర్. అయితే గ్రామీణ ప్రాంతాలలో అనుకున్న స్థాయిలో మహిళల అభివృద్ధి కనిపించడం లేదు. గ్రామ పంచాయతీలు 50 శాతం మహిళలకు కేటాయించబడినప్పటికీ మహిళా సాధికారికత సాధ్యపడడం లేదు.


విధానపర నిర్ణయాల్లో, అభివృద్ధి చర్యలలో గ్రామీణ మహిళలకు పూర్తిగా అధికారాలు ఉన్నప్పటికీ వారు నిర్ణయాధికారాన్ని పూర్తిగా పురుషుల చేతిలోనే పెడుతున్నారు. అధికారికంగా వారే సర్పంచ్‌లు అయినప్పటికీ అనేక ప్రాంతాల్లో వారు గుర్తింపునకు నోచుకోలేకపోతున్నారు. ఇది మహిళా అభివృద్ధికి ప్రతిబంధకంగా మారుతుంది.

దాదాపు 6 వేలకు పైగా గ్రామ పంచాయతీలకు మహిళలు నేతృత్వం వహించనున్నారు. కేవలం పేపర్ల మీదనే కాకుండా నిజమైన అధికారాలు మహిళలు చేతుల్లో ఉండాల్సిన అవసరం ఉంది. విధాన నిర్ణయాలలో మహిళల భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాజంలో ఆ పరిస్థితులు కనబడడం లేదు. స్వేచ్ఛగా నిర్ణయాలు తీసుకోవాల్సిన మహిళలు ఆ దిశగా ఆలోచించడం లేదు. ఇది బాధాకరమైన అంశం. మహిళా రిజర్వేషన్లు పూర్తి స్థాయిలో ఉపయోగపడాలి అంటే మహిళలు తమ హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలి.

రాజకీయ హక్కులు పూర్తి స్థాయిలో మహిళలు ఉపయోగించుకున్నపుడు మాత్రమే మహిళా సాధికారికత సాధ్యపడుతుంది. మహిళలు తమ హక్కులను కాపాడుకుంటూ పూర్తి స్థాయిలో తమ విధులను నిర్వర్తించినపుడు మాత్రమే మహిళా రిజర్వేషన్లు వెల్లువిరుస్తాయి. ఆ దిశగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఓటర్లు కూడా రానున్న పంచాయతీ ఎన్నికల్లో సరియైన మహిళా అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు మెంబర్లగా ఎన్నుకుంటారని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో వారు కీలకంగా మారుతారని, పంచాయతీల పరిపాలనలో పురుషులకు దీటుగా మహిళల పాలన ఉంటుందని ఆశిద్దాం.

ఈ పేజీకి రచనలు పంపవలసిన మెయిల్ :
editor@manatelangana.org

ఆడపిల్ల శాపం కాదు, వరం!



యం. రాంప్రదీప్
9492712836

భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ తొలిసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జనవరి 24 ను జాతీయ బాలికా దినోత్సవంగా జరుపుతారు. 2018 సంవత్సరానికి గాను నోబెల్ శాంతి బహుమతి పొందిన ఇరాక్ యువతి నాడియా మురాద్‌కు, 2014లో నోబెల్ శాంతి బహుమతి పొందిన మలాలా యూసఫ్ జాయ్ (పాకిస్థాన్) లకు మధ్య కొన్ని పోలికలున్నాయి. ఇద్దరూ సాధారణ కుటుంబంలో పుట్టినవారే.

మలాలాపై తాలిబాన్ ఉగ్రవాదులు దాడి చేసి, ఆమెని చంపడానికి ప్రయత్నించగా,నాడియాపై ఐసిస్ ఉగ్రవాదులు దాడిచేసి ఆమె కు నరకం చూపారు. అయితే ఇరువురూ తమకెదురైన పరిస్థితులను ధైర్యంగా అధిగమించి తమ లాగా దాడులకు గురైన బాధితుల పక్షాన నిలబడి పో రాటం చేస్తున్నారు. ఆధునిక సమాజంలో ఆడపిల్లలకు మలాలా తెగువ, నాడియా ధైర్యం అలవడాలి.

2018 జనవరి 24న భారత ప్రభుత్వం 'ఆడపిల్ల ముల్లు కాదు, ఒక పుష్పం' అనే నినాదంతో 'జాతీయ బాలికా దినోత్సవాన్ని' నిర్వహించగా, 2018 అక్టోబర్ 11న ఐక్యరాజ్య సమితి 'అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని', 'ఆడపిల్లల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసి, రాబోయే తరాలకు సిద్ధం చేయాలనే' నినాదంతో నిర్వహిస్తుంది. బాలికా విద్య, పౌష్టికాహారం, బాల్య వివాహాలు, న్యాయ, వైద్య పరమైన హక్కులపై అవగాహన కల్పించేందుకు యు.ఎన్.ఒ. సాధారణ సభ 2012 అక్టోబర్ 11 నుండి 'అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని' జరపాలని 2011 డిసెంబర్ 19న నిర్ణయించింది. అప్పటి కెనడా స్త్రీ సంక్షేమ శాఖామంత్రి రోనా ఆంబ్రోస్ ప్రతిపాదనతో ఈ దినోత్సవానికి ఒక రూపం వచ్చింది. 'బాల్య వివాహాలకు ముగింపు పలుకుదాం!' అనే నినాదంతో 2012లో 'తొలి అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని' జరపడం జరిగింది.

ప్రపంచ వ్యాప్తంగా 100 కోట్లకు పైగా ఆడపిల్లలున్నారు.అయితే లాత్వియా, లిథియోనియా వంటి కొన్ని యూరప్ దేశాలను మినహాయిస్తే మిగతా దేశాలలో బాలుర సంఖ్యతో పోలిస్తే బాలికల సంఖ్య తగ్గుతోంది. మన దేశంలో కేరళ, పుదుచ్చేరి వంటి ప్రాంతాలలో ఆడపిల్లల పరిస్థితి ఆశాజనకంగా ఉండగా, బీహార్, అరుణాచల్‌ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఆడపిల్లల సంఖ్యతో పాటు, వారి అక్షరాస్యత శాతం కూడా చాలా తక్కువగా ఉంది.

2011 జనాభా లెక్కల ప్రకారం మన దేశంలో ప్రతి 1000 మంది బాలురకు కేవలం 918 మంది ఆడపిల్లలు మాత్రమే ఉన్నారు (0 నుండి 6). 2031 నాటికి ఆడపిల్లల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం తెలియజేస్తుంది.'బేటీ పడావో, బేటీ బచావో' వంటి పథకాలు, కె.జి.బి.వి. పాఠశాలల వల్ల ఆడపిల్లల్లో కొంత మే రకు 'డ్రాపౌట్స్' శాతం తగ్గింది. స్కానింగ్ సెంటర్లపై సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల, కొంత మంది తల్లిదండ్రుల మూఢనమ్మకాల వల్ల భ్రూణహత్యలు పెరుగుతున్నాయి. స్కానింగ్ ద్వారా ఆడపిల్ల అని నిర్ధారిస్తే శుక్రవారమని, మగ శిశువు అని తేల్చితే గురువారమనే రహస్య సంకేతాలని కొందరు వైద్యులు ఉపయోగిస్తూ భ్రూణ హత్యలకు పరోక్షంగా దోహదపడుతున్నారు. గతంలో రాజ్యలక్ష్మి, బంగారు తల్లి వంటి పథకాలు ఆడపిల్లల సంక్షేమం కోసం అమలు చేయబడ్డాయి. ఇటువంటి పథకాలను పునరుద్ధరించి పటిష్టంగా అమలు చేయాలి. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రత కోసం 'షీటీమ్స్' ఏర్పాటు చేసినట్లు దేశ వ్యాప్తంగా ఈ తరహా టీమ్స్‌ని ఏర్పాటు చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో అధికార లెక్కల ప్రకారం 14 వేల మంది బాలికలు బడి బయట వున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం పాఠశాలల్లో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు డ్రాయింగ్, కుట్టుపని వంటి వాటిల్లో శిక్షణ నిస్తున్నారు. పార్ట్‌టైం ఇన్‌స్ట్రక్టర్స్‌ని శాశ్వత ప్రాతిపదికన ఫుల్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్‌గా మార్చాలి. గతంలో ఏర్పాటు చేసిన మహిళా ప్రాంగణాలని మరింత పటిష్టం చేసి బాలికలకు, యువతులకు వారికి నచ్చిన రంగంలో శిక్షణ నిచ్చి, ఉపాధి కల్పించాలి. నేటి బాలికే రేపటి మహిళ కాబట్టి అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఇచ్చిన ప్రాధాన్యతను బాలికా దినోత్సవానికి ఇవ్వాలి. వివా హం జరిపించే వివిధ మతాధిపతులకు ప్రభుత్వం షరతులతో కూడిన లైసెన్స్‌లను మంజూరు చేసి పర్యవేక్షించాలి. వివాహ రిజిస్ట్రేషన్లపై మరికొంత చైతన్యం తేవాలి. తద్వారా బాల్య వివాహాలకు కొంత మేర అడ్డుకట్ట వేయవచ్చు. అప్పుడే మలాలా అన్నట్లు ''ఈ ప్రపంచంలోకి వచ్చిన ప్రతి చిన్నారికి చదువుకొనే హక్కు ఉంది. విద్య ద్వారానే బాలికా సాధికారత సాధ్యమౌతుంది''.



ప్రతి ఆదివారం ప్రజాజీవన ప్రతిబింబం
మన తెలంగాణ
మన
మనపేజీ
మనందరిపేజీ
www.manatelangana.news
హైదరాబాద్ | ఆదివారం | 13 జనవరి | 2019



యాప్‌రే ఇదిగో నవలోకం

డిజిటల్ సమ్మోహిత భారత్

'అర చేతిలో వైకుంఠం' అనేది ఒకప్పటి మాట. కానీ సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా వినియోగంలోకి వచ్చిన నేటి రోజుల్లో అన్నీ అరచేతిలో ఇమిడిపోయే స్మార్ట్‌ఫోన్ ద్వారానే సమకూరుతున్నాయి. డిజిటల్ పరిజ్ఞానం యావత్తు విశ్వాన్నే కమ్మేసింది. మన అవసరాలన్నింటినీ ఇంటి గడప దాటకుండానే స్మార్ట్‌ఫోన్ ద్వారానే సమకూర్చుకునే వీలు కలిగింది. నగర జీవన విధానంలోనే విప్లవాత్మకమైన మార్పు వచ్చింది. స్మార్ట్ ఫోన్‌తో బంధం పెనవేసుకుపోయింది. 'అమ్మా! ఆకలేస్తోంది' అంటూ పిల్లలు అడగ్గానే వారికి ఏం కావాలో మొబైల్ యాప్ ద్వారా ఆర్డర్ ఇచ్చేస్తే నిమిషాల్లో ఇంటికే వచ్చి చేరుతున్నాయి. ఇంటిల్లిపాదీ షాపింగ్‌కు వెళ్ళాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా బుక్‌చేస్తే ఆ వస్తువే నడుచుకుంటూ ఇంటికొచ్చేస్తోంది. పిల్లల్ని తీసుకుని సినిమాకో, షికారుకో వెళ్ళాలనుకుంటే టికెట్లు దొరుకుతాయో లేదోననే బెంగ అవసరమే లేదు. ముందుగానే మొబైల్ యాప్ ద్వారా బుక్ చేసుకుంటే సరిగ్గా సమయానికి స్వంత కారు ఉన్నా లేకపోయినా మొత్తం కుటుంబమంతా క్యాబ్‌లో వెళ్ళి వచ్చేసే సౌకర్యం కలిగింది. అన్ని రకాల అవసరాలకూ మొబైల్ యాప్‌లు దారి చూపిస్తున్నాయి.


డాక్స్ యాప్ వ్యవస్థాపకులు, డా॥ సతీష్, డా॥ ఇన్నశేఖర్

స్మార్ట్ ఫోన్లు... – మొబైల్ యాప్‌లు

మన రోజువారీ అవసరాలకు ఒక్కో రకమైన మొబైల్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. మన దేశ జనాభా 120 కోట్లే అయినా మన స్మార్ట్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లు మాత్రం దాదాపు 150 కోట్లు. 2017 చివరి నాటికే 124 కోట్ల మొబైల్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు గూగుల్ ప్లే తన నివేదికలో పేర్కొన్నది. 2015తో పోలిస్తే మరుసటి సంవత్సరానికే యాప్‌ల డౌన్‌లోడ్ మూడు రెట్లు పెరిగింది. ఇక స్మార్ట్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 2017 చివరి నాటికే దేశంలో 29 కోట్ల మంది ఉంటే 2018 నాటికి 35 కోట్లకు పెరిగింది. మొత్తం స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఆండ్రాయిడ్ వాడేవారే దాదాపు 82% మంది ఉన్నారు. సగటున ప్రతీ స్మార్ట్ ఫోన్‌లో 62 యాప్‌లు ఉంటే అందులో 35 ఎప్పుడూ యాక్టివ్‌లో ఉంటున్నట్లు గూగుల్ ప్లే 2018 నివేదిక స్పష్టం చేసింది. ప్రపంచం మొత్తంమీద గూగుల్ ప్లే ద్వారా 330 బిలియన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకుంటే ఇందులో 11.2% భారతదేశంలోనే. జియో ఫోన్ ద్వారా 4 జి పరిజ్ఞానం 2016 సెప్టెంబరులో అందుబాటులోకి వచ్చిన తర్వాత 217% మేర వృద్ధి చోటుచేసుకుంది.



'ఫోర్ జి'తో డాటా విప్లవం


మన దేశ జనాభా 120 కోట్లు ఉంటే మొబైల్ ఫోన్ కనెక్షన్లు మాత్రం 103 కోట్లు. దేశంలో ఉన్న మొత్తం టెలిఫోన్ సర్వీసుల్లో 97.7% మొబైల్ ఫోన్లేనని టెలికామ్ రంగం పేర్కొన్నది. దాదాపు 15 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లలో 92% మొబైల్ ఫోన్లు డాంగిల్ ద్వారా పొందినవే. 2017లో స్మార్ట్‌ఫోన్ల ఉత్పత్తి, ఇతర దేశాల నుంచి దిగుమతి దాదాపు 64% పెరిగినట్లు ఇంటర్నెట్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. 2జి పరిజ్ఞానం ఉన్నప్పుడు డాటా వినియోగంలో ఇంటర్నెట్ స్పీడ్ తక్కువగా ఉండడంతో మొబైల్ ఫోన్ల ద్వారా అవసరాలను తీర్చుకోవడం నిదానంగా ఉండేదని 4 జి అందుబాటులోకి వచ్చిన తర్వాత, ముఖ్యంగా జియో ప్రవేశంతో, వంద రెట్ల వేగం పెరిగి స్మార్ట్ ఫోన్ల వినియోగం ఊపందుకుందని పేర్కొనింది.

మొబైల్ యాప్‌లతో ముడిపడిన జీవితం

మొబైల్ యాప్‌లు విస్తృతంగా వినియోగంలోకి రావడంతో అన్ని అవసరాలకూ దారులు దొరుకుతున్నాయి. రెడీమేడ్ ఆహార పదార్థాలకు స్విగ్గీ, జొమాటో, ఉబర్ ఈట్స్ లాంటి అనేకం ఉన్నాయి. ఉబర్, ఓలా, మేరు లాంటి క్యాబ్ సర్వీసులు ఉన్నాయి. సినిమాలకు 'బుక్ మై షో', చెప్పులు, దుస్తులు, ఎలక్ట్రానిక్స్ తదితరాలకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ లాంటివి ఉన్నాయి. బస్సు, రైల్వే, విమాన టికెట్లకు రకరకాల యాప్‌లు ఉన్నాయి. ఆన్‌లైన్ వైద్య సేవలకు డాక్స్ యాప్ లాంటివి ఉన్నాయి. పొద్దున లేచింది మొదలు నిద్రపోయే వరకు ఒక్కో రకమైన అవసరానికి మొబైల్ యాప్‌లు వినియోగంలోకి వచ్చాయి. కాలక్షేపం కోసం కోట్ల సంఖ్యలో గేమ్స్ యాప్‌లు ఉండనే ఉన్నాయి. అవసరమేదైనా మొబైల్ యాప్‌లు 'మేమున్నాం' అంటూ మనకి దారిచూపుతున్నాయి.

కడుపు నింపుతున్న స్విగ్గీ, జుమాటో

మాజేటి శ్రీహర్ష, నందన్ రెడ్డి, జైమిని రాహుల్ అనే ముగ్గురు యువకులు ఆరేళ్ళ క్రితం బెంగుళూరులో స్థాపించిన స్విగ్గీ అనే స్టార్టప్ కంపెనీ ఇప్పుడు యావత్తు దేశానికి విస్తరించింది. దేశంలోని ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో దాదాపు 38% వాటాతో రూ. 3290 కోట్ల నిధులను సమకూర్చుకుంది. నెలకు దాదాపు మూడు కోట్ల మందికి ఆహారాన్ని డెలివరీ చేస్తున్న స్విగ్గీ ఇందుకోసం సుమారు లక్ష మంది డెలివరీ ఏజెంట్లను వినియోగిస్తోంది. ఒక్కొక్కరికి నెలకు సగటున రూ.40 వేల వరకు సంపాదించుకునే ఉపాధి కల్పిస్తోంది. సరఫరా చేస్తున్న ఆహారపదార్థాల విలువ దాదాపు రూ. 100 కోట్ల డాలర్లని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా 232% మేర రెవిన్యూ పెంచుకున్నట్లు రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీల వివరాలు వెల్లడిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఉన్న రూ. 397 కోట్ల నష్టాన్ని పూడ్చుకుని రూ. 442 కోట్ల మేర ఆదాయాన్ని ఆర్జించింది. దీనికి పోటీగా ఉన్న జుమాటో సైతం ఫుడ్ డెలివరీ మార్కెట్‌లో 30% వాటా చేజిక్కించుకున్నట్లు 'రెడ్‌సీర్' అనే సంస్థ వెల్లడించింది. సుమారు రూ. 2632 కోట్ల మేర నిధులను సమకూర్చుకుని 40% వృద్ధిని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నమోదు చేసింది. ప్రతీ నెలా సగటున 2.10 కోట్ల డెలివరీలను చేస్తోంది. ఒక్కో డెలివరీ మీద ఈ రెండు సంస్థల ఏజెంట్లకు సగటున రూ. 45 చొప్పున ఒక్కొక్కరు నెలకు గరిష్టంగా రూ. 40 వేల వరకు సంపాదిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. డెలివరీ ఏజెంట్‌లకు ఒక్కో ఆర్డర్‌పై రూ. 45, ప్రతీ గంటకు సంస్థ నుంచి రూ. 30, వరుసగా ఎనిమిది గంటలు పనిచేస్తే ప్రోత్సాహకంగా రూ. 200 చొప్పున లభిస్తోంది. సగటున రోజుకు పది డెలివరీలతో రోజుకు కనీసంగా రూ. 890 ఆర్జిస్తున్నారు. దీనికి తోడు వ్యాపార విస్తరణ కోసం ఈ సంస్థలు, హోటళ్ళు ఆర్డర్ల మీద 50% వరకూ తగ్గింపు ధరలనూ సమకూరుస్తున్నాయి. దీంతో వినియోగదారులు ఇష్టమైన బిర్యానీ లాంటివి సగం ధరకే పొందగలుగుతున్నారు. ఎక్కువగా ఐటి, మార్కెటింగ్ సంస్థల్లో పనిచేసేవారు, కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగం చేసుకునేవారి నుంచే స్విగ్గీ, జుమాటోలకు ఆర్డర్లు వస్తున్నట్లు డెలివరీ ఏజెంట్లు తెలియజేశారు. వీటికి తోడు ఉబర్ ఈట్స్, డోమినోస్ పిజ్జా లాంటి అనేక సంస్థలు కూడా ఫుడ్ డెలివరీ ద్వారా గణనీయ స్థాయిలోనే వ్యాపారం నిర్వహిస్తున్నాయి.



స్వంత కారు లేకున్నా క్యాబ్ సర్వీసులు

దేశం మొత్తం మీద క్యాబ్ సర్వీసులు 2015లో పది లక్షల ట్రిప్‌లు వేయగా ఈ మూడేళ్ళలో క్యాబ్ సర్వీసుల మార్కెట్ సగటున 70% మేర పెరిగింది. ఉబర్ సంస్థలో నాలుగున్నర లక్షల మంది, ఓలాలో పది లక్షల మంది డ్రైవర్లకు ఉపాధి లభిస్తోంది. ఇటీవల హైదరాబాద్‌లోనూ క్యాబ్ సర్వీసులకు ప్రజల నుంచి ఆదరణ పెరగడంతో ఓలా సంస్థ ఆటో సర్వీసులను కూడా యాప్ కిందకి తీసుకొచ్చింది. గత ఆర్థిక సంవత్సరంలో ఓలా సంస్థ సుమారు రూ. 1300 కోట్ల మేర రెవిన్యూను ఆర్జించగా ఉబర్ రూ. 410 కోట్లను ఆర్జించింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే ఓలా సంస్థ రెవిన్యూ ఏకంగా 70% పెరగ్గా ఉబర్ వృద్ధి మాత్రం పది శాతానికే పరిమితమైంది. మరోవైపు బస్సు, రైలు, విమాన ప్రయాణాలకు గతంలోలాగ కౌంటర్ల వరకూ వెళ్ళి టికెట్లు బుక్ చేసుకునే అవసరం పోయి ఆన్‌లైన్ ద్వారానే జరుపుకునే వెసులుబాటు వచ్చింది. రైల్వే టికెట్లను బుక్‌చేసే ఐఆర్‌సిటిసి సంస్థ 2002లో రోజుకు కేవలం 29 టికెట్లను మాత్రమే బుక్‌చేయగా ఇప్పుడు అది 13 లక్షలకు పెరిగింది. ఏటేటా ప్రయాణీకుల నుంచి డిమాండ్ పెరుగుతోంది. 2011 మార్చి నాటికి ఏటా పది కోట్ల టికెట్లను మాత్రమే బుక్ చేసిన ఐఆర్‌సిటిసి మూడేళ్ళకే దాదాపు రెట్టింపయ్యే స్థాయికి చేరుకుంది. ఇక ఏటా సుమారు పది కోట్ల మంది విమాన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేస్తున్నారని, ఇందులో దాదాపు 50% డొమెస్టిక్ విమాన సర్వీసులేనని ప్రాక్సిస్ గ్లోబల్ అలయెన్స్ అనే అంతర్జాతీయ ట్రావెల్ సంస్థ పేర్కొనింది. ప్రతీ ఏటా డొమెస్టిక్ విమాన టికెట్లను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలుచేసే వారి సంఖ్య సగటున 15% చొప్పున పెరుగుతోందని, అంతర్జాతీయ విమాన సర్వీసులకు ఇది 12%గా ఉందని పేర్కొనింది. విమాన ప్రయాణికులు వారి ఆదాయంలో సగటున 4% ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నది.


స్విగ్గీ వ్యవస్థాపకులు మాజేటి శ్రీహర్ష, నందన్ రెడ్డి, జైమిని రాహుల్

మధ్యతరగతిని ఊరిస్తున్న వినిమయ సంస్కృతి

'ఇ కామర్స్' విస్తృతంగా వినియోగంలోకి రావడంతో కన్జ్యూమర్ వస్తువుల విక్రయం అనేక రెట్లు పెరిగింది. సౌందర్య సాధనాలు, హెయిర్ కేర్ ఉత్పత్తులు, దంత సంరక్షణ, ఆహార వస్తువులు, హోం కేర్ వస్తువులు... ఇలా రకరకాల వినిమయ వస్తువుల వినియోగం నాలుగైదేళ్ళుగా విస్తృతంగా పెరిగినట్లు ఐబిఇఎఫ్ (ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్) తన నివేదికలో పేర్కొనింది. మొత్తం ఎఫ్‌ఎంసిజి (ఫాస్ట్ మూవింగ్ కన్జ్యూమర్ గూడ్స్) వస్తువుల్లో దాదాపు మూడింట రెండు వంతులు వ్యక్తిగత వస్తువులు, ఆహార పదార్థాలదేనని తేల్చింది. ప్రపంచంలోనే నాల్గవ స్థానంలో మన దేశంలో వీటి వ్యాపారం 2018 మార్చి నాటికి దాదాపు రూ. 3.69 లక్షల కోట్లుగా నమోదైనట్లు పేర్కొనింది. మరో రెండేళ్ళకు ఇది రెట్టింపు అవుతుందని అంచనా వేసింది. ఎఫ్‌ఎంసిజి వస్తువుల్లో వినియోగదారులు 23% హెయిర్ కేర్, 18% ఆహార పదార్థాలు, 18% హెల్త్ సప్లిమెంట్‌లు, 15% దంత సంరక్షణ, ఐదు శాతం స్కిన్ కేర్ అవసరాలకు వెచ్చిస్తున్నట్లు తేలింది. ప్రతీ ఏటా ఇది సగటున ఏడు శాతం చొప్పున పెరుగుతూ ఉందని పేర్కొనింది. ఐటిసి, హిందుస్థాన్ లివర్ కంపెనీల ఉత్పత్తుల వ్యాపారమే దాదాపు రూ. 85 వేల కోట్లు ఉన్నట్లు పేర్కొనింది. మన దేశంలో తలసరి ఆదాయం ఏటేటా సగటున ఐదు శాతం చొప్పున పెరగనున్నట్లు ఐఎంఎఫ్ (ప్రపంచ ద్రవ్య సంస్థ) అంచనా వేయడంతో రానున్న కాలంలో ప్రజల కొనుగోలుశక్తి మరింతగా పెరిగి ఈ రంగంలో రెవిన్యూ వృద్ధి గణనీయంగా ఉంటుందని ఐబిఇఎఫ్ పేర్కొనింది. గతేడాది జూన్, సెప్టెంబరు మధ్యకాలంలోనే దాదాపు 16.5% వృద్ధి నమోదైనట్లు పేర్కొనింది. నగర జీవన విధానంలో వచ్చిన మార్పులు, తలసరి ఆదాయం పెరగడం, స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో ఉండడం, 24 గంటలూ షాపింగ్ చేసే సౌలభ్యం రావడంతో సమీప భవిష్యత్తులో కన్జ్యూమర్ మార్కెట్ వృద్ధి బాగా పెరుగుతుందని అంచనా వేసింది.

'ఇ కామర్స్'తో చేరువైన షాపింగ్ సంస్కృతి :

ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్నాప్‌డీల్ లాంటి 'ఇ కామర్స్' సంస్థల ద్వారా ప్రజలు వస్తువులను కొనుగోలుచేసే ధోరణి ఊపందుకుంది. 2017 చివరి నాటికి దేశంలో ఇంటర్నెట్ వినియోగదారులు 44.6 కోట్ల ఉండగా, గతేడాది సెప్టెంబరు నాటికి 56 కోట్లకు పెరిగిందని, ప్రతీ నెలా సగటున పది లక్షల మంది పెరుగుతూ ఉన్నట్లు టెలికాం రంగం అధ్యయనంలో తేలింది. ఇ కామర్స్ వేదికగా అత్యధిక షాపింగ్ చేస్తున్నది మన దేశమేనని ఐబిఇఎఫ్ నివేదిక వెల్లడించింది. 2017 చివరి నాటికే మన దేశంలో ఆన్‌లైన్ (ఇ కామర్స్) ద్వారా చేసిన కొనుగోళ్ళ విలువ సుమారు రూ. 1.24 లక్షల కోట్లు. ప్రపంచం మొత్తంమీద ఆన్‌లైన్ ద్వారా చేస్తున్న కొనుగోళ్ళలో భారతదేశం తొలి స్థానంలో ఉందని, 2012, 2017 మధ్య కాలంలో దాదాపు 70% వృద్ధి నమోదైందని పేర్కొనింది. అన్నింటికంటే ఎక్కువగా 48% కొనుగోళ్ళు ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించినవేనని, ఆ తర్వాతి స్థానంలో 29% స్థానంతో దుస్తుల విభాగం నిలిచిందని పేర్కొనింది. ప్రతీ ఏటా సగటున ఐదు శాతం చొప్పున స్మార్ట్‌ఫోన్ల కొనుగోళ్ళు పెరుగుతున్నాయి. ఇ కామర్స్ ద్వారా జరుగుతున్న మొత్తం కొనుగోళ్ళలో 50% ఎలక్ట్రానిక్స్ ఉంటే ఇందులో 90 శాతం మొబైల్ ఫోన్లే. గతేడాది జూలై నాటికి ప్రతీ రోజు సగటున 12 లక్షల కొనుగోళ్ళు ఆన్‌లైన్ ద్వారా జరుగుతున్నాయని, నెలకు అన్ని ఇ కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా జరుగుతున్న కొనుగోళ్ళు దాదాపు ఆరు కోట్లు ఉన్నట్లు పేర్కొనింది. మొత్తం కొనుగోళ్ళలో దాదాపు 50% మెట్రో నగరాల్లోనే జరుగుతున్నాయని, 38% ప్రధాన పట్టణాల్లో జరుగుతున్నట్లు తేలింది. దేశం మొత్తం మీద లక్ష పిన్‌కోడ్ కలిగిన గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఉంటే ప్రస్తుతం ఇ కామర్స్ ద్వారా 15 వేల పిన్‌కోడ్ కేంద్రాలకు డెలివరీ నెట్‌వర్క్ ద్వారా వస్తువుల రవాణా జరుగుతోంది. ప్రతీ నెలా దాదాపు కోటి మంది కొత్త వినియోగదారులు ఇ కామర్స్ రంగంలోకి చేరుతున్నారని, ప్రపంచంలోనే అత్యధికంగా భారత్‌లో ఉన్నట్లు ఐబిఇఎఫ్ పేర్కొనింది.



ఎక్కువ అమ్మకాలు... తక్కువ లాభం

'ఇ కామర్స్' ద్వారా ప్రజలు వారికి ఇష్టమైన వస్తువులను స్మార్ట్‌ఫోన్‌లోనే చూసుకునే వీలు కలిగింది. వారు కోరుకునే ఫీచర్లు ఆ వస్తువులో ఉన్నాయో లేవో దుకాణం దాకా వెళ్ళాల్సిన అవసరం లేకుండా పోయింది. తక్కువ మార్జిన్‌తో అమ్మడం ద్వారా ఎక్కువ సంఖ్యలో ఉత్పత్తులను విక్రయించవచ్చనే ఫార్ములాను ఇ కామర్స్ సంస్థలు అనుసరిస్తుండడంతో కొనుగోలుదారులు సైతం బహిరంగ మార్కెట్‌లో లభిస్తున్న ధర కంటే తక్కువకే లభిస్తోందన్న ఉద్దేశంతో వీటినే ఆదరిస్తున్నారు. తక్కువ మార్జిన్ ఉంటున్నప్పటికీ రెవిన్యూ, ఆదాయం మాత్రం గణనీయంగా ఉంటోంది. అటు వాణిజ్య సంస్థలకు, ఇటు కొనుగోలుదారులకూ లాభంగా ఉండడంతో పాటు డెలివరీ సిస్టమ్ ద్వారా లక్షలాది మందికి ఉపాధి లభిస్తోంది.



దుకాణాలను పెట్టి నిర్వహణ ఖర్చుల్ని కలుపుకుని వస్తువుని విక్రయించే సంప్రదాయ విధానం తగ్గిపోతోంది.

ఆన్‌లైన్ వైద్యులు

అత్యవసర సమయాల్లో ఆసుపత్రులకు వెళ్ళాలంటే ఎంత ఇబ్బందో చాలా మందికి అనుభవమే. సగటున ఒక్కో కుటుంబం వారి ఆదాయంలో దాదాపు ఇరవై శాతం వైద్యానికే ఖర్చు చేస్తోంది. ఈ అవసరాన్ని అవకాశంగా తీసుకున్న కొద్దిమంది వైద్యులు ఒక బృందంగా ఏర్పడి ఆన్‌లైన్ ద్వారా కన్సల్టేషన్ సేవలు అందిస్తున్నారు. ఆరేళ్ల క్రితం బెంగుళూరులో సతీష్, ఇన్న శేఖర్ అనే ఇద్దరు వైద్యులు 'డాక్స్‌యాప్' అనే పేరుతో ఒక మొబైల్ అప్లికేషన్‌ను తయారుచేసి విస్తృతం చేయడంతో ఇప్పుడు రోజుకు సగటున 1200 మందికి ఆన్‌లైన్ ద్వారానే చికిత్స చేస్తున్నారు. 24 గంటలూ పనిచేసే ఈ నెట్‌వర్క్‌లో ఎప్పుడూ కనీసంగా వెయ్యి మంది స్పెషలిస్టు డాక్టర్లతో పాటు రెండున్నర వేల మంది వైద్యులు అందుబాటులో ఉంటున్నారు. బిట్స్ పిలానీ నుంచి ఫార్మసీ పూర్తిచేసిన వైభవ్ అనే యువకుడు 'విజిట్' పేరుతో మొబైల్ యాప్ ద్వారా వైద్య సేవలను అందిస్తున్నాడు. నిమిషానికి ఏడు రూపాయల చొప్పున రకరకాల అనారోగ్య సమస్యలకు నిపుణులైన డాక్టర్ల ద్వారా కన్సల్టేషన్ అందిస్తున్నారు. ప్రతీ నిమిషం కనీసంగా 80 మంది ఆన్‌లైన్‌లో ఉంటున్నారని, చాటింగ్ ద్వారా ప్రస్తుతానికి ఉత్తరాది రాష్ట్రాలకు మాత్రమే సేవలను పరిమితం చేసినట్లు ఆ సంస్థ పేర్కొనింది. భాషాపరమైన సమస్య ఉన్నందున దక్షిణాది రాష్ట్రాలకు విస్తరించలేదని పేర్కొనింది. కానీ 'ఐ క్లినిక్' పేరుతో ఇంజనీరింగ్ పూర్తిచేసిన స్వయం ప్రకాశ్ అనే యువకుడు 1500 మంది డాక్టర్ల సాయంతో ఆన్‌లైన్ వైద్య సేవలను నిర్వహిస్తున్నారు. ఇక వీటికి తోడు ఆన్‌లైన్ ద్వారానే మందులను బుక్ చేసుకుంటే డోర్ డెలివరీ చేసే సంస్థలు, ఆన్‌లైన్ ద్వారానే విజ్ఞప్తి చేస్తే ఇంటికే వచ్చి రక్తనమూనాలను సేకరించే సంస్థలూ ఇటీవల పుట్టుకొచ్చాయి.

చేతిలో నగదు లేకుండానే ...

చేతిలో చిల్లిగవ్వ లేకున్నా అరచేతిలో ఇమిడే స్మార్ట్‌ఫోన్‌తో అనేకం సమకూర్చుకునే డిజిటల్ పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. నోట్ల రద్దు సమయం వరకూ అంతంతమాత్రంగా ఉన్న నగదు రహిత లావాదేవీలు ఇప్పుడు ఊపందుకున్నాయి. పేటిఎం లాంటి ఎన్నో సంస్థలు కనీస డిపాజిట్ నిబంధన లేకుండా బ్యాంకింగ్ లావాదేవీలను నిర్వహిస్తున్నాయి. గత ఆగస్టులో ఈ సంస్థ 29 వేల కోట్ల లావాదేవీలను నిర్వహించింది. సుమారు తొమ్మిదిన్నర కోట్ల మంది ఈ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు తేలింది. ప్రతీ నెలా సగటున వంద కోట్ల మంది ఈ యాప్‌ను వినియోగిస్తున్నారని, ఇంతటి ఆదరణ ఉన్నందునే ఇటీవలి కాలంలో కొన్ని ఎంపిక చేసిన నగరాల్లో అపార్టుమెంట్ల నిర్వహణ (మెయింటెనాన్స్) బిల్లులతో పాటు మున్సిపల్ శాఖ ద్వారా జరిగే చెల్లింపులు, బీమా తదితర సౌకర్యాలనూ అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దీపక్ అబ్బాట్ ఇటీవల వ్యాఖ్యానించారు. నగదురహిత లావాదేవీలు ఇటీవల గణనీయంగా పెరిగాయని గతేడాది జూలైతో పోల్చుకుంటే ఆగస్టులో 32% వృద్ధి నమోదైందని, ఒక్క నెలలోనే మూడు కోట్ల లావాదేవీల ద్వారా సుమారు రూ. 5293 కోట్ల నగదు బదిలీ జరిగిందని, పన్నెండు నెలల కాలానికి ఇది సుమారు రూ. 54 వేల కోట్లుగా ఉందని జాతీయ పేమెంట్స్ కార్పొరేషన్ పేర్కొనింది. స్విగ్గీ, జొమాటో, ఇ కామర్స్, ఓలా, ఉబర్, విమాన టికెట్లు... ఇలా ఆన్‌లైన్ ద్వారా చేసే కొనుగోళ్ళలో గరిష్టంగా చెల్లింపులు కూడా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. జేబులో పైసా కూడా లేకుండా బైటకు వచ్చామే అనే ఆందోళన అవసరం లేకుండాపోయింది. చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే చాలు ఏ అవసరాన్నయినా సమకూర్చుకునే డిజిటల్ ప్రపంచం ఆవిష్కృతమైంది. అందుకే డిజిటల్ సౌకర్యం లేని అనేక సంప్రదాయ దుకాణాలు, షోరూమ్‌లు క్రమంగా అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి, వాణిజ్యంలో పోటీ పడలేకపోతున్నాయి.

– యశస్వి







ఊరెళ్లిపోతున్న నగరం

- సంక్రాంతికి హైదరాబాద్ నుంచి పల్లెలకు 30 లక్షల మంది
- రద్దీకి తగ్గట్లు లేని ప్రజా రవాణా
- తీరని ఇబ్బందుల్లో ప్రయాణికులు
- దారుణంగా పిల్లలు, వృద్ధుల పరిస్థితి
- టోల్‌గేట్‌ల వద్ద భారీగా ట్రాఫిక్



మన తెలంగాణ / హైదరాబాద్ : సంక్రాంతి పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వెళ్లేందుకు ప్రయాణీకులు బస్ స్టేషన్‌లు, రైల్వే స్టేషన్‌లలో పోటెత్తారు. ఆర్‌టిసి శుక్రవారం నుంచే ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తున్నా జనం రద్దీకి ఏమాత్రం సరిపడడం లేదు. బస్సులు ఎక్కడుంటాయో అర్థం కాక కొందరు, ఏదో ఒక బస్సులో వెళ్దామనుకుని బస్టాండ్‌లకు చేరిన వారికి సీటు లభించక అవస్థలు పడుతున్నారు. పండుగ సమీపించే కొద్ది రద్దీ మరింత పెరుగుతుంటే అధికారులు మాత్రం బస్సుల సంఖ్యను మరింత కుదిస్తున్నారే తప్ప పెంచేందుకు చర్యలు తీసుకోవడం లేదు. బస్సుల సంఖ్యను పెంచేందుకు చొరవ చూపడం లేదు. ఒక ప్రాంతానికి వెళ్ళాల్సిన వారు దాదాపు వంద మంది కలిసి బస్టాండ్‌లో డిపో మేనేజర్లను కలిసి మొరపెట్టుకుంటున్నా తాము చేసేదేమీ లేదంటూ చేతులేస్తున్నారు. బస్సులు లేవని, సిబ్బంది కూడా లేరని, అవి సమకూరకుండా అదనపు బస్సులను, ట్రిప్పులను నిర్వహించడం సాధ్యమేకాదని వివరిస్తున్నారు. ప్రయాణికులు మాత్రం వారి అవసరాల్లోంచి ఆలోచిస్తూ అధికారుల తీరుపై ఆగ్రహావేశాలను వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని బస్సుల కారణంగా సీటు దొరకాలంటే కనీసం రెండు నుంచి ఆరు గంటల వేచి చూడాల్సి వస్తోంది, చంటి పిల్లలు, వృద్ధులతో ప్రయాణాలు చేయడం కష్టంగా మారిందని వాపోతున్నారు. పండుగ రోజుల్లో సరదాగా గడిపేందుకు వెళ్ళాలనుకుంటే ప్రయాణం దగ్గరే కష్టాలు మొదలవుతున్నాయని, బస్సుల్లోకి ఎక్కడం ఒక సాహసమేనని వ్యాఖ్యానిస్తున్నారు. రోజుకు వెయ్యికి పైగా ప్రత్యేక బస్సులను నడుపుతున్నా ప్రయాణికుల రద్దీ మాత్రం తగ్గడం లేదు.

రద్దీకి సరిపడాలేని ప్రత్యేక సర్వీసులు

సంక్రాంతి పండుగను దృష్టిలో ఉంచుకొని టిఎస్ ఆర్‌టిసి 5,252 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. ఇందులో తెలంగాణలోని పల్లెలు, పట్టణాలు, నగరాల ప్రజల కోసం 3673 సర్వీసులుకాగా, ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాలకు 1,579 సర్వీసులను నడుపుతున్నారు. ఇవి కాక నిత్యం ఎంజి బిఎస్ నుంచి బయలుదేరే 3,400 రెగ్యులర్ సర్వీసులు యధావిధిగా తిరుగుతున్నాయి. పండుగ సందర్భంగా ఉండే రద్దీని దృష్టిలో పెట్టుకుని రెగ్యులర్ సర్వీసులతో పాటు ప్రత్యేక సర్వీసులను నిర్వహిస్తోంది. శుక్రవారం 1,325 సర్వీసులను నడిపిన ఆర్‌టిసి శనివారం నాటికి ఈ సంఖ్యను 1338కి పెంచింది. ఆదివారం 1,989, సోమవారం 611 బస్సుల ప్రత్యేక బస్సులకు షెడ్యూలు రూపొందించింది. వీటితో పాటే అడ్వాన్స్ రిజర్వేషన్ పేరుతో మరి కొన్ని బస్సు సర్వీసులు ఉన్నాయి. మరోవైపు రోడ్ల మీద ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా నగర శివారు ప్రాంతాల నుంచే కొన్ని బస్సు సర్వీసులకు ప్లాన్ చేసింది. వరంగల్, యాదాద్రి వైపు రూట్‌లో వెళ్లే బస్సులను ఉప్పల్ క్రాస్‌రోడ్ నుంచి, సూర్యాపేట, నల్గొండ, ఖమ్మం రూట్లకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి, కర్నూలు, అనంతపూర్ రూట్లకు సిబిఎస్ నుంచి ఆత్మకూరు, నంద్యాల రూట్లకు కాచిగూడ నుంచి, తిరుపతి, తాండూరు రూట్లకు ఎంజిబిఎస్‌తో పాటు విజయవాడ నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి బస్సులను నడుపుతోంది. సంక్రాంతి పండుగ కోసం నగరం నుంచి దాదాపు 30 లక్షల మంది స్వగ్రామాలకు వెళ్లే అవకాశమున్నదని అధికారులు అంచనా వేస్తున్నారు.

అదనపు వడ్డన, అయినా తప్పని రద్దీ

పర్వదినాలు, ఇతరత్రా ప్రత్యేక పరిస్థితుల్లో ప్రయాణికులకు ప్రజా రవాణా వ్యవస్థ కీలకం. ఆర్‌టిసితో పాటు దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రయాణికుల రద్దీని అదనపు సర్వీసులకు శ్రీకారం చుడతాయి. పర్వదినాల్లో ప్రజా ప్రయాణాలను సొమ్ము చేసుకునేందుకు ఆర్‌టిసి, రైల్వేతో పాటు ప్రైవేట్ టూర్ ఆపరేటర్లు ఛార్జీలన్ని పెంచుకునేందుకు కొత్తకొత్త స్కీమ్‌లకు శ్రీకారం చుట్టాయి. ప్రత్యేక సర్వీసులకు 50 శాతం మేర అదనపు ఛార్జీలంటూ ప్రయాణీకులపై భారం వేస్తున్నాయి. అయినా ప్రయాణికుల రద్దీ తగ్గడం లేదు. ఛార్జీలు ఎక్కువైనా ప్రజలకు స్వగ్రామాలకు సురక్షితంగా వెళ్ళడానికి ఇదే మంచిదని వీటివైపే మొగ్గు చూపుతున్నారు. రైళ్లల్లో కూడా కాలు పెట్టడానికి కూడా వీలు లేని పరిస్థి తులు ఏర్పడుతున్నాయి. చంటి పిల్లలు, వృద్ధులు, గర్భిణులతో పాటు బాలింతల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ప్రైవేటు వాహనాలు ఇదే అదనుగా నిలువుదోపిడి చేస్తున్నాయి. సాధారణ ఛార్జీలకు ఐదు రెట్లు పెంచి వసూలు చేస్తున్నాయి. ప్రత్యేక సర్వీసుల నేపథ్యంలో నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులూ ఎదురు కాకుండా ఆర్‌టిసి పలు ప్రత్యేక చర్యలు తీసుకుంది. ఇందుకు పోలీసుల సహకారాన్ని తీసుకుంది. స్వగ్రామాలకు ప్రయాణికుల తరలించే బస్సులు పంతంగి, బీబీనగర్ తదితర టోల్ గేట్లు స్తంభించిపోయాయి. కనీసం ఐదు నుంచి పది కిలోమీటర్ల మేరకు వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో గంటల తరబడి నిరక్షించాల్సి వస్తుంది.

నేడు జన్ సాధారణ్ ప్రత్యేక రైళ్లు..

సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని శనివారం 60 జన సాధారణ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం కేవలం ఏడు రైళ్లను మాత్రమే నిర్వహించారు. వాటికి సంబంధించిన వివరాలను అధికారులు శనివారం విడుదల చేశారు. జన్‌సాధారణ రైళ్లకు సంబంధించి ఛార్జీల వివరాలను కూడా అధికారులు వెల్లడించారు. ఇందులో సికింద్రాబాద్ టు విజయవాడకు రూ.130, విజయవాడ టు హైదరాబాద్ రూ.135, తిరుపతి టు కాకినాడ టౌన్‌కు రూ.175, విజయవాడ టు విజయనగరం రూ.145, విజయనగరం టు విజయవాడకు కూడా రూ.145 నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు. ఈ రైళ్లన్నింటికి 16 జనరల్ సెకండ్ క్లాస్‌తో పాటు ఒక లగేజీ, బ్రేక్ వ్యాన్ కోచ్‌లుంటాయని అధికారులు వివరించారు. ఇందులో ప్రధానంగా 07192 నెంబర్ గల ట్రైన్ సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 7:30 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07193 నెంబర్ గల రైలు విజయవాడలో రాత్రి 8:25 గంటలకు బయలుదేరి తర్వాత రోజు తెల్లవారుజామున 2:25 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. అదే విధంగా 07194 నెంబర్ కలిగిన రైలు సికింద్రాబాద్‌లో రాత్రి 11:30 గంట లకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7:10 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07195 నెంబర్ గల ట్రైన్ విజయవాడలో ఉదయం 8:35 గంటలకు బయలుదేరి తర్వాత రోజు సాయంత్రం ఐదు గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ఈ ట్రైన్ నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు, మంగళగిరి స్టేషన్ల రాకపోకలు సాగిస్తోంది. 07191 నెంబర్ గల రైలు కాకినాడ టౌన్‌లో సాయంత్రం 6:45 గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7:45 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట మీదుగా బయలుదేరుతుంది. దీంతో పాటు 07184 నెంబర్ గల ట్రైన్ విజయవాడలో రాత్రి 9:10 గంటలకు బయలుదేరి తర్వాత రోజు ఉదయం 7:20 గంటలకు విశాఖనగరం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 07185 నెంబర్ కలిగిన ట్రైన్ విజయనగరంలో ఉదయం 7:45 గంటలకు బయలుదేరి సాయంత్రం నాలుగున్నర గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. ఈ రైలు నూజివీడు, ఏలూరు, తాడేపల్లి గూడెం, నిడదవోలు, రాజమండ్రి, ద్వారకపూడి, అనపర్తి, సామర్లకోట, పీఠాపురం, అన్నవరం, తుని, నర్సీపట్నం, ఎలమంచిలి, అనకాపల్లి, దువ్వాడ, కోటవలస స్టేషన్ల మీదుగా బయలుదేరుతాయని అధికారులు వెల్లడించారు.

సంక్రాంతికి టోల్ టాక్స్ రద్దు

సంక్రాంతి పండుగ సందర్భంగా రాష్ట్రంలో అన్ని టోల్‌గేట్ల దగ్గర రుసుము చెల్లింపును నాలుగు రోజుల పాటు రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. పండుగ సందర్భంగా నగరం నుంచి చాలా మంది ప్రజలు స్వస్థలాలకు వెళ్తున్నందువల్ల తొలుత ఈ నెల 14, 15 తేదీల్లో మాత్రమే టోల్ టాక్సును ప్రభుత్వం రద్దు చేసింది. అయితే పండుగకు ఒక రోజు ముందు, ఆ తర్వాత ఒక రోజు వరకు కూడా రద్దు చేస్తున్నట్లు తాజా ఉత్తర్వుల్లో ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. పండుగ సందర్భంగా వరుసగా ఈ నెల 13 నుంచి 16వ తేదీ అర్ధ రాత్రి వరకు రాష్ట్రంలోని అన్ని రహదారులపై ఉన్న టోల్ గేట్ల దగ్గర వాహనాలు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

వాహనాలు ఢీ

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్ వెళుతున్న 16 వాహనాలు ఒకటి తర్వాత మరోకటి వరుసగా 500 మీటర్ల లోపే మూడు చోట్ల ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు కొయంబత్తూర్ నుంచి హైదరాబాద్ వస్తుండగా ముందు వెళుతన్న లారీ ఢీకొనగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. కొద్ది దూరంలో 4 ఆర్‌టిసి బస్సులు ఢీకొన్నాయి. బస్సులలో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. మరి కొద్ది దూరంలో లారీ బులేరో వాహనం ఢీకొనడంతో బులేరో వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయింది. అదే విధంగా నాలుగు కార్లు ఒక దాని తర్వాత మరోకటి ఢీకొన్నాయి. అయితే ప్రమాదం జరిగిన వాహనాలలో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయట పడగా వాహనాలు ముందు, వెనుక భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలవడంతో 108 వాహనంలో షాద్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదం జరగడంతో సూమారు 2 గంటల పాటు 5 కీలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం కలిగింది. ఇది గమనించిన పోలీసులు, జివిమ్‌ఆర్ సిబ్బంది అప్రమత్తమై వెంటనే వాహనాలను నందిగామ పాత జాతీయ రహదారి వెంట మళ్లించారు.

నలుగురు ఎంఎల్‌సిలపై వేటు

(మొదటిపేజీ తరువాయి)

కొండా మురళి, భూపతిరెడ్డి, రాములు నాయక్, యాదవరెడ్డిలపై చర్యలు తీసుకోవాలని ఇటీవల టిఆర్‌ఎస్ చేసిన ఫిర్యాదుపై శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్ విచారణ చేపట్టారు. ఇరు పక్షాల వాదన విన్న ఛైర్మన్ తన నిర్ణయాన్ని ఇంకా వెల్లడించలేదు. ఆ నలుగురు ఎంఎల్‌సిలు కాంగ్రెస్ పార్టీలో చేరి, ఆ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయడంతో పాటు తాజా శాసనసభ ఎన్నికల్లో పోటీ కూడా చేశారు. వాటికి సంబంధించిన పూర్తి ఆధారాలను టిఆర్‌ఎస్ పార్టీ విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బి.వెంకటేశ్వర్లు విచారణ సమయంలో శాసనమండలి ఛైర్మన్‌కు సమర్పించారు. ఇరు పక్షాల తరపున న్యాయవాదులు కూడా వారి వాదనలను వినిపించారు. ఈ విషయంపై న్యాయ నిపుణులను సంప్రదించిన తర్వాత ఛైర్మన్ తన నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు సమాచారం. శనివారం విచారణ ముగిసిన నేపథ్యంలో సంక్రాంతి తర్వాత ఆ నలుగురు ఎంఎల్‌సిలపై అనర్హత వేటు వేసే అవకాశం కనిపిస్తోంది. పార్టీ మారిన నలుగురు ఎంఎల్‌సిలలో కొండా మురళి, భూపతిరెడ్డిలు స్థానిక సంస్థల కోటాలో ఎంఎల్‌సిలుగా ఎన్నికకాగా యాదవరెడ్డి ఎంఎల్‌ఎ కోటాలో, రాములు నాయక్ గవర్నర్ కోటాలో పదవులు పొందారు. కొండా మురళి తన భార్య, మాజీ మంత్రి కొండా సురేఖకు టిఆర్‌ఎస్ టికెట్ నిరాకరించడంతో భార్యతో సహా వెళ్లి కాంగ్రెస్‌లో చేరారు. టిఆర్‌ఎస్ నుంచి రాజ్యసభకు సభ్యుడిగా ఉండి కాంగ్రెస్‌లో చేరిన డి.శ్రీనివాస్‌కు అనుచరుడైన భూపతిరెడ్డి కాంగ్రెస్ తరపున నిజామాబాద్ రూరల్ ఎంఎల్‌ఎగా పోటీ చేసి పరాజయం పొందారు. నారాయణఖేడ్ టిఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన రాములు నాయక్ కాంగ్రెస్‌లో చేరారు. ఈనెల 17న అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవుతుండగా, 19న శాసనమండలి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఆ సమావేశాల కంటే ముందుగానే ఈ నలుగురి విషయంలో ఛైర్మన్ స్వామిగౌడ్ ఎలాంటి చర్యలు తీసుకోనున్నారో స్పష్టం చేయనున్నట్లు సమాచారం.

పార్టీ మారిన నలుగురు ఎంఎల్‌సిలపై చర్యలు తీసుకోవాలి

టిఆర్‌ఎస్ పార్టీ సభ్యులు ఉండి, ఎంఎల్‌సిలుగా ఎన్నికై పార్టీ మారిన నలుగురు ఎంఎల్‌సిలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని తాము చేసిన ఫిర్యాదుపై శాసనమండలి ఛైర్మన్ విచారణ నిర్వహించి నిర్ణయాన్ని రిజర్వు చేశారని శాసనమండలిలో టిఆర్‌ఎస్ పార్టీ విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం శాసనమండలిలోని విప్ బోడకుంటి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎంఎల్‌సిలు రాములు నాయక్, కొండా మురళి, యాదవరెడ్డి, భూపతిరెడ్డిలు టిఆర్‌ఎస్ పార్టీ సభ్యులుగా ఉండి కాంగ్రెస్ పార్టీలో చేరి, ఆ పార్టీ కండువాలు కప్పుకుని ప్రచారం చేయడంతోపాటు పోటీ కూడా చేశారని పేర్కొన్నారు. కాబట్టి వారు అనర్హతకు అర్హులు అని తమ న్యాయవాది వాదించారని అన్నారు. పార్టీ మారిన ఎంఎల్‌సిలకు సంబంధించిన సాక్ష్యాలు కూడా ఇప్పటికే అందించామని తెలిపారు. ఇరు పక్షాల వాదనలు విన్న తర్వాత ఛైర్మన్ తన నిర్ణయాన్ని రిజర్వు చేశారని చెప్పారు. పార్టీ మారిన నలుగురు ఎంఎల్‌సిలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరామని, శాసనమండలి ఛైర్మన్ నిర్ణయం కోసం వేచి చూస్తున్నామని అన్నారు.



ఆర్థిక సంఘం తీరు మారాలి

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రానికి నడుమ ఉండాల్సిన రాజ్యాంగ సంబంధం రోజురోజుకూ కనుమరుగవుతున్నదని, రాష్ట్రాల అధికారాలు, హక్కుల పంపిణీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రాలను కించపరిచే విధంగా, అగౌరవమైన తీరులో వుండడం అత్యంత విచారకరమన్నారు. ఆర్థిక సంఘం నిర్వహించాల్సిన పాత్ర గురించి సిఎం కెసిఆర్ ప్రస్తావిస్తూ, రాష్ట్రాలలో పర్యటించే క్రమంలో కమిషన్ సభ్యులు ముందుగానే ఒక అభిప్రాయాన్ని కలిగి ఉంటున్నారని, ఇది సరికాదని అన్నారు. రాష్ట్రాన్ని పర్యటించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా క్షేత్ర స్థాయి పర్యటనకు ముందే ఇలాంటి ముందస్తు అవగాహనకు రావడం, టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ చేయడం సరికాదన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకమైన సాంస్కృతిక ఆర్థిక జీవన విధానం వుంటుందని, ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక అవసరాలు ఉంటాయని, కేంద్రం నుంచి విడుదల కావాల్సిన పన్నుల అంశాన్ని రాష్ట్రాల హక్కుగా పరిగణించి కేవలం విధానాల రూపకల్పనకు మాత్రమే ఫైనాన్స్ కమిషన్ పరిమితమైతే మంచిదన్నారు.

బడ్జెట్ పై ముందస్తు కసరత్తు

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించిన ఏర్పాట్లు అందుకు కావాల్సిన ముందస్తు చర్యలపైన ముఖ్యమంత్రి ఈ సమావేశంలో సమీక్షించారు. రాష్ట్ర ప్రజల జీవికను నిర్వచించుకున్న అనంతరమే ప్రజల అవసరాలను అన్నిరంగాల్లో పరిశీలించిన మీదటనే తుది బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని స్పష్టంచేశారు. కేవలం ఒక్క ఏడాదికా లేకా ఐదేండ్ల పూర్తి కాలానికా అనే అవగాహనతో మనం రూపొందిస్తున్న బడ్జెట్ విధి విధానాలు ఉండాలన్నారు. ''ప్రస్తుతం తెలంగాణ ఎక్కడ వున్నది? రానున్న ఐదేండ్ల తర్వాత ఎక్కడ ఉండబోతున్నది?'' అనే అవగాహనతో అంచనాతో బడ్జెట్‌ను రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం కేవలం చట్టాలను అమలుపరచడమే కాకుండా రాష్ట్రాభివృద్ధిని సులభతరం చేస్తూ ఒక ఉత్ప్రేరకంగా, ఉద్దీపనకారిగా తన పాత్రను నిర్వహిస్తుందన్నారు. బడ్జెట్ రూపకల్పనకు ముందు ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. ఒక్కొక్క అంశాన్ని తీసుకుని పనిని విభజించి సమస్యను ఛేదించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ వుండాలన్నారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా తన అభివృద్ధిని పెంచుకోవడానికి ప్రగతి మార్గంలో పయనించడానికి, అవలంబించాల్సిన మార్గదర్శకాలేమిటి, తెలంగాణ రాష్ట్రంగా మన ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న అంశాలేమిటి తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని బడ్జెట్‌ను రూపొందించాలన్నారు. ముఖ్యమంత్రిగా నన్ను ప్రజలు ఎన్నుకున్నప్పుడు నేను వారికి ఎంత గొప్పగా సేవలందించగలనో ఆలోచన చేయాలి. ఆదరాబాదరాగా కాకుండా ముందుగా ఒక సమగ్ర అవగాహనకు వచ్చిన తర్వాతనే బడ్జెట్‌ను రూపొందించడానికి పూనుకోవాలి. అటువంటి కీలక బడ్జెట్‌ను రూపొందించడానికి పూనుకున్న వ్యక్తులు అధికారులు ఆ దిశగా వారి దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. మనకున్న బలాలేమిటి బలహీనతలేమిటి తదితర మంచి చెడులను బేరీజు వేసుకున్న అనంతరమే పనిని ప్రారంభించాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో రాష్ట్రానికి ఎంత డబ్బు వస్తుంది, ఎంత డబ్బు ఖర్చు కాబోతుంది అనే అంశంపై సమగ్ర అంచనా వుండాలి'' అని ముఖ్యమంత్రి ఈ సమావేశంలో అధికారులను ఆదేశించారు.

సాగు నీటిపారుదలకు తొలి ప్రాధాన్యత

రాష్ట్రంలో నడుస్తున్న సాగు నీటి వనరులతో సహా ఇతర శాఖలను ఉదాహరణలుగా తీసుకున్న ముఖ్యమంత్రి ఆ దిశగా బడ్జెట్ ప్రతిపాదనలను రూపొందించాలని సూ చించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్ రూపొందించే క్రమంలో ముందుగా గత నాలుగు సంవత్సరాల కాలంలో ఎంత ఖర్చు చేసిందీ, రాబోయే ఐదేండ్ల కాలంలో ఎంత ఖర్చు చేయనున్నదీ అనే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవలని సిఎం సూచించారు. నడుస్తున్న ఆర్థిక సంవత్సరం సహా రానున్న ఐదేండ్ల కాలానికి మొత్తం కలిపి సాగునీటిపారుదల శాఖ కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చుకానున్నట్టు తెలిపారు. మన సాగునీటి అవసరం కోసం నిర్మిస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆకర్షణీయ పర్యాటక కేంద్రంగా, ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎటువంటి విధానాలను అనుసరించాలో బడ్జెట్ రూపొందించే క్రమంలో సూత్రప్రాయంగా తగిన సూచనలు చేస్తే బాగుంటుందని సిఎం కెసిఆర్ ఆ సమావేశంలో పాల్గొన్న అధికారులకు సూచించారు. త్రివేణి సంగమం ఉన్న కాళేశ్వరం ప్రాంతం సమీప భవిష్యత్తులో అద్భుతమైన పర్యాటక కేంద్రంగా మారబోతోందని, అందువల్ల పర్యాటక ప్రయోజనాలమీద బడ్జెట్‌ను తయారుచేసే క్రమంలో అధికారులు దృష్టిని కేంద్రీకరించాలన్నారు. యూనివర్సిటీ పరిశోధనలతో పాటుగా వ్యవసాయాన్ని ఆధునీకరించే అంశాలపై అధికారులు విధివిధానాలను రూపొందించాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏ విధంగా ముందుకు తీసుకుపోవాలో ఆ అంశాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు. వైద్య విద్య రంగాలను ప్రస్తావించిన ముఖ్యమంత్రి ప్రైవేటు యూనివర్సిటీల వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాలకు వలస పోకుండా రాష్ట్రంలో విద్యా వ్యవస్థను ఆకర్షణీయంగా రూపొందించే దిశగా, ఇతర రాష్ట్రాల విద్యార్థులను మాత్రమే కాకుండా అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షించే దిశగా విధి విధానాలను రూపొందించాలన్నారు.

ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక హైదరాబాద్

హైదరాబాద్ ఒక విశ్వ నగరం. మన దేశంలోని ఏడు పెద్ద నగరాల్లో హైద్రాబాద్ ఒకటి. నగరంలో నివసించే ప్రజలను దృష్టిలో పెట్టుకుంటే కనీసం వంద అర్బన్ పార్కులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. హైద్రాబాద్‌ను రక్షించడానికి, రేపటి భవిష్యత్తు తరాలను దృష్టిలో ఉంచుకుని మాస్టర్ ప్లాన్‌ను తయారు చేయాలి. అందులో ఒక్క పేరాను మార్చాలన్నా రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయాన్ని తీసుకునేంత స్థిరంగా నియమావళిని రూపొందించాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో హైద్రాబాద్‌ను అద్భుతమైన విశ్వ నగరంగా రూపొందించే దిశగా, ఎంత ఖర్చు చేయాల్సి ఉన్నదో బడ్జెట్ ప్రతిపాదనల్లో ప్రతిఫలించాలి. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు హైద్రాబాద్ వెన్నముకలాంటిది'' అని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

మంత్రులకు, సెక్రెటరీలకు శిక్షణపై..

మంత్రివర్గం ఏర్పడిన వెంటనే మొత్తం మంత్రులకు, ఆయా శాఖల కార్యదర్శులకు వారి అధికారాలు, విధులు, బాధ్యతల మీద అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆధ్వర్యంలో సునిశిత శిక్షణా కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంతో సహా దేశ ఆర్థిక వ్యవహారాలను, సచివాలయ విధి విధానాలు, బడ్జెట్ రూపకల్పన నిబంధనలు, వాటి పరిమితులు, ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆయా మంత్రిత్వ శాఖల్లో చేపట్టే కార్యక్రమాలు అన్నీ సంబంధిత మంత్రులకు తెలిసేలా శిక్షణ ఉండాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి, ఆర్థిక శాఖ సలహాదారు జిఆర్ రెడ్డి, సిఎంవో అధికారులు నర్సింగ్ రావు, స్మితా సబర్వాల్, సందీప్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

పొడిచిన పొత్తు

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ (బిఎస్‌పి) కలిసి పోటీ చేసేందుకు సిద్ధమైనాయి. ఇందులో భాగంగా ఎస్‌పి అధినేత అఖిలేష్ యాదవ్, బిఎస్‌పి అధినేత్రి మాయావతి శనివారం సంయుక్త మీడియా సమావేశం ఏర్పాటు చేసి పొత్తు, సీట్ల పంపకాల గురించి ప్రకటన చేశారు. మాయావతి మాట్లాడుతూ, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేయలని నిర్ణయించినట్లు చెప్పారు. ఇది దేశ రాజకీయాల్లో సరికొత్త విప్లవానికి దారి తీస్తుందన్న విశ్వాసాన్ని ఆమె వ్యక్తం చేశారు. యుపిలో మొత్త 80 లోక్‌సభ స్థానాలుండగా ఎస్‌పి, బిఎస్‌పిలు చెరి 38 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. మిగతా నాలుగు స్థానాలను ఇతర పార్టీలకు వదిలేస్తున్నట్లు తెలిపారు. అమేథీ, రాయబరేలి స్థానాలను కాంగ్రెస్ కోసం వదిలిపెట్టినట్లు తెలిపారు. మరో రెండు స్థానాలను ఎవరికి ఇచ్చేది ఈ పార్టీలు ప్రకటించలేదు కానీ, రాష్ట్రీయ లోక్‌దళ్‌తో చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మీడియా సమావేశంతో గురు శిష్యులు(మోడీ, అమిత్‌షా)లకు ఇక నిద్ర కరువవుతుందని ఈ సందర్భంగా మాయావతి, అఖిలేష్ యాదవ్‌లు అన్నారు. లోక్‌సభ ఉప ఎన్నికల్లో మా పొత్తు బిజెపిని ఓడించినట్లుగానే సార్వత్రిక ఎన్నికల్లో కూడా కాషాయ పార్టీని చిత్తుగా ఓడిస్తామన్న నమ్మకం తనకు ఉందని మాయావతి అన్నారు.' దేశ ప్రజల ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకున్నాం. ఈ పొత్తు రెండు పార్టీల ప్రయోజనం కోసం కాదు. బిజెపికి సమాధానం చెప్పేందుకు ఇది ఒక చారిత్రక అవకాశం. కోట్లాది మంది కేంద్రంలోని బిజెపి పట్ల అసంతృప్తితో ఉన్నారు. రైతులు, నిరుద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. గతంలో బిఎస్‌పి అధినేత కాన్షీరామ్, ములాయం సింగ్‌లు కలిసి ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. ఇప్పుడు మేము అదే స్ఫూర్తితో చేతులు కలిపాం. మా పొత్తు పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనార్టీ ల కోసమే'నని మాయావతి చెప్పారు. తమ కూటమిలో కాంగ్రెస్ పార్టీని ఎందుకు చేర్చుకోలేదో కారణాలను కూడా మాయావతి వివరించారు. కాంగ్రెస్ పార్టీకి యుపిలో బలం లేదని, అందుకే ఆ పార్టీతో పొత్తు చర్చలు జరపలేదన్నారు. అంతేకాదు గతంలో కాంగ్రెస్ పార్టీతో పొత్తు బిఎస్‌పికి ఏ విధంగాను లాభించలేదని, బిఎస్‌పి ఓట్లు కాంగ్రెస్‌కు బదిలీ అయ్యాయి కానీ, కాంగ్రెస్ ఓట్లు బిఎస్‌పికి బదిలీ కాలేదని చెప్పారు. 'గతంలో బోఫోర్స్ కుంభకోణం వల్ల కాంగ్రెస్ అధికారం కోల్పోతే ప్రస్తుతం బిజెపి రాఫెల్ వల్ల అధికారాన్ని కోల్పోయే పరిస్థితి తెచ్చుకుంది. ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలో ఆత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) ప్రకటిస్తే, ఇప్పుడు బిజెపి పాలనలో అధికారికంగా ప్రకటించకపోయినా అలాంటి పరిస్థితే కొనసాగుతోంది' అని మాయావతి అన్నారు. తమ రెండు పార్టీల పొత్తు యుపి అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూడా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఒకవేళ అవసరమైతే ప్రధానిగా మాయావతికి మీరు మద్దతు ఇస్తారా అని అఖిలేష్‌ను విలేఖరులు అడగ్గా 'నేను ఎవరికి మద్దతు ఇస్తానో మీకే తెలుస్తుంది'అని సమాధానమిచ్చారు. మరోసారి యుపి వ్యక్తి ప్రధాని అయితే సంతోషిస్తాను అని కూడా ఆయన అన్నారు. మాయావతిని అవమానిస్తే తనను అవమానించినట్లేనని పార్టీ కార్యకర్తలకు ఆయన హితవు పలికారు. అంతేకాదు, బిఎస్‌పి కార్యకర్తలతో విభేదాలు సృష్టించడానికి బిజెపి వాళ్లు రకరకాల ప్రయత్నాలు చేస్తారని, అలాంటి వాటిపట్ల అప్రమత్తగా ఉండాలన్నారు. కాగా ఎస్‌పి, బిఎస్‌పిల పొత్తు వాటి ఉనికి కోసమే తప్ప దేశ ప్రజల కోసమో, యుపి కోసమో కాదని బిజెపి వ్యాఖ్యానించింది.

విధానం అద్భుతం

(మొదటిపేజీ తరువాయి)

పంపిణీ, ధాన్య సేకరణ విధానాన్ని పరిశీలించేందుకు రవికాంత్ శనివారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పౌరసరఫరాల భవన్‌లో భారత ఆహార సంస్థ, పౌరసరఫరాల అధికారులతో ప్రత్యేకంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మ ం, కొత్తగూడెం, సిద్దిపేట, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించే రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ప్రధానంగా ప్రధానంగా గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి ఎలా ఉంది, కనీస మద్దతు ధర లభిస్తుందా, లేదా, కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉన్నాయా, లేవా, ధాన్యం విక్రయం సందర్భంగా ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయని అడిగి తెలు సుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల వల్ల తమకు ఎలాంటి ఇబ్బందులు లేవని, కనీస మద్దతు ధర లభించడంతో పాటు మధ్యవర్తుల ప్రమయం లేకుండా సకాలంలో డబ్బులు కూడా ఖాతాలో జమ అవుతున్నాయని తెలిపారు.



పిచ్చికుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి మృతి



సింధు (ఫైల్)

మన తెలంగాణ/చింతలమానేపల్లి : పిచ్చికుక్కల దాడిలో ఓ చిన్నారి గాయపడి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన విషాదకరమైన ఘటన చోటు చేసుకుంది. చింతలమానేపల్లి మండలంలోని బాబాసాగర్ గ్రామంలో చిన్నారి మృతిచెందడం పట్ల విషాదం అలుముకుంది. వివరాల్లోకి వెలితే.. బాబాసాగర్ గ్రామానికి చెందిన జాడి తిరుపతి స్వప్నల మూడవ సంతానం సింధు (4) మృతి చెందింది. శుక్రవారం సాయంత్రం సింధు తమ ఇంటి ఆవరణంలో ఆడుకుంటుండగా పిచ్చికుక్క ఒక్కసారిగా దాడిచేసింది. సింధు తల్లి ఇంట్లో నుండి బయటికి వచ్చే క్రమంలోనే సింధు కుడివైపు కన్ను కింద, ముక్కుపై దాడిచేయడంతో తీవ్ర రక్తస్రావం అయింది. తల్లిదండ్రులు వెంటనే కౌటాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి సింధు మృతిచెందింది. దీంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. పిచ్చికుక్కల దాడిలో తమ కూతురు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోధనలు పలువురిని కలిచివేసింది. గ్రామంలోని పిచ్చికుక్కల బెడతతో చిన్నారి మృతిపట్ల గ్రామస్థులు భయాందోలనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి కుక్కల బెడద నుండి కాపాడాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

యూపిఫైడ్ సైబర్ ఒలింపియాడ్‌లో
నేషనల్ టాపర్‌గా నారాయణ స్కూల్స్

మనతెలంగాణ/హైదరాబాద్ : జాతీయస్థాయిలో యూనిఫైడ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో యూనిఫైడ్ సైబర్ ఒలింపియాడ్ పరీక్ష రెండవ దశ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు ఆలిండియా ఫస్ట్ ర్యాంకుతో పాటు 3,4,5, 6,7,8,9 వంటి అత్యుత్తమ ర్యాంకులు సాధించి విజయవావుటా ఎగురవేశారు. వీటితోపాటు 10లోపు 54(60 శాతం) ర్యాంకులు కైవసం చేసుకున్నారు. 2,5,8 తరగతుల్లో ఆలిండియా ఫస్ట్ ర్యాంకు నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సింధూర నారాయణ సాధించారని పేర్కొన్నారు. అలాగే 50లోపు 219(49 శాతం) ర్యాంకులు, 100లోపు 375(42 శాతం) ర్యాంకులు సాధించి సత్తాచాటారన్నారు. ప్రకటించిన మొత్తం ఫలితాల్లో నారాయణ విద్యార్థులే అత్యధికంగా ఎంపిక కావడం నారాయణ విద్యావిధానానికి తిరుగులేని నిందర్శమని పేర్కొన్నారు. యావత్ భారతదేశంలో ఈ స్థాయి ఫలితాలు సంస్థ మరొకటి లేదన్నారు. విద్యార్థులు నిరంతరం విజయం సాధించాలంటే నారాయణే సరైన ఎంపిక అని రుజువు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.పునిత్ ప్రత్యేకంగా అభినంధించారు.

కల్తీ నెయ్యి ముఠా సభ్యుల గుట్టు రట్టు

120 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

మన తెలంగాణ/బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని సంగమేశ్వర కాలనీలో కల్తీ నెయ్యి తయారు చేస్తూ చుట్టు పక్కల గ్రామాల్లో విక్రయిస్తున్న ముఠాను ఎస్సై సాయన్న ఆధ్వర్యంలో పోలీసులు రట్టు చేశారు. సంఘటనకు సంబంధించిన పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాకు చెందిన కేతావత్ రాజు, శంకర్, లింగ్యా, సేల్యా, రాజు తదితరులు బాన్సువాడ పట్టణంలో మకాం వేశారని, వీరంతా బంధువులని తెలిపారు. సంగమేశ్వర కాలనీలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని ఎవ్వరికి అనుమానం రాకుండా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్నారు. 5 కిలోల ఫామాయిల్, 1 కిలో డాల్డా, 1 కిలో నెయ్యి కలిపి కరగ దీస్తారని, తర్వాత వీటిని క్యాన్లలో నింపి బాన్సువాడ, చుట్టు పక్కల గ్రామాల్లో ఆవు నెయ్యి, గేదె నెయ్యి ఇలా అమాయకులకు అంట గట్టడం వ్యాపారంగా మార్చుకున్నారని తెలిపారు. దీంతో అనుమానం వచ్చిన వారు తమకు సమాచారం అందించగా, వారు అద్దెకు ఉంటున్న ఇంటిని పరిశీలించగా, కల్తీ నెయ్యి బయట పడినట్లు తెలిపారు. కల్తీ నెయ్యి తయారీకి ఉపయోగిస్తున్న డ్రమ్ములు, క్యాన్లు, తదితర సామాగ్రిని పట్టుకున్నామన్నారు. పట్టుకున్న వారిలో ఎస్సై సాయన్నతో పాటు పోలీస్ సిబ్బంది దత్తాత్రి గౌడ్, రామస్వామి, వీరాబాబు, వెంకటేశ్, సాయిలుతో పాటు తదితరులు ఉన్నారు.



త్వరలో ఎన్‌ఆర్‌ఐ పాలసీ

- వంద దేశాల్లో టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ శాఖల ఏర్పాటు
- తెలంగాణ అభివృద్ధిలో ఎన్ఆర్ఐ శాఖలు కీలకంగా వ్యవహరించాలి
- ఉద్యమకాలంలో వారి సేవలు ప్రశంసనీయం
- ఎన్ఆర్ఐల సమస్యలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉన్నాయి
- పార్లమెంట్ సభ్యురాలు కల్వకుంట్ల కవిత





మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాలను అంతర్జాతీయ వేదికలపైకి తీసుకెళ్లిన టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ శాఖలను మరింత బలోపేతం చేసి రాష్ట్రాభివృద్ధిపై ప్రపంచంలో చర్చ జరిగేవిధంగా కార్యక్రమాలను రూపొందించనున్నట్లు పార్లమెంట్ సభ్యురాలు, టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ వ్యవహారాల ఇన్‌ఛార్జి కల్వకుంట్ల కవిత వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 33 దేశాల్లో విస్తరించిన టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ విభాగాలను రానున్న రోజుల్లో 100 దేశాలకు విస్తరింప చేయనున్నట్లు కవిత ప్రకటించారు. టిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం యుకె ఎన్ఆర్ఐ సెల్ 8వ వార్షికోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం జరుగుతున్న అభివృద్ధిని అంతర్జాతీయ వేదికలపై చర్చిస్తున్న ఎన్ఆర్ఐ శాఖల కృషిని అభినందించారు. వంద దేశాల్లో ఎన్ఆర్ఐ శాఖలను ఏర్పాటు చేసి గులాబీ జెండాను విదేశాల్లో రెపరెపలాడించే కార్యక్రమాల్లో టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ విభాగాలు విస్తృతంగా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమాల ఏర్పాట్లలో టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ సెల్ కోఆర్డినేటర్ మహేష్ బిగాలతో పాటు అనేక మంది ఉన్నారని చెప్పారు.

ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో, ఆయన మార్గదర్శనంలో పనిచేస్తూ తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై ఇనుమడింప చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ సమయాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ విదేశాల్లో తెలంగాణ ఆవిర్భావ ఆవశ్యకతను వివరించారని ఆమె గుర్తుచేశారు. ఆయన సూచనలతో విదేశాల్లో ఉండే తెలంగాణ బిడ్డలు వివిధ పేర్లతో సంఘాలు ఏర్పాటు చేసుకుని తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని అంతర్జాతీయ వేదికలపై రగిలించారని పేర్కొన్నారు. విదేశాల్లో శాఖలు ఏర్పాటు చేసేటప్పుడు అనేక అవమానాలకు, అవహేళనలకు ఎన్ఆర్ఐలు గురయ్యారని విచారం వ్యక్తంచేశారు. అయితే నవ్విన నాప చేను పండిన చందంలా తెలంగాణసాధించుకున్నామని గుర్తు చేశారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రెండు పర్యాయాలు సిఎం కెసిఆర్ నాయకత్వాన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. కెసిఆర్ నాయకత్వంలో దేశానికి ఆదర్శంగా దూసుకుపోతున్న తెలంగాణ రాష్ట్ర ప్రగతికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని అన్నారు.

తెలంగాణ పారిశ్రామిక పాలసీ తెలుసుకున్న అమెరికా వాసులు ఇలాంటి పాలసీ తమ దగ్గర లేదని చెప్పడం తెలంగాణ బిడ్డలందరికీ గర్వకారణం అన్నారు. ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం ఇప్పటికే ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. త్వరలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎన్ఆర్ఐ పాలసీని ప్రకటిస్తారని కవిత వెల్లడించారు. అభివృద్ధి చెందిన అమెరికా, గల్ఫ్ దేశాల్లో ఎన్ఆర్ఐ సమస్యలు ఒక్కోరకంగా ఉన్నాయని తెలిపారు. విదేశాల్లోని తెలంగాణ బిడ్డలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా, ఏదేశంలో ఎదుర్కొంటున్నా టిఆర్‌ఎస్ ఎన్ఆర్ఐ విభాగాలు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కవిత పిలుపు ఇచ్చారు. తెలంగాణ ఎన్ఆర్ఐలు కలిసి పనిచేస్తే ప్రపంచదేశాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కాలంలో టిఆర్ఎస్ ఎన్ఆర్ఐ విభాగాలు ఏర్పాటు చేసుకుని అంతర్జాతీయంగా ఆందోళనలు చేసిన అంశాలను బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, టిఆర్‌ఎస్ ఎంఎల్‌సి శ్రీనివాస్ రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణకు వ్యతిరేకంగా వ్యవహరించిన రాజకీయ పార్టీలను సోషల్ మీడియాలో ఎండగట్టడంలో ఎన్ఆర్ఐలు ప్రముఖపాత్ర నిర్వహించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ సెల్ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్ కూర్మాచలం, టిఆర్‌ఎస్ యుకె అధ్యక్షుడు అశోక్ దూసరి, న్యూజిలాండ్ శాఖ కోశాధికారి అభిలాష్ రంగినేని, యుఎస్ ప్రతినిధులు సుధీర్, సురేశ్, రమేశ్, టిఆర్‌ఎస్ ఖతార్ ప్రతినిధి అభిలాష్ బండి, సౌత్ అఫ్రికా ప్రతినిధి రమణా రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధాల అల్లికే సాహిత్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : కన్నీళ్ల లోతుల్లోని బాధను అనుభవించని వారు సాహిత్యసృష్టి చేయలేరని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు జూలూరు గౌరీ శంకర్ వ్యాఖ్యానించారు. జీవన గమనంపై అవగాహన లేనివారికి జీవితంపై ప్రేమ ఉండదన్నారు. అందుకే మానవ అనుబంధాల అల్లికే సాహిత్యమని చెప్పారు. శనివారం జరిగిన రావుల పాటి నారాయణ,మాణిక్యం పేరిట ఇచ్చే సాహితీ మాణిక్యం 2018 అవార్డులను ప్రముఖ కవులు కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ప్రసాద మూర్తికి ప్రదానం చేసిన సాహితీ సభలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు చేసిన సాహిత్య సృష్టి చెక్కు చెదరదని గౌరీశంకర్ అన్నారు. తెలంగాణ రిసోర్స్ సెంటర్ చైర్మన్ ఎం. వేద కుమార్ మాట్లాడుతూ హక్కుల కోసం, పర్యావరణ, సమాజం కోసం రచనలు చేసే రచయితలకు అవార్డులు ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. జీవితం నుంచి పారిపోకుండా జీవితంతోనే పొరాడాలనే తత్వం రచనల్లో కనబడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొ. రఘు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయచంద్రమోహన్ పాల్గొన్నారు.

బిజెపి నేతల్లో ఓటమి భయం : నారాయణ

మన తెలంగాణ / న్యూఢిల్లీ, హైదరాబాద్ : బిజెపి జాతీయ సమావేశాలు ఘనంగా జరుపుకుంటున్నట్లు చెప్పుకుంటున్నా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోని ఓటమి భయం ఆ పార్టీ నేతలను ఆవహించిందని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో గెలవలేమన్న ఆందోళన వారిలో ఎక్కువ అయ్యిందన్నారు. 2014లో అనేక హామిలిచ్చినా బిజెపి వాటిని నిలుపుకోలేదన్నారు. బిజెపి నేతల అబద్ధాలు వింటే గోబెల్స్ సైతం ఆత్మహత్యలు చేసుకునేవారని ఆయన ఆరోపించారు. ఢిల్లీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, స్కాం ఫ్రీ ప్రభుత్వమంటున్న బిజెపి రాఫెల్‌లో జరిగేంది ఏమిటో ప్రజలకు చెప్పాల్సిన అవసరముందన్నారు. వ్యవస్థలను ఆ పార్టీ భయభ్రాంతులకు గురి చేస్తుందన్నారు. రామమందిరం నిర్మిస్తామంటూ అమిత్ షా మాట్లాడుతున్నారన్నారు. సుప్రీంకోర్టు తీర్పు రాక ముందు రామమందిర నిర్మాణం ఎలా చేస్తారని ఆయన ప్రశ్నించారు. ముస్లింయేతరులే రావాలంటూ ప్రభుత్వమే చట్టం చేయడం సరికాదన్నారు. 33 శాతం మహిళలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్రం ఎందుకు చట్టం చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. అలోక్‌వర్మ వ్యవహారంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరించారని ఆయన పేర్కొన్నారు. వైఫల్యం చెందిన పార్టీగా బిజెపి మిగిలిందన్నారు. అమిత్ షా, మోదీ వలన దేశం నాశనం అవుతుందన్నారు. 2019 ఎన్నికల్లో బిజెపి అధికారంలోకి రాదన్నారు.అబద్ధాలు చెప్పడంలో మోదీ పేరును గిన్నిస్ రికార్డ్‌లో ఎక్కించాలన్నారు.

జిల్లాల్లో ఎన్నికల కమిషనర్ పర్యటన



మన తెలంగాణ / న్యూస్ నెట్‌వర్క్ : రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్ల తీరుతెన్నులను పరిశీలించేందుకు కమిషనర్ నాగిరెడ్డి శనివారం సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట జిల్లాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా జిల్లాల కలెక్టర్లకు, అధికారులకు పలు సూచనలు చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఎన్నికల్లో మద్యం, డబ్బులు పంచకుండా చూడాలని, శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఎన్నికల నియమ నిబంధనలు కఠినంగా అమలు పర్చాలని, ఎన్నికల్లో పాల్గొనే మహిళలు, వికలాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. ఎన్నికలను అప్రమత్తంగా నిర్వహించాలని సూచించారు. సిరిసిల్లకు చేరుకున్న ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డికి కలెక్టర్ వెంకట్రామరెడ్డి, జేసి యాస్మిన్ భాష, ఎస్పి రాహుల్‌హెగ్డేలు పూల బొకేలు, పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం సమర్పించారు. కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమైన నాగిరెడ్డి ఎన్నికల నిర్వహణపై చర్చించారు. తగిన సలహాలు, సూచనలు అందించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలో శనివారం న్యూ టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల పీఓ, ఏపీఓ అధికారుల శిక్షణా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాగిరెడ్డి హాజరై ధర్మపురి, బుగ్గారం మండలాల ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఎన్నికలు నిర్వహించడం కత్తిమీద సాములాంటిదని, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా ఎన్నికలను పకబ్బందీగా ప్రశాంత వాతావణంలో నిర్వహించాలని అధికారులకు సూచించారు. శిక్షణా తరగతులలో బ్యాలెట్ బాక్సులను తెరవటం, సీలువేయటంతోపాటు వార్డు సభ్యుల బ్యాలెట్ పత్రాలు మొదలు ఉపసర్పంచ్ ఎన్నిక, సర్పంచు అభ్యర్థుల డిక్లరేషన్ వరకు పలు సందర్భాలలో వచ్చే సమస్యలకు పరిష్కారాలను సూచిస్తూ అధికారుల కీలకమైన సూచనలిచ్చారు. ధర్మపురి, బుగ్గారం పీఓ, ఏపీఓ స్థాయి అధికారుల శిక్షణ నైపుణ్యాలు బాగున్నాయని జిల్లా యంత్రాంగం మరియు జిల్లా కలెక్టర్ శరత్‌లను అభినంధించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల నియమావళిని కట్టుదిట్టంగా అమలుపరుస్తున్నామని, ఇప్పటికే ఫేస్1, ఫేస్2 స్థాయిలో శిక్షణా తరగతులు పూర్తి చేసామన్నారు. ఎన్నికల నియమావళిని అధికారులందరూ పాటించాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుటకు జిల్లా ఎస్పి సింధుశర్మ ఆధ్వర్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పి సింధుశర్మ, డిఎస్పి వెంకటరమణ, ఆర్డీవో, ఎంపిడిఓ, ధర్మపురి, బుగ్గారం పీఓ, ఏపీఓలు పాల్గొన్నారు. మెదక్ జిల్లా, కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నాగిరెడ్డి, కలెక్టర్ కృష్ణ భాస్కర్, పోలీసు కమిషనర్ జోయల్ డేవీస్, జాయింట్ కలెక్టర్ పద్మాకర్, డీఆర్వో చంద్రశేఖర్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ నాగిరెడ్డికి వివరించారు. ఎన్నికల నిర్వహణలో ప్రణాళిక ప్రకారం జిల్లాలో ఏర్పాట్లపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల సమయంలో పండుగ రావటం వల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రెసిడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రెసిడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, శిక్షణ కొరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. జిల్లాలో ఎన్నికల బ్యాలెట్ పేపర్స్ సరఫరా చేయడానికి, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యలు, ఎన్నికల సామాగ్రి, అబ్జర్వర్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల నిర్వహణకు కావలసిన వాహన సదుపాయాలు, కౌంటింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లపై రూపొందించిన ప్రణాళికను జిల్లా కలెక్టర్ కృష్ణభాస్కర్ నాగిరెడ్డికి వివరించారు.

జిఎంఆర్‌కు ఎక్సెలెన్స్ అవార్డు



మన తెలంగాణ/శంషాబాద్ : అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలోని గ్రామాల్లో సామాన్య ప్రజలకు అనుక్షణం గేయిల్ సంస్థ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించిన సిఎస్ఆర్ సంస్థ ప్రతిష్టాత్మకమైన ఐసిఎస్ఐ సిఎస్ఆర్ ఎక్సెలెన్స్ అవార్డును జిఎంఆర్ సంస్థను వరించిందని ఆ సంస్థ కమ్యూనికేషన్ కార్పొరేట్ ప్రతినిధి ప్రశాంత్‌కుమార్ శనివారం మీడియాకు తెలిపారు. ఈ అవార్డును జిఎంఆర్ అధికారి సిఎఫ్ఓ రాజేష్ అరోర శుక్రవారం ముంబాయ్‌లో అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గేయిల్ సిఇఓ కిషోర్ మాట్లాడుతూ సామాజిక సేవ అనేది గేయిల్ సంస్థలో ఒక భాగామైందన్నారు. ఇది నిరంతరం జరిగే ఒక ప్రక్రియగా అభివర్ణించారు. వెనకబడిన తరగతుల అభివృద్ధికి అనేక ఉపాధి కల్పన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రధానంగా గేయిల్‌కు చెందిన వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా విద్య, ఉద్యోగ, ఆరోగ్య, ఉపాధి, పరిసరాల అభివృద్ధి కల్పన వంటి ముఖ్యమైన విభాగాలలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమాలను 4 ఏప్రిల్ 2008 నుండి నిరంతరంగా నిర్వహిస్తునట్లు తెలిపారు. అదేవిధంగా ఈ సంస్థలో యువత, మహిళలకు ప్రత్యేకంగా 10 ఒకేషనల్ ట్రైనింగ్ కోర్సులను నిర్వహిస్తు వ్యాపారవేతలుగా ఎదగడానికి సంస్థ సహాయపడుతుందన్నారు. మహిళా సాధికారతతోపాటు ఉమెన్ ఎంటర్‌పెన్యువర్‌ను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వీటన్నింటిని గుర్తించిన సిఎస్ఆర్ సంస్థ శుక్రవారం జరిగిన ముంబాయ్ మూడో సమావేశంలో జిఎంఆర్ సంస్థను ఎంపిక చేసిందన్నారు.

జెండర్స్ బిల్లులో అభ్యంతరాలున్నాయి

హ్యూమన్ రైట్స్ ఫోరం ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎన్.జీవన్‌కుమార్

మన తెలంగాణ/హైదరాబాద్ : లోక్‌సభ ఇటీవల ఆమోదించిన ట్రాన్స్ జెండర్ వ్యక్తుల(హక్కుల రక్షణ)బిల్లు 2018లో అనేక అభ్యంతకరమైన అంశాలున్నాయని, ఈ బిల్లును ఎట్టి పరిస్థితులలో రాజ్యసభ ఆమోదించకూడదని హ్యూమన్ రైట్స్ ఫోరం ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎన్.జీవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో జెండర్స్‌ను రక్షించే హక్కులకంటే ఉల్లంఘించే హక్కులే ఎక్కువగా ఉన్నాయని ట్రాన్స్ జెండర్ సమాజం కొంతకాలంగా ఆందోళన చెందుతోందన్నారు. ఎవరు ట్రాన్స్ జెండర్ అన్నది బిల్లు ప్రకారం ఎవరికి వారు సొంతంగా నిర్ణయించుకోవడానికి వీల్లేదని, జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ పరీక్షించి నిర్ణయించాలని తెలిపారు. నల్సా(నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా) కేసు తీర్పులో సుప్రీంకోర్టు ఏమన్నదంటే స్వీయ గుర్తింపు కాక వైద్య పరమైన, జీవశాస్త్రపరమైన, మానసిక పరమైన అంశాల ప్రమేయం ఉన్న పరీక్షల్లాంటివి ఏం చేసినా అది రాజ్యాంగంలోని 19,21 అధికరణల కింద వారి హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆయన తెలిపారు. వాస్తవంగా పుట్టుకతో గుర్తింపబడ్డ జెండర్‌కు, మానసికంగా తాము భావించుకున్న జెండర్‌కు మధ్య వ్యత్యాసం ఉన్న వ్యక్తుల విషయంలో జెండర్ నిర్ణయాన్ని వారి స్వీయ గుర్తింపు కింద వర్తిస్తుందని వివరించారు. రిజర్వేషన్ల విషయంలోనూ ఈ బిల్లు వారికి అన్యాయమే చేస్తుంది, జెండర్‌లను సామాజికంగా వెనుకబడిన వర్గంగా పరిగణించి విద్యా, ఉద్యోగ రంగాలలో రిజర్వేషన్లు కల్పించాలని చెప్పిందని ఆయన వివరించారు. అయితే కొత్త బిల్లులో వాటి ప్రస్తావనే లేదని తెలిపారు. ట్రాన్స్ జెండర్‌లను దూషించినా,వారిపై లైంగికంగా హింసకు పాల్పడినా జరిమానాతోపాటు ఆరు నెలల నుంచి రెండేళ్లపాటు జైలు శిక్ష విధించాలని కొత్త బిల్లు చెబుతోందని ఆయన వివరించారు. అత్యాచార నేరానికి ఐపిసిలోని 376 సెక్షన్ కింద ఏడు సంవత్సరాలపాటు శిక్ష విధిస్తుండగా జెండర్ల విషయంలో ఈ వివక్ష సరికాదని తెలిపారు. ఇలాంటి సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ బిల్లును ఎట్టి పరిస్థితులలో రాజ్యసభ ఆమోదించకూడదని హ్యూమన్ రైట్స్ ఫోరం ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎన్.జీవన్‌కుమార్ డిమాండ్ చేశారు.

నెంబర్ వన్ సంస్థగా డిడిఎస్‌ను నిలుపుతాం



మన తెలంగాణ/సంగారెడ్డి/జహీరాబాద్: దేశం లో ఏ సంస్థలూ సాధించని అరుదైన ఘనత డెక్కన్ డెవలప్ మెంట్ (డిడిఎస్) సంస్థగా నిలిచేందుకు కృషి చేస్తామని డిడిఎస్ డైరెక్టర్ పివి సతీష్ కుమారన్ అన్నారు. ప్రతి యేటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ప్రారంభమయ్యే పాత పంటల జాతరలో భాగంగా ఈసారి పాత పంటల జాతర విజయవంతానికి అన్ని సన్నాహాలు చేస్తున్నారు. పాత పంటల జాతర సందర్భంగా డిడిఎస్ డైరెక్టర్ సతీష్ కుమారన్ మాట్లాడుతూ గత 20 ఏండ్లుగా విత్తనాలే దేవతగా భావించి ప్రారంభించిన పాత పంటల జాతర ఈ సంవత్సరం 20వ వసంతానికి చేరుకోబోతుందని తెలిపారు. పంటలు, విత్తనాలు దేవుళ్లుగా పూజించుకొని నడిపించిన జాతరలు ఈ దేశంలో లేవని తేల్చిచెప్పారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి జహీరాబాద్ మండలం అర్జున్‌తండాలో ప్రారంభించి 23 గ్రామాలను సందర్శించుకుంటూ ఫిబ్రవరి 13వ తేదీన ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. జాతర 80శాతం కన్నా ఎక్కువ కొత్త గ్రామాలేనని చెప్పారు. ఈ జాతరలో జానపద గీతాలు, చిటికెల ఆటలు, బుర్రకథలు తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. అర్జున్ తండాలో ఈనెల 14న జరిగే పాత పంటల జాతరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్ పాల్గొనున్నారని తెలిపారు. ఇందులో చిరుధాన్యాల సాగు, చిరుధాన్యాల ఆహారం తదితర వాటిపై దృష్టి సారించబోతుందన్నారు. అర్జున్ తండాలో ప్రారంభమయ్యే జాతరలో జహీరాబాద్, హైదరాబాద్ 50 మంది వినియోగదారులు పాల్గొంటున్నాని తెలిపారు. జాతర నడిపే గ్రామాల్లో మొగడంపల్లి, కోహీర్ మండల స్థాయి సదస్సు నిర్వహించి ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరై అవగాహన కల్పిస్తారన్నారు. జాతర ముగింపు కార్యక్రమంలో ఫిబ్రవరి 13వ తేదీ మాచునూర్ పచ్చసాలె క్యాంపస్‌లో జరిగే ముగింపు ఉత్సవాల్లో జాతీయ అంతర్జాతీయ, ఆహార ఉద్యమకారులు, మేధావులు, శాస్త్రవేత్తలు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సెంటర్ ఆఫ్ ఎకనామిక్స్, సోషల్ స్టడీస్ సంస సామాజిక శాస్త్రవేత్త డాక్టర్ గాలబ్ హాజరవుతున్నట్లు సతీష్ తెలిపారు.



మహారాష్ట్ర వద్దు.. తెలంగాణ ముద్దు..

- కెసిఆర్ పాలనతో సరిహద్దు గ్రామాల్లో ఆనందోత్సాహం
- తమను తెలంగాణలో కలపాలంటూ ధర్నాలు
- అట్టుడుకుతున్న ధర్మాబాద్ ప్రాంతం
- కర్ణాటకలోని పలు గ్రామాల్లో సైతం ఆందోళనలు
- ఆకర్షణగా మారిన తెలంగాణ సంక్షేమ పథకాలు



మన తెలంగాణ/నిజామాబాద్ ప్రతినిధి : కొత్త రాష్ట్రం, సరికొత్త పాలన సంస్కరణలతో దేశంలోనే ఆదర్శంగా నిలుస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పాలన ఇతర రాష్ట్రాలను సైతం ప్రభావితం చేస్తున్నది. దేశానికి తెలంగాణ రాష్ట్రం ఆదర్శమవుతుందని ఇక్కడ చేపట్టే ప్రతీ పథకం దేశవ్యాప్తంగా అమలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుందని కెసిఆర్ చెబుతున్న మాటలు నిజమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలోని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలు మహారాష్ట్ర, కర్ణాటకలతో సరిహద్దులు కలిగి ఉండగా ఆయా రాష్ట్రాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. తెలంగాణలో పేద, బడుగు, బలహీనవర్గాలతోపాటు ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలకు, గిరిజనులకు, ప్రత్యేకించి రైతులకు భారీస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్న విషయం తెలిసిందే. రైతాంగానికి ప్రభుత్వమే బాసటగా నిలవడంతో తెలంగాణ రైతుల్లో నెలకొన్న ఆనందం మరాఠీలను మురిపించింది. ప్రతీ పేద ఇంట పెళ్ళిళ్ళకు ప్రభుత్వమే పెద్దన్న పాత్ర పోషించడం మొదలుకొని కెసిఆర్ కిట్ల వరకు అమలవుతున్న పథకాలు ఆయా గ్రామాలను కదలించాయి. ప్రతీ ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సహాయం అందించడంతోపాటు సెంటు భూమి ఉన్న రైతైనా చనిపోతే బీమాను వర్తింపజేయడంతో తమకు ఆ బీమా కావాలంటూ అభ్యర్థనలు మొదలుపెట్టారు. నిజామాబాద్ జిల్లాకు సరిహద్దులు కలిగివున్న నాందేడ్ జిల్లాలోని ధర్మాబాద్ ప్రాంతంలో ధర్మపోరాటం మొదలైంది. తమను మహారాష్ట్ర నుండి విముక్తి చేసి తెలంగాణలో కలపాలంటూ మొదలైన విజ్ఞప్తులు ధర్నాలకు దారితీసాయి. గత నాలుగు రోజులుగా ఆందోళనబాట పట్టిన ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపై బైఠాయిస్తూ నిరసనగళం వినిపించారు. ఎట్టి పరిస్థితిలో వెనక్కి తగ్గమంటూ తేల్చి చెబుతున్నారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు పోలీసులు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు కామారెడ్డి జిల్లా సరిహద్దు ప్రాంతంలోని కర్ణాటకకు చెందిన పలు గ్రామాల్లో సైతం అంతర్గత సమావేశాలు జోరందుకున్నట్లు సమాచారం. కర్ణాటక రాష్ట్ర రాజధానికి దూరంగా విసిరి వేయబడ్డ ఆయా గ్రామాలు అభివృద్ధికి దూరంగా ఉండిపోవడమే కారణంగా తెలుస్తోంది. సంక్షేమ పథకాలు అందకపోగా తెలంగాణ తరహాలో సాగునీటి రంగంపై ప్రభుత్వ ప్రోత్సాహకాలు సైతం లేకపోవడం మరో కారణంగా తెలుస్తోంది. నిజానికి మహారాష్ట్రలో ఆందోళన బాట పట్టిన గ్రామాల్లో గతంలో విచిత్ర పరిస్థితి ఉండేది. శ్రీరాంసాగర్ ఎగువన నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఉద్యమించగా ధర్మాబాద్ ప్రాంత ప్రజలు వ్యతిరేకించారు. తెలంగాణకు వ్యతిరేకంగా ఉద్యమించిన నాటి ప్రజలే నేడు తెలంగాణకు జై కొడుతుండడం గమనార్హం. ధర్మాబాద్ ప్రాంతంలో సాగునీటి అవకాశాలను అటుంచితే ప్రభుత్వం అందించే పథకాలు సైతం సరిగ్గా అందలేని పరిస్థితి నెలకొంది. పక్కనే ఉన్న తెలంగాణ పల్లెల్లో ప్రగతిబాటలు కనిపించగా ప్రతీ రంగంలోను అభివృద్ధి పథకాలు విస్తృతంగా సాగుతుండడంతో మరాఠావాసుల మనస్సు చలించింది. మహారాష్ట్రలో ఉండడం కన్నా తెలంగాణలో ఉంటే రైతుబంధు, రైతుబీమా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్‌లతోపాటు ఆసరా పెన్షన్‌లు, నిరుద్యోగ భృతి అందుతుందని ఆశపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తాము తలపడ్డ తెలంగాణతోనే కలిసి నడవాలని తెలంగాణలో భాగం కావాలని కోరుతున్న మరాఠావాసులు ఇప్పటికే గ్రామ తీర్మానాలు చేసి తాజాగా ఆందోళన బాటపట్టారు. ప్రజల డిమాండ్‌తో విసిగిపోయిన మరాఠా సర్కార్ ఆందోళనలు ఉక్కుపాదంతో అణచివేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే కిందిస్థాయిలో జరుగుతున్న పరిణామాల పై నివేదిక తెప్పించుకున్న ప్రభుత్వం నాందేడ్ ఎస్పికి పలు సూచనలు చేసినట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితిలో ఆందోళనలు చేయిదాటకుండా చూడాలని, కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినట్లు సమాచారం.

అభివృద్ధి బాటలో పోరుగడ్డ

- ఉమ్మడి జిల్లాలో విద్య, వైద్యం
- మూడు జిల్లాల్లో మూడు వైద్య కళాశాలలు
- పేదలకు అందుబాటులో ప్రభుత్వ కార్పొరేట్ వైద్యం
- నెరవేరిన కెసిఆర్ హామీ



మన తెలంగాణ/సూర్యాపేట : రాష్ట్ర రాజకీయాల్లో గత నాలుగు దశాబ్దాలుగా మార్పులకు కేంద్ర బిందువైన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఒకప్పుడు విప్లవాల ఖిల్లాగా పేరుగాంచింది. పోరుగడ్డలో పోరాటాలు తప్ప అభివృద్ధి కన్పించని రోజులవి. మారుతున్న కాలంలో మార్పులకు అనుగుణంగా స్పందించే తత్వం జిల్లా ప్రజలది. దశాబ్దాల కాంగ్రెస్‌కు చరమగీతం పాడి ఎన్‌టిఆర్ హయాంలో తెలుగుదేశాన్ని ఆదరించారు. 2001లో తెలంగాణ రాష్ట్ర సమితి ఏర్పాటుతో జిల్లా ప్రజలు బంగారు తెలంగాణ స్ఫూర్తిదాత, తెలంగాణ రాష్ట్ర సాధకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకు వెన్నంటి నిలిచారు. అడుగడుగునా ఆయన చేసిన ఉద్యమానికి వెన్నంటి ఉన్న గుంటకండ్ల జగదీష్ రెడ్డి జిల్లాను అభివృద్ధి బాటలో కొనసాగిస్తున్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉమ్మడి జిల్లాపై పట్టు సాధించారు. భువనగిరి ఎంపితోపాటు ఆరు శాసనసభ స్థానాల్లో విజయం సాధించిన ప్రజా ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి వద్ద జిల్లా అభివృద్ధి అంశాలను ప్రస్తావించి కోట్లది రూపాయలు మంజూరు చేయించారు. ఈ నేపథ్యంలోనే 2014 ఎన్నికలలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఇచ్చిన హామీ మేరకు సూర్యాపేటను జిల్లా కేంద్రంగా చేయడంతో పాటు నల్లగొండ, సూర్యాపేటకు ప్రతిష్టాత్మకమైన వైద్య కళాశాలలను మంజూరు చేయించిన ఘనత జగదీష్‌రెడ్డికే దక్కిందనడంలో సందేహం లేదు. అన్ని వసతులతో కూడిన వైద్య సేవలు అందించేందుకు కళాశాలతోపాటు ఏరియా ఆసుపత్రిని 450 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయిస్తున్నారు. నల్లగొండలోనూ వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నారు. బీబీనగర్ ఏయిమ్స్‌లో మొదటి విడతగా 50 ఎంబిబిఎస్ సీట్లతో ఈ ఏడాది నుంచే ప్రారంభం కానున్నట్లు తెలిసింది. ప్రతి ఏడాది 50 సీట్ల చొప్పున మూడేళ్లలో 150 సీట్లు అనంతరం 100 సీట్లు పెంచే అవకాశం ఉంది. విప్లవాల ఖిల్లాగా, పోరుగడ్డగా పేరొందిన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇకమీదట వైద్య కళాశాలల అడ్డాగా మారబోతుంది. తెలంగాణలోనే మూడు మెడికల్ కళాశాలలకు నెలవుగా మారనున్న ఈ జిల్లాలో ప్రజలకు మెరుగైన, ఖరీదైన వైద్య సేవలు మరింత చేరువయ్యే రోజు దగ్గర్లోనే ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బీబీనగర్ నిమ్స్ ఆసుపత్రి భవనంలో ఏయిమ్స్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపి రూ.1028 కోట్లను మంజూరు చేయడం, సిఎం కెసిఆర్ ప్రభుత్వం నల్లగొండ, సూర్యాపేటల్లో రెండు మెడికల్ కళాశాల నిర్మాణాలు జరిపిస్తుండడంతో మూడు జిల్లాల్లో మూడు మెడికల్ కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. ప్రధానంగా బీబీనగర్ రంగాపూర్ వద్ద 200 ఎకరాల్లో ఏర్పాటుకానున్న ఏయిమ్స్‌తో 750 పడకల ఆసుపత్రి 15 సూపర్‌స్పెషాలిటీ విభాగాలతో ఏర్పాటుకానుంది. ఏయిమ్స్ ఏర్పాటుతో 100 ఎంబిబిఎస్ సీట్లు, 60 బిఎస్సి నర్సింగ్ కోర్సు సీట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటు కానుండడంతో వచ్చే ఏడాది అడ్మిషన్ల స్వీకరణ జరగనుంది. రోజుకు ఇందులో 1500 మంది అవుట్ పేషెంట్లకు, 1000 మంది ఇన్ పేషెంట్లకు వైద్యం అందడంతో పాటు వివిధ సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు లభించనున్నాయి. ఇక నల్లగొండ మెడికల్ కళాశాల పనులు సైతం చురుగ్గా సాగుతున్నాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో మెడికల్ కళాశాలను ప్రారంభించేందుకు వడివడిగా పనులు కొనసాగిస్తున్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో 400 పడకలు, మాతాశిశుసంరక్షణ కేంద్రం 150 పడకలతో కలిపి 550 పడకలు అందుబాటులో ఉండడంతో ఇక్కడ వైద్యకళాశాల ఏర్పాటు కాబోతుంది. నూతన భవనాలకు 250 కోట్లు సైతం మంజూరయ్యాయి. అటు సూర్యాపేట మెడికల్ కళాశాల నిర్మాణం సైతం 499 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం సూర్యాపేట ఆసుపత్రి 100 పడకలకు తోడుగా నూతనంగా 350 పడకల భవనం, 150 పడకల మాతాశిశుసంరక్షణ భవనం నిర్మాణంతో మెడికల్ కళాశాల ఏర్పాటు కానుంది. నల్లగొండ, సూర్యాపేట, బీబీనగర్ ఏయిమ్స్‌లతో రాష్ట్రంలో 300 ఎంబిబిఎస్ సీట్లు పెరుగుతాయని భావిస్తున్నారు.

ఈ మూడు మెడికల్ కళాశాలలతో నిర్మాణాలు పూర్తయితే ఉమ్మడి నల్లగొండతోపాటు చుట్టుపక్కల్లోని ఉమ్మడి వరంగల్, మెదక్, మ హబూబ్‌నగర్ ప్రజలకు అత్యవసర చికిత్సలు, ఆధుని క చికిత్సలు అందుబాటులోకి రానున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు పిదప రాష్ట్రంలో మహబూబ్‌నగర్, సిద్దిపేట మెడికల్ కళాశాలలను ప్రారంభించుకోగా, 2019–20లో ఏయిమ్స్ కళాశాల, 2020– 21 నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కళాశాలలు ప్రా రంభించే దిశగా ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. రెం డోసారి అధికారం చేపట్టిన ముఖ్యమంత్రి కెసిఆర్ మె డికల్ కళాశాల పనులను వేగవంతం చేయాలని సం బంధిత అధికారులను ఆదేశించారు. దీనితోపాటు అ వసరమైన సిబ్బంది కోసం సంబంధిత అధికారులు ఉ ద్యోగాలు నింపేందుకు ప్రకటన జారీ చేశారు. దీనితో ఉమ్మడి జిల్లాలో యువతతో పాటు ఏఎన్‌ఎం, బిఎస్సి నర్సింగ్, ఎంపిహెచ్‌ఏ, ఎంబిబిఎస్‌తోపాటు ఫార్మసీ చదివిని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మళ్లీ నోట్ల రద్దా ? వామ్మో!!

న్యూఢిల్లీ: మళ్లీ నోట్ల రద్దు చేసే ఆలోచన ఏమైనా ఉందో లేదో తేల్చిచెప్పాలంటూ భారత ప్రభుత్వాన్ని నేపాల్ నిలదీసింది. 2016లో భారతదేశం రూ 500, రూ 1000 నోట్లను రద్దు చేయడంతో నేపాల్ తీవ్ర ఇబ్బందుల పాలైంది. నోట్ల రద్దు కారణంగా నేపాల్ బ్యాంకుల్లో రూ. 7 కోట్లకు పైగా రద్దయిన భారతీయ కరెన్సీ చెల్లుబాటు కాకుండా మిగిలిపోయింది. ఇక నేపాల్ ప్రజల వద్ద అయితే లెక్కల్లోకి రాని కోట్ల రూపాలయలు చిత్తు కాగితాలుగా మారిపోయాయి. తాజాగా, భారత ప్రభుత్వం రూ.2000 నోట్ల ముద్రణను నిలిపివేస్తున్నట్లు వార్తలు వెలువడుతుండడంతో నేపాల్ ఉలిక్కిపడింది. గత నెల నుంచి భారతీయ కరెన్సీకి చెందిన రూ. 200, రూ.500, రూ.200 నోట్ల వాడకాన్ని నేపాల్ నిలిపివేసింది. గురువారం భారత విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్‌తో భేటీ అయిన నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలి నోట్ల రద్దుపై భారత ప్రభుత్వం నుంచి భరోసా కోరారు. "భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కాకూడదని మేము భారతీయ బ్యాంకులను కోరుతున్నాం. భారత ప్రభుత్వం నుంచి కూడా మాకు హామీ కావాలి" అని ప్రదీప్ గ్యావలి స్పష్టం చేశారు.

కేజ్రీవాల్ కూతురుకు కిడ్నాప్ బెదిరింపు

న్యూఢిల్లీ : ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ కూతురును కిడ్నాప్ చేస్తామంటూ గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు. ఈ మేరకు సిఎం కార్యాలయానికి ఇమెయిల్ అందిందని అధికార వర్గాలు శనివారం తెలిపాయి. ఈ నెల 9వ తేదీన ఈ బెదిరింపు వచ్చిందని, దీనిని ఢిల్లీ పోలీసు కమిషనర్ అమూల్య పట్నాయక్‌కు పంపించినట్లు వెల్లడించారు. తక్షణ చర్యగా కేజ్రీవాల్ కూతురుకు రక్షణగా భద్రతా అధికారిని నియమించారు. సైబర్ సెల్ వారు రంగంలోకి దిగారు. ఎక్కడి నుంచి ఇమెయిల్ అందిందనేది కనుగొంటున్నారు.

యువత పురోగతికి కామన్‌వెల్త్ దేశాల కృషి

యుకె ప్రభుత్వ ప్రతినిధి ఫిలిమ్ పార్హమ్



మన తెలంగాణ/సిటీబ్యూరో : యువత ఆర్థిక పురోగతి కోసం కామన్‌వెల్త్‌లోని 53 దేశాలు కృషి చేస్తున్నాయని కామన్‌వెల్త్‌లో యుకె ప్రభుత్వ ప్రతినిధి ఫిలిమ్ పార్హమ్ అన్నారు. జాతీయ యువజన దినోత్సవం (నేషనల్ యూద్ డే), అగజ్–ఎ–బాత్‌జిత్ ముగింపు ఉత్సవాలను శనివారం మదీనా పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కామన్‌వెల్త్‌లో యుకె ప్రభుత్వ ప్రతినిధి ఫిలిమ్ పార్హమ్ మాట్లాడుతూ.. కామన్‌వెల్త్‌లో ఉన్న 53 దేశాలు యువత ఆర్థిక పురోగతి కోసం కృషి చేస్తున్నాయని, ముఖ్యంగా కామన్‌వెల్త్ దేశాల్లో 60 శాతం యువత ఉండడంతోపాటు నాణ్యమైన విద్యను అందించడం, యువత సరైన మార్గంలో వెళ్లేటట్లు చూడడం ముఖ్య ఉద్దేశ్యంగా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నదని తెలిపారు. ఆడపిల్లలపై హింసను అరికడుతూ, ఆడపిల్లల చదువుకు ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. బ్రిటీష్ డిప్యూటీ హై కమిషనర్ అంధ్ర్యూ ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. సమాజంలో సమన్వయం వలన ప్రజల్లోని రాగద్వేషాలు మటుమాయమవుతున్నాయని అటువంటి కార్యక్రమాలను రూబరు చేపట్టడం సంతోషకరమన్నారు. యువత ముందుకు వచ్చి తమలోని బేధాభిప్రాయాలను తొలగించుకోవడానికి చేస్తున్న కృషిని కొనియాడారు. మదీనా డిగ్రీ కాలేజీ విద్యార్థులు ఈ సందర్భంగా నాటకాన్ని ప్రదర్శించారు. బ్రిటీష డిప్యూటీ హై కమిషన్, న్యూఢిల్లీకి చెందిన ఐపార్ట్‌నర్‌లు రూబరుకు తమ మద్దతు అందిస్తుండగా మదీనా పబ్లిక్ స్కూల్ ఈ కార్యక్రమ నిర్వహణకు భాగస్వామ్యం వహిస్తుంది. వివిధ మతామధ్య సామరస్యంపై 'సంభాషణలో చొరవ'కు సంబంధించిన అగజ్–ఏ–బాత్‌జిత్ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్న హైదరాబాద్‌లోని 10 భిన్న కళాశాలలకు చెందిన 45 మంది యూత్ ఛాంపియన్లను, ప్రతినిధులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మదీనా ఎడ్యుకేషన్, వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి కెఎం ఆరీఫుద్దీన్, రూబరు సహ వ్యవస్థాపకులు, డైరెక్టర్ హేమఖాత్రి, బ్రిటీష్ హై కమిషన్ రాజకీయ ఆర్థిక సలహాదారు నళిని రఘురామన్ తదితరులు పాల్గొన్నారు.

రోహింగ్యాలకు సహకరిస్తే సహించం

- రోహింగ్యాల వేలిముద్రలు, ఐరిస్ సేకరిస్తున్నాం
- కార్డన్ సెర్చ్‌ల్లో వారి కదలికలపై ఆరా..!
- రాచకొండ క్రైం డిసిపి నాగరాజు



మనతెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలోని రాచకొండ కమిషనరేట్ పరిధిలో దాదాపు 4వేల మంది రోహింగ్యాలున్నట్లు గుర్తించామని, వారి కదలికలపై నిత్యం నిఘా వేసి ఉంచామని రాచకొండ క్రైం డిసిపి నాగరాజు తెలిపారు. రోహింగ్యాలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయ సహకారాలు, పథకాలు అందకుండా తగు జాగ్రత్తలపై 'మన తెలంగాణ ప్రతినిధి'తో పేర్కొన్నారు. ముఖ్యంగా రోహింగ్యాల వేలి ముద్రలు, ఐరిస్ తదితర ఆధారాలు సేకరించి వారిపై నిఘా పెట్టామన్నారు. తాజాగా బాలపూర్‌లో మత్తు మాత్రలు విక్రయిస్తుండగా ఇద్దరు రోహింగ్యాలను అరెస్టు చేశామన్నారు. గత ఎన్నికలలో మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో రోహింగ్యాలు ఓటు వేసేందుకు వచ్చిన క్రమంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. రాచకొండ పరిధిలో ఉన్న నాలుగు వేల మంది రోహింగ్యా ముస్లిం తెగల వారు స్థానికులతో పరిచయాలు పెంచుకుని జీవనం సాగిస్తున్నారు. మయన్మార్ దేశస్తులకు ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులు, బ్యాంక్ పాస్‌బుక్‌లు పొందిన వారిపై నిఘా సారిస్తున్నారు. గతంలో బాలాపూర్‌లోని క్రీసెంట్ స్కూల్ కరస్పాండెంట్ అబ్దుల్ కాలిక్యు రోహింగ్యా ముస్లింలకు తన స్కూల్ నుంచి అక్రమంగా బోనోఫైడ్ సర్టిఫికెట్ ఇచ్చాడని, రోహింగ్యాలు ఇండియన్ పాస్‌పోర్ట్, ఆధార్‌కార్డు, ఎస్‌బిఐ బ్యాంకు అకౌంట్, ఓటరు గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బర్త్ సర్టిఫికెట్, పాన్ కార్డులు పొందిన వారిపై ప్రత్యేక నిఘా సారించి వాటిని రద్దు చేయిస్తున్నామన్నారు. డబ్బులకు ఆశపడి బోనోఫైడ్ సర్టిఫికెట్ ఇచ్చిన క్రీసెంట్ స్కూల్ స్టడీ సర్టిఫికెట్స్, అడ్మిషన్స్ రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకుని కరస్పాండెంట్ అబ్దుల్ కాలిక్యును అరెస్టు చేశామన్నారు. బాలాపూర్ పరిధిలో 4వేల మంది రోహింగ్యాలు శరణార్థులుగా ఉంటున్నారని, రోహింగ్యాలకు భారత పౌరసత్వం పొందే అర్హత లేదని, కొందరు రోహింగ్యాలు ధృపత్రాలు పొందేందుకు యత్నిస్తున్నారని, వారికి సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత ఏడాది మహ్మద్ ఫయాజ్, మహ్మద్ ఫైజల్ రోంహిగ్యా ముస్లింలు పాస్‌పోర్టులు పొందేందుకు పాస్‌పోర్ట్ ఏజెంట్‌గా పనిచేస్తున్న బాలాపూర్ నివాసి నయీంను సంప్రదించారు. అనంతరం వారికి ఇంటి అద్దె అగ్రిమెంట్లు తయారు చేసి ఆధార్ కార్డు, పాన్ కార్డులు నయీం ఇప్పించడంతోపాటు వారికి భారత పాస్‌పోర్టులు ఇప్పించాడు. విషయం వెలుగుచూడటంతో పోలీసులు మహ్మద్ ఫయాజ్, మహ్మద్ ఫైజల్‌లతో పాటు పాస్‌పోర్ట్ ఏజెంట సయ్యద్ నయీంను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఇదిలావుండగా మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రానికి చెందిన రోహింగ్యాలకు ఏ దేశంలోనూ పౌరసత్వం లేదు, వీరికి ఇస్లామిక్ స్టేటతో సంబంధాలున్న రోహింగ్యాలు దేశంలోని జమ్మూకాశ్మీర్, హైదరాబాద్, ఢిల్లీ , ముంబై, మేవాట్ తదితర ప్రాంతాలలో దాదాపు 40వేల మంది శరణార్థులుగా ఉన్నట్లు కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు ధృవీకరించిన విషయం విదితమే. అయితే హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో దాదాపు 10వేల మంది ఉన్నట్లు పోలీసు రికార్డులు చెబుతున్నాయి. మయన్మార్ దేశం నుంచి తరమేస్తున్న రోహింగ్యా ముస్లిం తెగలతో దేశానికి ముప్పు పొంచిఉందని, వారిని ఎప్పుడైన ఇస్లామిక్ స్టేట్ వాడుకునే అవకాశం ఉందని కేంద్ర నిఘా వర్గాలు పేర్కొంటూనే ఉన్నాయి. రోహింగ్యా ముస్లిం తెగకు పాకిస్తాన్, బంగ్లాదేశ్ లలోని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలున్నట్లు కేంద్ర నిఘా వర్గాలు తేల్చిచెబుతున్నాయి. ఇదిలావుండగా హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకుని రోహింగ్యాలను గుర్తిస్తామని, వారి ఆధారాలు సేకరించి వారిపై నిఘా పెడతామని రాచకొండ క్రైం డిసిపి నాగరాజు వివరించారు. రోహింగ్యాలకు సహకరించే వారిపై కఠిన



రూ.63 కోట్లతో కరీంనగర్ డెయిరీ నూతన యూనిట్ నిర్మాణం

- వారంలోగా పునాది రాయి
- ఇరవై నెలల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తాం : ఎంపి వినోద్‌కుమార్

మన తెలంగాణ/కరీంనగర్ క్రైం : రూ.63 కోట్లతో కరీంనగర్ డెయిరీ నూతన పాల ఉత్పత్తి యూనిట్‌ను నిర్మిస్తున్నట్లు కరీంనగర్ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ తెలిపారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని శనివారం నగరంలోని కరీంనగర్ పాల డెయిరీలో సభ్యుల కుటుంబాల కోసం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను తిలకించిన తరువాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపి వినోద్‌కుమార్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని అనుకుని ఉన్నటువంటి తిమ్మాపూర్ మండలంలోని నల్లగొండ గ్రామంలో 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ నూతన యూనిట్‌ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

రూ.63 కోట్లలో రూ.10 కోట్లు మొదటి దఫాలో మంజూరయ్యారని, కేంద్ర ప్రభుత్వ సబ్సిడి రూ.10 కోట్లు ఉంటుందని తెలిపారు. వేములవాడలో సైతం ఒక యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కరీంనగర్ డెయిరీని తెలంగాణ వ్యాప్తంగా విస్తరించాలని ముఖ్యమంత్రి ఆలోచనగా ఆయన తెలిపారు. ఎలాంటి కల్తీ లేని స్వచ్ఛమైన పాలను ఉత్పత్తి చేస్తూ ప్రజలకు అందిస్తుందనే పేరు కరీంనగర్ డెయిరీకి ఉందన్నారు. ప్రస్తుతం కరీంనగర్ డెయిరీలో 70వేల మంది పాల ఉత్పత్తిదారులు సభ్యులుగా ఉన్నారని, ఆ సంఖ్యను లక్షకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈచ్‌వన్ టీచ్‌వన్ అనే నినాదంతో ముందుకు వెళ్తామని అన్నారు. నూతనంగా డెయిరీలో సభ్యులుగా చేరే వారికి రెండు గేదెలను ఇవ్వాలనే ఆలోచన ఉందన్నారు. కరీంనగర్ డెయిరీ పాలన ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కరీంనగర్ డెయిరీ చైర్మన్ చలిమెడ రాజేశ్వర్‌రావు, నీటి పారుదల శాఖ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి సహా డెయిరీ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భరోసా స్కీం కింద రూ.50వేల చెక్కులను, స్కాలర్‌షిప్‌లను, ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

పల్లెల్లో సంక్రాంతి శోభ



మన తెలంగాణ/హాలియా : సంస్కృతి, సంప్రాదాయాలకు తెలంగాణ పల్లెలు ప్రతీకలు. తెలుగు పండుగల్లో పెద్దది సంక్రాంతి. మూడు రోజులపాటు సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు పల్లెలు సిద్ధమయ్యాయి. సంక్రాంతి పండుగకు సెలవులు రావడంతో చిన్నా,పెద్దా అందరూ పల్లె బాట పట్టారు. కుటుంబసభ్యులు, ఆత్మీయులు, బంధువులు, స్నేహితుల మధ్య సొంత ఊరులో పండుగను జరుపుకునేందుకు పట్నం నుండి పల్లెలకు చేరుకుంటున్నారు. ఇప్పటికే పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో పిల్లలు పండుగ సంబురాల్లో మునిగిపోయారు. గాలిపటాలను ఎగరవేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. పండుగకు కుటుంబసభ్యులు, బంధువుల రాక కారణంగా పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. చిన్నారులు ఆటపాటలతో కేరింతలు కొడుతూ పండుగ సంబురాలు జరుపుకుంటున్నారు. మహిళలు పిండి వంటకాల తయారీలో నిమగ్నమయ్యారు. యువతులు రంగురంగుల ముగ్గులు వేయడంలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఇళ్ల ఎదుట రంగవల్లులు గొబ్బెమ్మల కళ ఉట్టిపడుతుంది. సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకునేందుకు అందురూ పల్లెబాట పడుతున్నారు. ఇళ్ల ముంగిళ్లలో రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల పాటలు, పిండివంటకాల ఘుమఘుమలు. కుటుంబమంతా ఒక్కటిగా చేరడంతో పల్లెలకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంస్కృతి, సంప్రాదాయాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతిని భోగి, సంక్రాంతి, కనుమగా మూడు రోజుల పాటు జరుపుకుంటారు. విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో పిల్లలు ఆటపాటలు, బంధువుల రాకతో గ్రామాల్లో ఏ ఇంట చూసినా పండుగ వాతావరణం కనిపిస్తుంది. పండుగ సందర్భంగా వరుస సెలవులు రావడంతో పట్టణాలకు వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. ధనుర్మాసం మొదలైనప్పటి నుంచే కొన్ని గ్రామాల్లో గొబ్బెమ్మల వ్రతం నిర్వహిస్తారు. ఇళ్ల ముందు గొబ్బెమ్మలతోపాటు ప్రతి రోజు ఉదయం ఆవుపేడతో తయారుచేసిన పిడకను ఉంచి పూజలు చేస్తారు. ఈ పిడకను భోగి మంటల్లో వేస్తే పుణ్యం కలుగుతుందని నమ్మకం. సంక్రాంతిని గంగిరెద్దుల విన్యాసాలు ఆకట్టుకుంటాయి. హరిదాసుల కీర్తనలు వీధుల్లో వినిపిస్తుంటాయి. నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. గ్రామాల్లో సంక్రాంతి ప్రజలు ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. ప్రతి ఇంటా చుట్టాల సందడి కనిపిస్తుంది. గ్రామాల్లో దేవాలయాలు సైతం సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రత్యేక అలంకరణలతో ముస్తాబయ్యాయి.



రంగురంగుల ముగ్గుల కళ

సంక్రాంతి అంటేనే మహిళలకు ప్రత్యేకంగా గుర్తుకు వచ్చేది ముగ్గులు. సంక్రాంతి పండుగకు ఇళ్ల ముంగిట్లో రంగురంగుల ముగ్గులతో మహిళలు అందంగా తీర్చిదిద్దుతారు. సంక్రాంతి వస్తుందంటే చాలు వారం రోజుల ముందు నుంచే మహిళలు ముగ్గులు వేసేందుకు రంగులను సిద్ధం చేస్తుంటారు. పండుగ రోజున వాకిళ్లలో రంగువల్లులను వేయడానికి మహిళలు, యువతులు పోటీ పడుతుంటారు. సంక్రాంతి సందర్భంగా జరిగే ముగ్గుల పోటీలలో ఎంతో ఆసక్తితో మహిళలు పాల్గొంటారు. పండుగ జరుపుకునే మూడు రోజులపాటు ఇంట్లోని మహిళలు, యువతులు ఉదయం తెల్లావారుజాము నుంచే వాకిళ్లలో ముగ్గులు వేసే పనిలో నిమగ్నమవుతారు. అందమైన ముగ్గులను వేసిన తర్వాత రకరకాల రంగులతో శోభాయామానంగా తయారు చేస్తారు. సంక్రాంతి అంటేనే మహిళలకు ముగ్గుల పండుగగా చెప్పవచ్చు. మహిళలు వేసే ముగ్గుల్లో రథం ముగ్గు ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. భోగి, సంక్రాంతి రోజున యువతులు రకరకాల ముగ్గులు వేస్తే, కనుమ రోజున మహిళలు రథం ముగ్గులు వేయడం ఆనవాయితీగా భావిస్తారు.



గాలిపటాలతో చిన్నారుల కేరింతలు

సంక్రాంతి పండుగ మహిళలకు ప్రత్యేకమైతే చిన్నారులకు, యువకులకు గాలిపటాలు ఎగురవేయడం సరదా. సంక్రాంతి వస్తుందంటేనే గాలి పటాలను ఎగురవేసేందుకు ఎంతో ఎదురుచూస్తారు. గాలి పటాలను ఎగురవేస్తూ ఎంజాయ్ చేస్తారు. గాలిపటాలను ఎగురవేయడానికి చిన్నారులే కాక యువకులు, పెద్దలు సైతం ఆసక్తి కనబర్చుతారు. చిన్నారులు, యువకులు ఆటపాటలతో కేరింతలు కొడుతూ సందడిగా పండుగను జరుపుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసుకుంటారు. గాలిపటాలను ఎగురవేసే వారు తగు జాగ్రత్తలు పాటించాలి. చిన్నారులు పెద్దల సమక్షంలో గాలి పటాలను ఎగురవేయాలి. సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, ఆత్మీయుల మధ్య ఆనందంగా జరుపుకోవాలి.



ప్యారిస్ బేకరీలో పేలుడు

- గ్యాస్ లీక్‌తో వ్యాపించిన మంటలు
- ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది మృతి
- 47 మందికి గాయాలు

ప్యారిస్ : ఇక్కడ ఓ బేకరీలో శనివారం ఉదయం తొమ్మిది గంటలకు శక్తివంతమైన పేలుడు సంభవించింది. ఆ సందర్భంగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. బేకరీ చాలావరకు ధ్వంసమైంది. ఆ ప్రమాదంలో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది మరణించారని, 47 మందికి గాయాలయ్యాయని ఫ్రెంచి అధికారులు తెలిపారు. ఆ భారీ పేలుడుకు చుట్టుపక్కల ఉన్న భవనాల కిటికీలు పగిలిపోయాయి. కార్లు ధ్వంసమయ్యాయి. గాయపడిన వారిని అగ్నిమాపక సిబ్బంది కిటికీల్లోంచి బయటికి తీశారు. నార్త్ సెంట్రల్ ప్యారిస్‌లోని 9వ ఎరోండెస్‌మెంట్‌లోని రూయి డి ట్రెబైస్‌లో దట్టంగా పొగలు కమ్ముకోవడంతో అక్కడున్న వారిని ఖాళీ చేయించి, సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బేకరీ పేలుడులో అంతకు ముందు ఫ్రెంచి అంతర్గత వ్యవహారాల మంత్రి క్రిస్టఫో కాస్టనర్ ప్రకటించినట్టు మరణించిన వారు నలుగురు కాదని, ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది చనిపోయారని ప్యారిస్ ప్రాసిక్యూటర్ ఆఫీస్ తెలిపింది. గాయపడిన వారిలో పదిమంది పరిస్థితి విషమంగా ఉందని, 37 మంది ఓ మాదిరిగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలంలో ఉన్న మంత్రి మాట్లాడుతూ... మంటల్ని అదుపు చేయడంలో, బాధితుల్ని రక్షించడంలో అగ్నిమాపక సిబ్బంది చాలా సాహసం ప్రదర్శించారని కొనియాడారు. సంఘటనా స్థలంలో ఉన్న ప్యారిస్ మేయర్ అన్నే హిడాల్గో బాధితులను ఓదార్చి సంఘీభావం తెలిపారు. పేలుడు సంభవించిన బేకరీకి సమీపంలో ఉన్న భవనాలు, హోటళ్లలో ఉన్న రెసిడెంట్స్‌ను, టూరిస్టుల్ని అక్కడి నుంచి ఖాళీ చేయించామని ఆమె అన్నారు. బాధితుల్ని తరలించేందుకు హెలికాప్టర్‌ను ఉపయోగించారు.

పిచ్చి కుక్కల స్వైర విహారం

మన తెలంగాణ/చర్ల : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో పిచ్చికుక్కల దాడులు ఎక్కువైపోయాయి. ఒంటరిగా మనుషులు కనబడితే చాలు వెంటపడి మరీ దాడులు చేస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో కుదునూరు, ఆర్ కొత్తగూడెం, సత్యనారాయణపురం, కలివేరు, తేగడ, గొమ్ముగూడెం, కొత్తపల్లి, లింగపురం వివిధ గ్రామాలలో సుమారు 15 మందిని పిచ్చి కుక్కలు గాయపరిచినట్లు సమాచారం. మండల వ్యాప్తంగా పిచ్చికుక్కల దాడులు ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. ఒంటరిగా బయటకి రావాలంటే హడలెత్తిపోతున్నారు. రాత్రి సమయాల్లో పనుల నిమిత్తం ఒంటరిగా బయటికి వచ్చే మనుషులను వెంబడించి మరీ దాడులు చేస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారు. ఈ పిచ్చికుక్కల దాడులపై అధికారులు సకాలంలో స్పందించి తగిన చర్యలు తిసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పంట కాలనీల దిశగా వడివడిగా అడుగులు

- మండలాల వారీగా వ్యవసాయ, ఉద్యాన పంటల విస్తీర్ణం
- వారం రోజుల్లో పంపాలని అధికారులకు పార్థసారధి ఆదేశాలు
- 25 కల్లా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం

మన తెలంగాణ/హైదరాబాద్: మండలాల వారీగా వ్యవసాయ, ఉద్యాన పంటల విస్తీర్ణాన్ని వారం రోజుల్లో సేకరించి జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌కు పంపించాలని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి.పార్థసారధి అధికారులను ఆదేశించారు. ఈ మొత్తం కార్యాచరణ ప్రణాళికను జనవరి 25 వ తేదీ లోపు పూర్తి చేసి, సిఎం కెసిఆర్ ఆదేశాలకు అనుగుణంగా వచ్చే ఖరీఫ్ నాటికి ప్రయోగాత్మక అమలుకు యూనివర్సిటీ అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటల క్రాప్ కాలనీలు, ఆహార శుద్ధి పరిశ్రమలపై కార్యాచరణ రూపొందించటానికి సచివాలయంలో సంబంధిత అధికారులతో పార్థసారధి శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వరిసాగు విస్తీర్ణం పెరగకుండా ఇతర వ్యవసాయ, ఉద్యాన పంటలను ప్రోత్సాహించాలని, రాష్ట్రంలో ప్రాజెక్టుల ద్వారా వచ్చే నీటి లభ్యత ద్వారా పెరిగే సాగు విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రణాళికలు రూపొందించాలని అన్నారు. రాష్ట్రంలో రైతులు పండించే ప్రతీ పంటకు కనీస గిట్టుబాటు ధర కల్పించే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని, దానికి తగిన కార్యాచరణ ప్రణాళికను వెంటనే సిద్ధం చేయాలన్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు వెంటనే వారి శాఖ పరిధిలో పండిస్తున్న ముఖ్యమైన పంటలలో తలసరి వినియోగం ఆధారంగా ఏయే పంటలు కొరత, అధికంగా ఉత్పత్తి అవుతున్నవేమిటో గుర్తించాలన్నారు. అలాగే కొరత ఉన్న పంటలకు సాగు విస్తీర్ణాన్ని నేల, వాతావరణ పరిస్థితులకు అనువైన ప్రాంతాలను గుర్తించి పంటల కాలనీల ద్వారా పెంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

అధిక ఉత్పత్తి ఉన్న పంటలకు ఆహారశుద్ధి పరిశ్రమల స్థాపన ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తులను స్థానిక స్వయం సహాయక బృందాల ద్వారా ప్రోత్సహించటానికి కార్యాచరణ ప్రణాళిక ఉండాలని ఆదేశించారు. ఒకేసారి రాష్ట్రం మొత్తం సాధ్యం కాదని, ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు కొన్ని జిల్లాల్లోని ప్రాంతాలను అమలుకు గుర్తించాలన్నారు. కొత్తగా రూపొందించే ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీని రైతులకు ప్రయోజనకరంగా, గిట్టుబాటు ధర కల్పించే విధంగా రూపొందించాలని ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖను పార్థసారధి కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ, ఉద్యాన, మార్కెటింగ్, ఆహారశుద్ధి, వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా.. మన ఉస్మానియా

- కిడ్నీ మార్పిడికి ప్రైవేట్ హాస్పిటల్‌లో రూ. 7 లక్షలు
- మెరుగైన ఉచిత డయాలసిస్ సేవలు
- కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు
- పేదల మన్ననలు పొందుతున్న ఉస్మానియా వైద్యులు



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : పేదల ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ఉస్మానియా ఆస్పత్రిలో కార్పొరేట్ హాస్పిటళ్లకు ధీటుగా రోగులకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి. కిడ్నీ సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడే రోగులకు ఉస్మానియా ఆస్పత్రి వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ వ్యాధి నివారణకు బడ్జెట్‌లో కోట్లాది రూపాయలు కేటాయిస్తుండడంతో ఉస్మానియా ఆస్పత్రిలో వసతులు మెరుగుపడి రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత ఏడాది జనవరిలో ప్రభుత్వం ఉస్మానియా ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. దీంతో పేదలకు ఈ డయాలసిస్ సెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, నిత్యం పని ఒత్తిడితో ఆరోగ్యంపై శ్రద్ధ వహించని వారు కిడ్నీ వ్యాధి భారిన పడుతుంటారు. కాళ్ల వాపు, మూత్రం తగ్గడం, ఆయాసం, వాంతులు, ఆకలి మందగించడం, శరీంలో రక్తం తగ్గడం, అధిక బరువు పెరగడం, పెయిన్ కిల్లర్ మెడిసిన్ అధికంగా వాడడం వంటి కారణాలతో కిడ్నీ వ్యాధికి గురవుతుంటారు. ఉస్మానియా ఆస్పత్రిలో ప్రతి యేటా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు జరుగుతుండగా గత ఏడాది ఈ శస్త్ర చికిత్సలు రెట్టింపయ్యాయి. సుమారు ఇరవై సంవత్సరాలకు పైగా ఉస్మానియా ఆస్పత్రిలో కిడ్నీ వ్యాధులకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు వెయ్యికి పైగా ఈ వ్యాధి గ్రస్తులకు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేశారు. వ్యాధి బారిన పడి డయాలసిస్ సేవలు పొందుతున్న వారు కూడా ఇక్కడ అధికంగానే ఉన్నారు. డయాలసిస్ ఒపి విభాగానికి నిత్యం వంద మందికి పైగా రోగులు వస్తుండగా వీరిలో అవసరం ఉన్న వారికి మూడు షిఫ్టులలో డయాలసిస్ సేవలు అందజేస్తున్నారు. హాస్పిటల్‌లోని ఈ విభాగంలో ప్రస్తుతం 50 పడకలు ఉన్నాయి. వారంలో రెండు యూనిట్ల ద్వారా శస్త్ర చికిత్సలు, నాలుగు రోజులు ఒపి సేవలందిస్తున్నారు. ప్రతి సోమవారం కిడ్నీ మార్పిడి, గురువారం డయాలసిస్ రోగులను గుర్తించేందుకు వారికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఉస్మానియా వైద్యులు 2009వ సంవత్సరం నుంచి ఆరోగ్య శ్రీ కింద డయాలసిస్ సేవలు ఉస్మానియా దవాఖానాలో రోగులకు ఉచితంగా అందిస్తున్నారు. కాగా ప్రజలలో అవయవదానంపై అవగాహన లేకపోవడంతో జీవన్‌దాన్ నుండి అవసరాల మేరకు కిడ్నీలు అందడంలేదు. కిడ్నీ వ్యాధి బారిన పడిన రోగికి కిడ్నీ మార్పిడి కోసం ప్రైవేట్, కార్పొరేట్ దవాఖానాలలో రూ. 7 లక్షలు, డయాలసిస్‌కు నెలకు రూ.30వేలు, మందులకు రూ.10 వేల వరకు ఖర్చు అవుతుండగా ఉస్మానియా దవాఖానాలో ఆయా సేవలను ప్రభుత్వ సహకారంతో ఉచితంగా అందజేస్తున్నారు.

గతం కంటే ఎంతో మెరుగు



తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు సమకూరుస్తుండటంతో ఉస్మానియా దవాఖానాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయి. నిత్యం వంద మందికి పైగా ఓపికి కిడ్నీ రోగులు వస్తున్నారు. ప్రతి రోజు మూడు షిఫ్టులలో డయాలసిస్ సేవలు అందిస్తున్నాం. గత ఏడాది జనవరిలో ప్రారంభమైన ఉచిత డయాలసిస్ కేంద్రంలో కార్పొరేట్‌కు ధీటుగా సింగిల్ పోర్ట్‌తో మెరుగైన డయాలసిస్ సేవలను రోగులకు అందిస్తున్నాం. 50 పడకలతో ఉదయం 6 గంటల నుంచి నాలుగు షిఫ్టుల వారిగా 72 మందికి నిత్యం డయాలసిస్ అందిస్తూ ఇక్కడి వైద్యులు పేద ప్రజల మన్ననలు పొందుతున్నారు. సాధారణంగా ప్రైవేట్ ఆస్పత్రులలో డయాలసిస్‌కు వాడే డిస్పోజల్‌తోనే అందరికీ డయాలసిస్ సేవలు అందిస్తారు. దీనికి భిన్నంగా ఉస్మానియా దవాఖానాలో ఏర్పాటు చేసిన ఉచిత డయాలసిస్ కేంద్రంలో ఒక వ్యక్తికి డయాలసిస్ చేసిన సమయంలో వాడిన డిస్పోజల్‌ను తిరిగి ఉపయోగించరు. దీనినే సింగిల్ పోర్ట్ డయాలసిస్ అంటాము. ప్రభుత్వం రోగుల కోసం నిరంతరం మందుల సరఫరా చేస్తుంది. దీంతో గతంలో కంటే రోగుల తాకిడి గణనీయంగా పెరిగింది.

డాక్టర్ నాగేందర్,సూపరింటెండెంట్,
ఉస్మానియా దవాఖానా

ఉచిత డయాలసిస్ సేవలు అద్భుతం

– లలిత, బహదూర్‌పురా

ఉస్మానియా ఆస్పత్రిలో కిడ్నీలు చెడిపోయిన రోగులకు మెరుగైన డయాలసిస్ సేవలు అందుతున్నాయి. సుమారు ఏడాది కాలంగా ఇక్కడ ఉచితంగా డయాలసిస్ సేవలను పొందుతున్నాను. ట్రీట్‌మెంట్ బాగుంది. అవసరమైన మందులు ఉచితంగా ఇస్తున్నారు. నాకు కిడ్నీలు చెడిపోయినట్లు వైద్యులు చేసిన పరీక్షల ద్వారా గుర్తించడంతో నాటి నుంచి ఇక్కడికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నాను.



వారానికి రెండుసార్లు

– కె. వెంకటేష్, మామిడిపల్లి

నాకు ఏడాది క్రితం కిడ్నీ సమస్య ఉందని తేలడతో నాటి నుంచి ఇక్కడికి వచ్చి డయాలసిస్ చేయించుకుంటున్నాను, సమస్య తీవ్రతను బట్టి వారానికి రెండు పర్యాయాలు డయాలసిస్ చేసుకోవాల్సి వస్తుంది. ఉస్మానియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రంలో ఉచితంగా సేవలు పొందుతున్నాను. మందులు ఉచితంగా ఇస్తున్నారు. నాలాంటి పేదలకు ఉస్మానియా దవాఖానా వరంగా మారింది.

తీపి కారాల సంక్రాంతి





ఇంటి ముంగిట రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, హరిదాసులు, గంగిరెద్దులు, చిన్నారులకు పోసే భోగిపండ్లు, చిన్నాపెద్దా ఆకాశంలో ఎగురవేసే గాలిపటాలు...వీటన్నింటినీ వెంట తీసుకువచ్చేదే సంబురాల సంక్రాంతి. ప్రతి ఇంట్లో పిండి వంటల ఘుమఘుమలు నోరూరిస్తుంటాయి.

పొంగలి

కావాల్సినవి: బియ్యం:1 గ్లాసు, పెసరపప్పు: 1/4గ్లాసు, పాలు: 1 గ్లాసు, చక్కెర: 1/2 గ్లాసు, జీడిపప్పు: 10, కిస్మిస్: 8, కొబ్బరిముక్కలు: 6, యాలకులపడి: 1 టీస్పూన్, నెయ్యి: 5టేబుల్ స్పూన్లు

తయారీ విధానం: ప్యాన్‌లో చెంచాడు నెయ్యి వేడిచేసి పెసరపప్పు దోరగా కమ్మటి వాసన వచ్చేవరకు వేయించాలి. దీనికి బియ్యం కలిపి నాలుగు గ్లాసుల నీళ్లు పోసి మెత్తగా ఉడికించాలి. తర్వాత పాలు, బెల్లం వేసి మరికొద్దిసేపు ఉడికించి యాలకుల పొడి కలపాలి. మిగిలిన నెయ్యిలో జీడిపప్పు, సన్నగా కట్ చేసిన కొబ్బరి ముక్కలు, కిస్మిస్ వేయించి అందులో కలపాలి. వేడివేడి పొంగలి సిద్ధం.









సగ్గు బియ్యం చెక్కలు

కావలసిన పదార్థాలు: బియ్యం: 3 కప్పులు, పెసరపప్పు: కప్పు, సగ్గుబియ్యం: అరకప్పు, నువ్వులు: రెంటు టేబుల్ స్పూన్లు, జీలకర్ర: టీ స్పూన్, వెన్న: 1టీ స్పూన్, కారం, ఉప్పు: రుచికి తగినంత, నూనె: వేయించడానికి సరిపడా.

తయారీ విధానం: బియ్యం, పెసరపప్పు, సగ్గుబియ్యాన్ని కలిపి మెత్తగా పిండిలా చేసుకోవాలి. అందులో నువ్వులూ, జీలకర్ర, తగినంత ఉప్పు, కారం, వెన్న వేసుకుని తగినన్ని నీళ్లతో పిండిని బాగా కలపాలి. తర్వాత ఈ పిండిని చిన్నచిన్న చెక్కల్లా వత్తుకుని వేడినూనెలో వేయించుకోవాలి. బాగా వేగాక తీసేస్తే సరిపోతుంది.

నువ్వుల లడ్డు

కావలసిన పదార్థాలు: తెల్ల నువ్వులు: నాలుగు కప్పులు, నీళ్లు: అరకప్పు, బెల్లం పొడి: ఒకటిన్నర కప్పు, కొబ్బరి తురుము : ఒక కప్పు.

తయారీ విధానం: ఒక పాన్‌లో నువ్వులు వేసి లేత గోధుమరంగులోకి వచ్చే వరకు వేగించాలి. వేరొక గిన్నెలో బెల్లం, నీళ్లు పోసి సన్నటి మంటపై వేడి చేయాలి. బెల్లం పూర్తిగా కరిగాక కొబ్బరి తురుము వేయాలి. ఈ మిశ్రమం కొద్దిగా చిక్కబడే వరకు చిన్న మంటపై మాత్రమే వేడి చేయాలి. పాకం చిక్కబడ్డాక స్టవ్ ఆపేసి నువ్వులు పోసి బాగా కలపాలి. వేడి తగ్గాక ఈ మిశ్రమంతో ఉండలు చేయాలి. అంతే నోరూరించే నువ్వుల లడ్డూ రెడీ. ఇది మహారాష్ట్రవారు సంక్రాంతికి వండుకునే ప్రత్యేక వంట.

మినపప్పు జంతికలు

కావలసిన పదార్థాలు: మినప్పప్పు: కప్పు, బియ్యప్పిండి: నాలుగు కప్పులు, వాము: చెంచా, వెన్న: పావుకప్పు, ఉప్పు: తగినంత, నూనె: వేయించడానికి సరిపడా, కారం: అరచెంచా.

తయారీ విధానం: మినప్పప్పను రెండుగ్లాసుల నీళ్లు పోసి కుక్కర్‌లో మూడు కూతలు వచ్చేవరకూ ఉడికించుకుని తీసుకోవాలి. తరవాత నీటిని వంపేసి అందులో బియ్యప్పిండీ, మిగిలిన పదార్థాలన్నీ వేసుకుని జంతికల పిండిలా కలుపుకోవాలి. ఈ పిండిని జంతికల గొట్టంలో కొద్దిగా తీసుకుని కాగుతున్న నూనెలో వేసుకుంటే సరిపోతుంది.

కోవా కజ్జికాయలు

కావాల్సిన పదార్థాలు: మైదాపిండి: 500గ్రా , పంచదార: ఒక కిలో, కోవా: 250గ్రా , జాపత్రి: రెండు గ్రా, యాలకులు: ఐదు, శనగపిండి: 50గ్రా, వంట సోడా: పావు టీ స్పూను, బేకింగ్ పౌడర్: పావు టీ స్పూను, నెయ్యి: 120గ్రా, నూనె: అరకిలో.

తయారీ: స్టౌవ్ మీద గిన్నె పెట్టి కోవా, శనగపిండి వేసి దోరగా వేయించుకోవాలి. అందులో జాపత్రిపొడి, యాలకులపొడి, పంచదారం కలిపి ముద్దగా చేసి పక్కన పెట్టుకోవాలి. మైదాలో వంటసోడా, బేకింగ్ పౌడర్, నెయ్యి, కొద్దిగా నీళ్లు కలిపి గట్టి ముద్దలా చేసుకోవాలి. చిన్న నిమ్మకాయంత పిండి ముద్దలను తీసుకుని పూరీల్లా కొంచెం మందంగా వత్తి మధ్యలో కోవా మిశ్రమాన్ని పెట్టి మడుచుకోవాలి. గిన్నెలో చక్కర పోసి రెండు గ్లాసుల నీళ్లు పోసి లేత తీగపాకం రానిచ్చి పెట్టుకోవాలి. కజ్జికాయల్ని నూనెలో వేయించి,గోరు వెచ్చని చక్కెరపాకంలో వేసి ముంచితీయాలి.

కిచెన్ టూల్స్

దారిచూపే బాటిల్స్



బయటికెళ్లేటప్పుడు చేతిలో పర్సుతో పాటు తప్పనిసరిగా తీసుకెళ్లే మరో వస్తువు వాటర్ బాటిల్. అందుకే, ఇప్పుడు ఆ బాటిళ్లను కూడా బోలెడంత హైటెక్‌గా మార్చేస్తున్నారు. అలాంటిదే 'హైడ్రా స్మార్ట్ బాటిల్' దీన్లో మంచి నీళ్లు పోసుకోవచ్చు, బ్లూటూత్‌తో పనిచేసే దీని స్పీకర్‌లో పాటలు వినొచ్చు. ఫోన్‌లో ఛార్జింగ్ అయిపోతే బాటిల్ కింది భాగంలో ఉన్న పవర్‌బ్యాంకుతో ఛార్జింగ్ కూడా పెట్టుకోవచ్చు. బయటినుంచి వచ్చేటప్పుడు చీకటి పడిపోతే దీన్లో ఉన్న లైటు దారి కూడా చూపుతుంది. ఒక్క బాటిల్ ఉంటే ఎన్ని ఉపయోగాలో కదా..!

ఇవి మాత్రలు కాదు!

ఒక వయసొచ్చాక షుగర్, బీపీ... ఇంకా రకరకాల అనారోగ్యాలు రావడం మామూలే. వాటికోసం రోజూ మాత్రలు మింగడమూ తప్పని సరి అవుతుంది. పొద్దుట్నుంచీ సాయంత్రం దాకా బజారు పనిబడ్డా, ఒకటి రెండు రోజులు ఏ ఊరైనా వెళ్ళాల్సి వచ్చినా అన్నిరకాల మాత్రల అట్టల్నీ లేదా సీసాల్ని తీసుకెళ్ళాలంటే కష్టం. కొన్ని రకాల మందుబిళ్లలు విడివిడిగా డబ్బాలోనూ సీసాల్లోనే వస్తాయి. ఆ డబ్బాలన్నింటినీ వెంట తీసుకెళ్లాలన్నా ఇబ్బందే. ఆ సమస్య లేకుండా మందు బిళ్లలను వేసుకునేందుకు అచ్చం మాత్రల్లానే ఉండే చిన్న చిన్న ప్లాస్టిక్ బాక్సులు వస్తున్నాయి. ఒక్కో డబ్బాలో నాలుగైదు అరలుంటాయి కాబట్టి మందుబిళ్లల్ని దేనికదే విడిగా అందులో వేసుకుని తీసుకెళ్లొచ్చు.



మన రంగవల్లులు



15చుక్కలు
8 వచ్చే వరకు

అక్కెనపల్లి ఆర్షిత
అంబర్‌పేట్,
హైదరాబాద్



స్వప్న,
యాదాద్రి,



22చుక్కలు
8 వరుసలు
8 వచ్చే వరకు

ప్రతిభ
నవాబుపేట,
మహబూబ్‌నగర్



మళ్లీ పెరుగుతున్న పెట్రో ధరలు

న్యూఢిల్లీ: రోజువారీ సమీక్షలో భాగంగా చమురు సంస్థలు పెట్రోలు, డీజిలు ధరలను మరోసారి పెంచాయి. శనివారం పెట్రోలుపై లీటరుకు 19 పైసలు, డీజిలుపై 29 పైసలు పెంచాయి. దీంతో ఢిల్లీలో లీటరు పెట్రోలు ధర లీటరు రూ.69.26 కాగా, డీజిలు రూ.63.00 అయింది. రాష్ట్రాల్లో వ్యాట్‌తో కలుపుకొంటే ముంబయిలో లీటరు పెట్రోలు ధర రూ.74.91 కాగా ,డీజిలు ధర రూ.66.04కు చేరుకుంది. కోల్‌కతాలో ఈ ధరలు వరసగా రూ.71.39, రూ.64.87 ఉండగా, చెన్నైలో రూ.71.87, రూ.66.62గాఉన్నాయి గత కొద్ది రోజులుగా తగ్గుతూ వస్తున్న చమురు ధరలు ఇప్పుడు మళ్లీ పెరుగుతూ ఉండడం గమనార్హం. గత మూడు రోజులుగా ఈ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ చమురు మార్కెట్లో ముడి చమురు ధరలు 2 శాతం తగ్గినప్పటికీ మన దేశంలో మాత్రం పెరుగుతుండడం గమనార్హం.

ఈ ఏడాది మూడు కొత్త ఐ ఫోన్ మోడల్స్?



వాషింగ్టన్: అమెరికాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ యాపిల్ ఈ ఏడాది మూడు కొత్త ఐఫోన్ మోడళ్లను విడుదల చేయడానికి సిద్ధమవుతున్నట్లు పరిశ్రమ వర్గాల సమాచారం. ఈ విషయం వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ నివేదికలో వెల్లడించింది. కొత్తగా విడుదలయ్యే మోడల్స్‌లో ఐఫోన్ ఎక్స్‌ఆర్ మోడల్‌కు తర్వాతి వెర్షన్ కూడా ఉండవచ్చని తెలుస్తోంది. అలాగే కొత్త మోడల్స్‌లో సరికొత్త కెమెరా ఫీచర్లను కూడా చేర్చనున్నట్లు తెలుస్తోంది. అ ఇటీవల యాపిల్ షేర్లు అత్యధికంగా పదిశాతం మేర పడిపోయాయి.ఆరేళ్ల కాలంలో ఇంట్రాడే ట్రేడింగ్‌లో సైతం అధికంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో కంపెనీ గత వారం 12 ఏళ్లలో తొలిసారి ఆదాయానికి సంబంధించిన హెచ్చరికలు చేసింది.2020 సంవత్సరానికి యాపిల్ పూర్తిగా ఒఎల్ఇడి డిస్‌ప్లేకు మారుతుందని, ఎల్‌సిడి డిస్‌ప్లేను పూర్తిగా నిలిపివేస్తుందని కూడా ఆ నివేదిక తెలిపింది.

నిస్సాన్ నుంచి తప్పుకొన్న మనోజ్

టోక్యో: జపాన్‌కు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ నిస్సాన్ మాజీ చైర్మన్ కార్లోస్ గోస్న్ అరెస్టు తర్వాత ఆ సంస్థకు చెందిన టాప్ ఎగ్జిక్యూటివ్, సంస్థలో చీఫ్ పెర్ఫార్మెన్స్ ఆఫీసర్ జోస్ మునోజ్ తన పదవికి రాజీనామా చేశారు.గత వారం సెలవుపై వెళ్లిన మునోజ్ శనివారం తన పదవికి రాజీనామా చేశారు. కార్లోస్ అరెస్టుతో మునోజ్ రాజీనామాకు సంబంధం ఉన్నట్లు కంపెనీ మొట్టమొదటిసారిగా అంగీకరించడం గమనార్హం. కంపెనీ తాను దృష్టి పెట్టాల్సిన వాటిపై కాకుండా వేరే వాటిపై దృష్టి పెడుతున్న కారణంగా ఎంతో దీర్ఘంగా ఆలోచించిన తర్వాత తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు మునోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మునోజ్ రాజీనామాను ధ్రువీకరించిన నిస్సాన్ ఈ రాజీనామా తక్షణం అమలులోకి వచ్చినట్లు తెలిపింది. కంపెనీ అంతర్జాతీయ వ్యూహాలను పర్యవేక్షించే స్పెయిన్‌కు చెందిన మునోజ్ గత 14 ఏళ్లుగా నిస్సాన్‌లో పని చేస్తున్నారు.

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	70.43
యూరో	81.13
బ్రిటిష్ పౌండ్	89.84
ఆస్ట్రేలియన్ డాలర్	50.68
కెనెడియన్ డాలర్	53.29
సింగపూర్ డాలర్	52.09
స్విస్ ఫ్రాంక్	71.59
చైనీస్ యువాన్	10.41
మలేషియన్ రింగిట్	17.19
న్యూజిలాండ్ డాలర్	47.86
హాంకాంగ్ డాలర్	8.98
జపనీస్ యెన్	0.65
కువైట్ దినార్	232.67
సౌతాఫ్రికన్ రాండ్	5.09

బులియన్



బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22 క్యారట్	24 క్యారట్	మార్పు(%)
చెన్నై	30690	32823.53	0.1%
ముంబై	31280	33454.55	0%
ఢిల్లీ	31400	33582.89	0%
కోల్‌కతా	31750	33957.22	0%
కేరళ	33957.22	36317.88	0%
బెంగళూరు	30160	32256.68	0.13%
హైదరాబాద్	30720	32855.61	0.1%
గల్ఫ్	137.68	147.25	0%

వెండి ధర (రూ./ కిలో)

చెన్నై	₹ 42049.00
ముంబై	₹ 42049.00
ఢిల్లీ	₹ 42049.00
కోల్‌కతా	₹ 42049.00
హైదరాబాద్	₹ 42049.00



అటూ.. ఇటుగా మార్కెట్లు



ముంబై: అమెరికా–చైనా వాణిజ్య చర్చల్లో పురోగతి మధ్య అంతర్జాతీయ సెంటిమెంట్ మేరకు గతవారం మార్కెట్లు సానుకూలంగా సాగాయి. అయితే ఆఖరి రోజుల్లో నష్టాలతో ముగిసినా.. మొత్తానికి సానుకూలంగా ఉన్నాయి. మార్కెట్లు ఐటి దిగ్గజ సంస్థలు టిసిఎస్, ఇన్ఫోసిస్ మూడో త్రైమాసిక ఫలితాల కోసం వేచిచూశాయి. టిసిఎస్ (టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) మంచి ఫలితాలను ప్రకటించగా, ఇన్ఫోసిస్ మాత్రం డీలాపడింది. మరోవైపు చమురు ధరలు, కమోడిటీ ధరలు తగ్గుదల కొన్ని కంపెనీలకు కలిసివచ్చింది. వారాంతంలో చమురు ధరలు పెరగడంతో రూపాయి ఒత్తిడికి లోనయింది. సిపిఐ ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు వెలువడ్డాయి. ఆర్‌బిఐ వడ్డీ రేటును ఈసారి తగ్గించవచ్చని ఇన్వెస్టర్లు భావిస్తున్నారు. గతవారం పరిణాలు ఇలా ఉన్నాయి.

వృద్ధి రేటు 7.2 శాతం: సిఎస్‌ఒ

ప్రసుత్త ఆర్థిక సంవత్సరం(2018–19)లో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7.2 శాతంగా ఉంటుందని కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) అంచనా వేసింది. అంతకుముందు ఏడాది వృద్ధి రేటు 6.7 శాతంతో పోలిస్తే ఇది గరిష్ట స్థాయిలో ఉంది. వ్యవసాయం, ఉత్పాదక రంగాలు మెరుగ్గా కనిపిస్తుండడం వల్లే వృద్ధి రేటు పెరగనుందని అంచనా వేస్తున్నారు. ఈ నివేదికలో వ్యవసాయం, అటవీ సంబంధిత, మత్స్య కార్యకలాపాలు గత ఏడాది 3.4 శాతం ఉండగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 3.8 శాతానికి పెరగనున్నాయని పేర్కొంది. ఇక 2017 18లో 5.7 శాతంగా నమోదైన తయారీ రంగం 8.3 శాతం వృద్ధి చెందుతుందని అంచనా వేసింది.

వృద్ధి రేటు 7.3 శాతం : ప్రపంచ బ్యాంక్

2018–19 ఆర్థిక సంవత్సరంలో భారత్ జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) వృద్ధి రేటు 7.3 శాతం నమోదు కానుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. ఆ తర్వాతి వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో 7.5 శాతం వృద్ధి రేటును చూపనుందని వెల్లడించింది. పెట్టుబడులు, వినియోగంలో పెరుగుదలే వృద్ధిలో పురోగతికి కారణమని తెలిపింది. అదే విధంగా ఈ సంవత్సరంలో ప్రపంచ వృద్ధి రేటు 3 శాతం నుంచి 2.9 శాతానికి తగ్గనుందని పేర్కొంది.



నగదు కొరతపై చర్యలు

దేశీయఆర్థిక వ్యవస్థలో నగదు కొరత సమస్య ఉంటే ఆర్‌బిఐ తగిన చర్యలు చేపడుతుందని రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ప్రస్తుతానికి నగదు నిల్వల సమస్య చాలా వరకు తీరిందని ఆయన అన్నారు. నగదు కొరత సమస్య తగ్గిందని, తరచూ ఈ అంశంపై సమీక్ష చేస్తున్నామని చెప్పారు.

డిజిటల్ పేమెంట్ కమిటీ చైర్మన్‌గా నిలేకనీ

భారత్‌లో డిజిటల్ పేమెంట్ల నిర్ణయాల కోసం ఉన్నత స్థాయి కమిటీ చైర్మన్‌గా ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నిలేకనిని ఆర్‌బిఐ నియమించింది. ఐదుగురు సభ్యులతో ఆర్‌బిఐ ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి నిలేకని నేతృత్వం వహిస్తారు. దేశంలో డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, ఆర్‌బిఐ పెద్ద ఎత్తున చర్యలు చేపడుతున్నాయి.

చిన్న వ్యాపారులకు జిఎస్‌టి నుంచి ఊరట

చిన్న వ్యాపారులకు జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) నుంచి ఊరట లభించింది. చిన్న, మధ్యతరహా పరిశ్రమ రంగానికి పన్ను మినహాయింపు పరిమితిని రెట్టింపు చేస్తున్నట్టు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటించారు. 2019 ఏప్రిల్ నుంచి ఈ పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని పొందనున్నారు. గురువారం జిఎస్‌టి మండలి 32వ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంతకుముందు రూ.20 లక్షల వరకు టర్నోవర్ కల్గిన వ్యాపారాలకు మినహాయింపు ఉండేది. తాజాగా ఈ మినహాయింపును రూ.40 వేలకు పెంచుతూ జిఎస్‌టి మండలి నిర్ణయం తీసుకుంది. కాంపొజిషన్ పథకం కింద ఉండే పరిమితిని కోటి రూపాయలు నుంచి రూ.1.5కోట్లకు పెంచుతున్నామని, ఈ పథకం కింద వ్యాపారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్నులు చెల్లించాలని, అయితే రిటర్న్ మాత్రం ఏడాదికి ఒకసారి మాత్రమే దాఖలు చేయాలని జైట్లీ వివరించారు.

టిసిఎస్ లాభం 24.1 శాతం పెరిగింది

దేశీయ సాఫ్ట్‌వేర్ సేవల దిగ్గజం టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) మూడో త్రైమాసికంలోనూ దుమ్మురేపింది. సంస్థ నికర లాభం రూ.8,105 కోట్లతో 24.1 శాతం పెరిగింది. గతేడాది ఇదే సమయంలో టిసిఎస్ నికర లాభం రూ.6,531 కోట్లు మాత్రమే. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2018–19) క్యూ3(అక్టోబర్–డిసెంబర్) ఫలితాలను గురువారం టిసిఎస్ ప్రకటించింది. అలాగే మూడో త్రైమాసికంలో టిసిఎస్ ఆదాయంలో 20.8 శాతం వృద్ధిరేటు నమోదు చేసింది. గతేడాదిలోని రూ.30,904 కోట్ల నుంచి రూ.37,338 కోట్లకు ఆదాయం పెరిగింది.

ఇన్ఫీ లాభం తగ్గింది



దేశీయ రెండో అతిపెద్ద సాఫ్ట్‌వేర్ సేవల సంస్థ ఇన్ఫోసిస్ అక్టోబర్–డిసెంబర్(క్యూ3)లో కంపెనీ ఆదాయం అంచనాలను మించింది. అయితే అత్యధిక ఆపరేటింగ్ వ్యయం వల్ల నికర లాభం అంచనాలను అందుకోలేకపోయింది. రూ.8,260 కోట్ల వరకు షేర్ బైబ్యాక్‌కు ఇన్ఫోసిస్ బోర్డు ఆమోదం తెలిపింది.

పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది



తయారీ రంగంలో ప్రతికూలతల కారమంగా గతేడాది నవంబర్‌లో దేశీయ పారిశ్రామిక ఉత్పత్తి క్షీణించింది. పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపి) 0.5 శాతంతో 17 నెలల కనిష్టానికి పడిపోయింది. అయితే 2017 నవంబర్‌లో ఫ్యాక్టరీ ఉత్పత్తి 8.5 శాతం ఉండగా, ప్రస్తుత అత్యంత కనిష్టానికి చేరింది. అంతకు ముందు కనిష్ఠ వృద్ధి రేటు 0.3 శాతం 2017 జూన్‌లో నమోదైంది.

ఎయిరిండియా ఆదాయం పెరిగింది



న్యూఢిల్లీ: గడచిన త్రైమాసికంలో ప్రయాణికుల నుంచి వచ్చే ఆదాయం పెరిగిందని ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ప్రకటించింది. ప్రయాణికులనుంచి వచ్చే ఆదాయం 20 శాతం పెరగ్గా ప్రయాణికుల సంఖ్యమాత్రం 4 శాతమే పెరిగిందని ఆ సంస్థ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఉన్న విమానాలను చక్కగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడం వల్ల ఈ ఆదాయం పెరిగినట్లు ఆయన చెప్పారు. 2017 – 18 డిసెంబర్ త్రైమాసికంలో ప్రయాణికులనుంచి వచ్చిన ఆదాయం రూ. 4615 కోట్లు కాగా, 2018– 19 డిసెంబర్ త్రైమాసికంలో రూ.5538 కోట్లకు పెరిగిందని చెప్పారు. అలాగే 2018 – 19లో ప్రయాణికుల సంఖ్య55.27 లక్షలుగా నమోదయిందని, 2017 –18లో ఈ సంఖ్య 53.28 లక్షలుగా నమోదయిందని ఎయిరిండియా అధికారి చెపాప్పారు. అంటే ప్రయాణికుల సంఖ్య 4 శాతం పెరిగినట్లని తెలిపారు. కాగా గత త్రైమాసికంలో సంస్థ 15 కొత్త సర్వీసులను ప్రారంభించిందని ఆయన చెప్పారు. సంస్థ ఆదాయంలో 65 శాతం అంతర్జాతీయ మార్గాలద్వారానే లభిస్తోంది. మిగతాది దేశీయ మార్గాలనుంచి వస్తోంది. ఎయిరిండియా సంస్థ దాదాపు 48 వేల కోట్ల రూపాయల అప్పుల్లో కూరుకుపోయిన విషయం తెలిసిందే. గత ఏడాది మేలో ప్రభుత్వం ఎయిరిండియానుంచి పెట్టుబడుల ఉపసంహరణకు ప్రయత్నించి విఫలమైంది.

తగ్గిన బంగారం ధర



న్యూఢిల్లీ: గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరలకు బ్రేక్ పడింది. శనివారం పది గ్రాములపై రూ.155 తగ్గడంతో పసిడి ధర రూ.33 వేల దిగువకు పడిపోయింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో పది గ్రాముల స్వచ్ఛమైన బంగారం రూ32,875కు చేరుకుంది.అంతర్జాతీయంగా బలహీనమైన సంకేతాలకు తోడు ఆబరణాల తయారీదారులనుంచి డిమాండ్ తగ్గడం కూడా బంగారం ధర తగ్గడానికి కారణమని బులియన్ ట్రేడింగ్ వర్గాలు అంటున్నాయి. మరో వైపు వెండి కూడా బంగారం బాటలోనే నడిచింది. ఒకే రోజు రూ.600 మేర తగ్గడంతో కిలో వెండి రూ.40 వేల దిగువకు చేరుకుంది. ఢిల్లీ మార్కెట్‌లో కిలో వెండి రూ.39,850గా ఉంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారులనుంచి డిమాండ్ లేకపోవడమే వెండి ధర బారీగా తగ్గడానికి కారణాలుగా చెప్తున్నారు. అటు అంతర్జాతీయ మార్కెట్లో కూడా బంగారం ధర తగ్గింది.న్యూయార్క్ మార్కెట్లో ఔన్స్ ధర 1287.80 డాలర్లు పలుకుతోంది.

సిటీ బ్యాంక్‌కు రూ.3 కోట్ల పెనాల్టీ

ముంబయి: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ) సిటీ బ్యాంక్‌కు భారీ షాక్ ఇచ్చింది. అమెరికా ప్రధాన కేంద్రంగా పని చేసే ఈ బ్యాంక్‌కు ఆర్‌బిఐ రూ.3 కోట్ల జరిమానా విధించింది.' ఫిట్ అండ్ సబ్జెక్ట్ క్రైటీరియా 'కు సంబంధించిన సూచనలు పాటించనందుకే ఆర్‌బిఐ ఈ పెనాల్టీ విధించింది. ఆదేశాల మేరకు డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించకపోవడమే ఇందుకు కారణమని ఆర్‌బిఐ ఒక ప్రకటనలో తెలిపింది. సమర్థులైన డైరెక్టర్లను నియమించాలని, సరయిన అర్హతలుండాలని ఆర్‌బిఐ గతంలో సిటి బ్యాంక్‌ను ఆదేశించింది. అయితే బ్యాంకు ఈ ఆదేశాలను పాటించక పోవడంతో ఆర్‌బిఐ 2019 జనవరి 3న రూ.3 కోట్ల జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే వినియోగదారుల లావాదేవీలకు ఈ జరిమానాతో సంబంధం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆ ప్రకటనలో స్పష్టం చేసింది.

ప్రపంచ బ్యాంక్ చైర్మన్ రేసులో ఇవాంకా!

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా ట్రంప్ ప్రపంచ బ్యాంక్ చైర్మన్ రేసులో ఉన్నట్లు తెలుస్తోంది.గత వారం ప్రపంచ బ్యాంక్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన జిమ్ యోంగ్ కిమ్ స్థానంలో ఎంపిక చేయడానికి పరిశీలనలో ఉన్న కొద్దిమంది పేర్లలో ఇవాంకా ట్రంప్ పేరు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ట్రంప్ చిన్న కుమార్తె అయిన ఇవాంకా ఇప్పుడు అధ్యక్షుడికి సలహాదారుగా ఉన్న విషయం తెలిసిందే. మూడున్నరేళ్ల పదవీ కాలం ఉండగానే కిమ్ గత వారం హటాత్తుగా ప్రపంచ బ్యాంక్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. 2011లో మొట్టమొదటిసారి ప్రపంచ బ్యాంక్ చైర్మన్‌గా అప్పటి అమెరికా అధ్యక్షుడు బరాక్ ఒబామా కిమ్‌ను ఎంపిక చేశారు.2016లో మరోసారి ఆయన ఆ పదవికి తిరిగి ఎన్నికయ్యారు. అయితే అర్ధంతరంగా ఆయన తన పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో కొత్త అధ్యక్షుడి పేరును ప్రతిపాదించే అవకాశం ట్రంప్‌కు లభించింది. కాగా, ఈ పదవికి పరిశీలనలో ఉన్న వారి పేర్లలో ఇవాంకా కాకుండా ఆర్థిక శాఖ అధికారి డేవిడ్ మాల్‌పాస్, ఐక్యరాజ్య సమితిలో మాజీ రాయబారి నిక్కీ హేలీ, యుఎస్ ఏజన్సీ ఫర్ ఇంటర్నేషనల్ డెవలప్‌మెంట్ అధిపతి మార్క్ గ్రీన్ ఉన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలియజేసింది.



ప్రపంచ బ్యాంక్‌లో అతి పెద్ద వాటాదారయిన అమెరికా సూచించిన వారికే ప్రరంచ బ్యాంక్ చైర్మన్ పదవి దక్కుతూ ఉండడం ఆనవాయితీగా వస్తోంది.

బిగ్ సిలో 'సంక్రాంతి' ఆఫర్లు

మనతెలంగాణ/హైదరాబాద్ : సంక్రాంతి పండుగ సందర్భంగా మొబైల్ రిటైల్ విక్రయరంగ నెంబర్‌వన్ సంస్థ బిగ్ 'సి' వినూత్న ఆఫర్లను ప్రకటించింది. ఎంపిక చేయబడిన మొబైల్స్ కొనుగోళ్లపై విలువైన బహుమతులు అందజేయనున్నట్లు బిగ్ 'సి' ప్రతినిధి తెలిపారు. ప్రతి పండుగలను, పర్వదినాన్ని పురస్కరించుకుని వినూత్న ఆఫర్లను అందజేయడం బిగ్ 'సి' ఆనవాయితీ అని పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని వినూత్న ఆఫర్లను అందిస్తున్నామని వివరించారు. తమ షోరూంలో మొబైల్స్ కొనుగోళ్లపై 0 శాతం వడ్డీ, 0 శాతం డౌన్ పేమెంట్, 0 శాతం ప్రాసెసింగ్ ఫీ లాంటి ఆకర్షణీయమైన రుణ సదుపాయాన్ని అందజేస్తున్నామని తెలిపారు.



బిగ్ 'సి'లో మాత్రమే లభించే ఆఫర్లు

- బజాజ్ ఫైనాన్స్ ద్వారా కొనుగోలు చేసిన ప్రతి మొబైల్‌పై 10 శాతం క్యాష్‌బ్యాక్
- ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.2200 వరకు జియో క్యాష్ బ్యాక్, 30 జిబి జియో డాటా ఉచితం
- ఎంపిక చేయబడిన మొబైల్స్‌పై వన్ టైం స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఉచితం

బిగ్ 'సి'లో లభించే సంక్రాంతి ఆఫర్లు

- సామ్‌సంగ్ గ్యాలక్సీ జె6,ఎ6+,ఎ7 మొబైళ్ కొనుగోలుపై అన్ని ప్రముఖ బ్యాంకుల నుంచి 10 శాతం క్యాష్ బ్యాక్, బజాజ్ ఫైనాన్స్ ఇఎంఐ, టివిఎస్ క్రెడిట్ వారి ఇఎంఐ
- ఒప్పో ఎఫ్9 ప్రొ మొబైల్ కొనుగోలుపై రైస్ కుక్కర్ ఉచితం
- అన్ని వివో మోడల్స్‌పై సర్‌ప్రైజ్ ఇవ్వబడును
- రూ.1590 విలువగల కార్బన్ కె3 బూమ్ మ్యాక్స్ మొబైల్ కొనుగోలుపై రూ.2500 విలువగల పెడస్టల్ ఫ్యాన్ ఉచితం
- ప్రతి మొబైల్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి

22న విడుదల కానున్న హానర్ వ్యూ 20 మొబైల్



న్యూఢిల్లీ: ప్రముఖ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థ హువావే తన కొత్త స్మార్ట్ ఫోన్ హానర్ వ్యూ 20ని ఈ నెల 22న విడుదల చేయనుంది. ఇందుకుగాను ఈ ఫోన్‌కు ఈ నెల 15నుంచి అమెజాన్‌లో ప్రీ బుకింగ్స్‌ను ప్రారంభించనున్నారు. అయితే ఈ ఫోన్ ధర ఇంకా వెల్లడి కాలేదు. ఈ ఫోన్‌ను ప్రీబుకింగ్ చేసే వారికి రూ.2,999 విలువైన హానర్ స్పోర్ట్ బీటీ ఇయర్‌ఫోన్స్‌ను ఉచితంగా అందివ్వనున్నారు. ఇక ఈ ఫోన్‌లో 6.4 అంగుళాల భారీ డిస్‌ప్లేను ఏర్పాటు చేశారు. ముందు భాగంలో 25 మెగా పిక్సల్ కెపాసిటీ ఉన్న ఇన్ డిస్‌ప్లే సెల్ఫీ కెమెరాను ఏర్పాటు చేశారు. ఈ ఫోన్‌లో కైరిన్ 980 ప్రాసెసర్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల ఫోన్ వేగవంతమైన ప్రదర్శనను ఇస్తుంది. ఈ ఫోన్‌లో వెనుక భాగాన 48మెగా పిక్సల్ కెమెరాను అమర్చారు. అలాగే 3డి ఫొటోలను తీసుకోవడానికి పక్కనే మరో కెమెరాను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఫోన్‌లో 4000 ఎంఎహెచ్ కెపాసిటీ ఉన్న భారీ బ్యాటరీని అమర్చారు.

'సింబా' ఘన విజయం సాధించి 200 కోట్ల క్లబ్‌లో చేరిన నేపథ్యంలో చాలా మంది నాకు శుభాకాంక్షలు చెబుతున్నారు. కానీ ఇద్దరి శుభాకాంక్షలను మాత్రం మిస్ అవుతున్నాను. మా అమ్మా నాన్నలు లేని లోటు తెలుస్తోంది. నేను విజయం సాధించిన ప్రతిసారీ వాళ్లను మిస్ అవుతున్నా.

–బాలీవుడ్ నటుడు సోనూసూద్



'అసలేం జరిగింది?' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపి సంతోష్‌కుమార్. చిత్రంలో శ్రీరాం, ఎన్‌విఆర్, శ్రీమతి నీలిమా తదితరులు.

అసలేం జరిగింది?

ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న 'అసలేం జరిగింది?' చిత్రం పోస్టర్‌ను ఎంపి సంతోష్‌కుమార్ ఆవిష్కరించారు. శ్రీరాం హీరోగా రూపొందుతున్న ఈ చిత్రంతో కెమెరామెన్ ఎన్‌విఆర్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ సందర్భంగా ఎంపి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ శ్రీమతి నీలిమా నిర్మాతగా రూపొందుతున్న ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకు ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకోసం చిత్ర యూనిట్ ఆరు నెలల పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయమన్నారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్న కెమెరామెన్ ఎన్‌విఆర్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఇక రామ్‌గోపాల్‌వర్మ నిర్మించిన 'భైరవగీత' విలన్ విజయ్‌రామ్ ఈ చిత్రంలో ప్రతి నాయకుడి పాత్రలో నటిస్తున్నారు. మహావీర్ మ్యూజిక్‌ను అందిస్తున్న ఈ చిత్రానికి నెర్రపల్లి వాసు కథ అందించారు. ఫిబ్రవరి 11 నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని... రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తిచేస్తామని నిర్మాత కె.నీలిమా తెలిపారు. ఈ చిత్రానికి పాటల రచయితలు చిర్రావూరి విజయ్‌కుమార్, డా.చల్లా భాగ్య లక్ష్మి , వెంకటేష్. విజయ్ ఏసుదాస్, విజయ్ ప్రకాష్, యాజిన్ నిజార్, రాంకీ, భార్గవి పిళ్లై తదితరులు ఈ చిత్ర గీతాలను ఆలపించారు.

ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు



నాని

నాని హీరోగా తెరకెక్కుతున్న చిత్రం 'జెర్సీ' గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా టీజర్ విడుదలైంది. 1.28 నిమిషాలు గల ఈ టీజర్‌లో లేట్ వయసులో క్రికెటర్ కావాలని తపన పడే క్రికెట్ ప్రేమికుడిగా నాని కనిపించారు. ''నీ ఏజ్ ఇప్పుడు 36 అర్జున్. ప్రొఫెషనల్స్ స్పోర్ట్స్ నుండి రిటైర్ అయ్యే ఏజ్ ఇది'' అనే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమైంది. దీంతో టీజర్ ఓపెన్ చేయగానే నేరుగా సినిమా కాన్సెప్ట్‌ను చెప్పేశాడు దర్శకుడు. ''పిల్లలను ఆడించే వయసులో మనకు ఆటలెందుకు బావా?''అని ఒకరు... 'ఎంత ప్రయత్నించినా ఇప్పుడు నువ్వేం చేయలేవు. యూ హ్యాడ్ యువర్ ఛాన్స్ అండ్ ఇట్స్ ఓవర్ నౌ''అని మరొకరు... ఇలా అందరు అర్జున్‌ను నిరుత్సాహపరిచేవారే. చివరికి నాని తన ఆశయాన్ని ఎలా సాధించుకున్నారన్నదే ఈ కథ. ఇక ఫైనల్ టచ్‌గా ''ఆపేసి ఓడిపోయిన వాడు ఉన్నాడు కానీ...
ప్రయత్నిస్తూ ఓడిపోయిన వాడు లేడు''అంటూ నాని చెప్పే డైలాగ్ అందరినీ ఆకట్టుకుంటుంది. 'ఇట్స్ నెవర్ టూ లేట్ టు డ్రీమ్' అనే క్యాప్షన్‌కు తగ్గట్టే హీరో పాత్ర చిత్రణ ఉంది. స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ కావడంతో విజువల్స్ ఫ్రెష్‌గా ఉన్నాయి. అనిరుధ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా డిఫరెంట్‌గా ఉంది. మనకు బాగా ఇష్టమైనవి రెండు. ఒకటి సినిమా రెండు క్రికెట్. ఈ రెండింటిని మిక్స్ చేసి తెరకెక్కిస్తున్న 'జెర్సీ'లో నాని వంటి నేచురల్ స్టార్ ఉంటే ఇక చెప్పేదేముంటుంది.

త్వరలో నిశ్చితార్థం



విశాల్

గత మూడు, నాలుగు సంవత్సరాలుగా తమిళ హీరో విశాల్ పెళ్లి గురించిన వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. శరత్‌కుమార్ కూతురు వరలక్ష్మి తోఆయన ప్రేమలో ఉన్నారని... ఇద్దరు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నట్టుగా మీడియాలో వార్తలు వచ్చాయి. ఇద్దరి వ్యవహారం చూసిన ప్రతి ఒక్కరూ కూడా నిజంగానే వీరిద్దరు పెళ్లి చేసుకుంటారేమో అని భావించారు. కానీ విశాల్ మాత్రం వరలక్ష్మి తనకు స్నేహితురాలు మాత్రమే అని పలుసార్లు చెప్పారు. అన్నట్టుగానే ఈ తమిళ్ సూపర్‌స్టార్ వరలక్ష్మి ని కాకుండా హైదరాబాద్‌కు చెందిన అమ్మాయి అనీషాను వివాహం చేసుకోబోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన విజయ్ రెడ్డి, పద్మల కూతురు అనీషా. వీరిద్దరిది పెద్దలు కుదిర్చిన వివాహంగా అంతా అనుకుంటున్నారు. కానీ అనూహ్యంగా విశాల్ తన పెళ్లి గురించి మాట్లాడుతూ తమది ప్రేమ వివాహమని చెప్పారు. తాను చాలా సంవత్సరాలుగా అనీషాను ప్రేమిస్తున్నానని... మాది పెద్దలు ఒప్పుకున్న ప్రేమ వివాహమని అన్నారు. ప్రస్తుతం విశాల్, అనీషాల వివాహ నిశ్చితార్థానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అతి త్వరలోనే హైదరాబాద్‌లో ఈ నిశ్చితార్థం వైభవంగా జరుగబోతోంది. ఇక విశాల్ మొదటి నుండి చెబుతూ వస్తున్నట్లుగా నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తయిన తర్వాతే వివాహం చేసుకుంటానని ఇప్పుడు కూడా పేర్కొన్నారు. త్వరలోనే నడిగర్ సంఘం భవన నిర్మాణం పూర్తి కానుండగా అందులోనే విశాల్ వివాహం జరుగనుంది.

హనీ ఈజ్ ద బెస్ట్

మెహరీన్ కౌర్



యంగ్ బ్యూటీ మెహరీన్ కౌర్ టాలీవుడ్‌లో ఈమధ్య వరుసగా పెద్ద సినిమాల్లో నటిస్తూ దూసుకుపోతోంది. తాజాగా ఈ భామ 'ఎఫ్2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ చిత్రం హిట్ టాక్‌తో దూసుకుపోతుండడంతో మెహరీన్ ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. ఇక సోషల్ మీడియాలో తరచుగా సందడి చేసే ఈ భామ తాజాగా తన కొత్త ఫొటోను పోస్ట్ చేసింది. ఈ ఫొటోలోని మెహరీన్ కౌర్‌లో అణువణువునా గ్లామర్ యాంగిల్ నిండిపోయింది. ఎల్లో కలర్ లెహంగా, బ్లూ కలర్ జాకెట్‌తో క్యూట్ గ్లామర్‌ను పండించింది ఈ యంగ్ బ్యూటీ. తన వస్త్రాలకు తగ్గట్టు మ్యాచింగ్ కూలింగ్ గ్లాసెస్ పెట్టుకున్న ఈ భామ చిరునవ్వులు చిందిస్తూ అభిమానులను ఆకట్టుకుంటోంది. మెహరీన్ పిక్స్ అన్నింట్లోనూ బెస్ట్ పిక్‌గా దీన్ని అభివర్ణించవచ్చు. ఇక 'ఎఫ్2' చిత్రంలో ఈ భామ హనీగా దర్శనమిచ్చి ప్రేక్షకులను అలరిస్తోంది. ఇందులో వరుణ్‌తేజ్‌కు జోడీగా ఆమె కనిపించింది. సినిమాలో మిల్కీబ్యూటీ తమన్నాకు గట్టి పోటీ ఇచ్చి ఆకట్టుకుంటోంది మెహరీన్.





వెంకటేశ్‌తో ఆయన అభిమాన సంఘం ఆలిండియా అధ్యక్షుడు పూర్ణచందర్‌రావు. పక్కన 'ఎఫ్2' విడుదల సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దిల్‌రాజు.

వెంకటేష్ అభిమాన సంఘం సంబరాలు

వెంకటేశ్, వరుణ్‌తేజ్ హీరోలుగా తమన్నా, మెహరీన్ హీరోయిన్లుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఎఫ్2'. దిల్‌రాజు నిర్మించిన ఈ చిత్రం శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అయితే హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ థియేటర్‌లో 'ఎఫ్2' చిత్రం విడుదలైంది. శనివారం ఉదయం వెంకటేష్, వరుణ్‌తేజ్, మెహరీన్, అనిల్ రావిపూడి, దిల్‌రాజు, శిరీష్‌లు ఈ థియేటర్‌ను సందర్శించి ప్రేక్షకులు, అభిమానులకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ అభిమాన సంఘం ఆలిండియా అధ్యక్షుడు పూర్ణచందర్ రావు వెంకటేశ్ వెంట ఉన్నారు. 'ఎఫ్2' చిత్రం విడుదలైన సందర్భంగా థియేటర్‌లో నిర్మాత దిల్‌రాజు చేత కేక్ కట్ చేయించి అభిమానులు సంబరాలు చేసుకున్నారు. వెంకటేశ్ కెరీర్‌లోనే ఈ చిత్రం పెద్ద హిట్‌గా నిలవాలని కోరుకుంటున్నట్టు పూర్ణ చందర్ రావు అన్నారు.



లావణ్య

బలమైన కథతో..

తరుణ్ తేజ్, లావణ్య హీరోహీరోయిన్లుగా పరిచయమవుతూ శ్రీమతి సత్య ప్రమీల కర్లపూడి సమర్పణలో గోల్డ్ టైమిన్ పిక్చర్స్ బ్యానర్‌పై డా.లింగేశ్వర్ నిర్మిస్తున్న చిత్రం 'ఉండిపోరాదే'. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు బ్యానర్‌లో అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేసిన నవీన్ నాయని ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఇప్పటికే రాజమండ్రి, ఆత్రేయపురం పరిసర ప్రాంతాల్లో మొదటి షెడ్యూల్ షూటింగ్‌ను పూర్తిచేసుకుంది ఈ చిత్రం. సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రం టైటిల్, ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత డా.లింగేశ్వర్ మాట్లాడుతూ ''బలమైన కథకు తగ్గట్టుగా నటీనటులు ఉంటే దర్శకుడు కొత్త, పాత అనే తేడా చూపకుండా సినిమాను ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. ఇదేవిధంగా బలమైన కథతో మా బ్యానర్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. తరుణ్‌తేజ్, లావణ్య జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు నవీన్ నాయని తెరకెక్కిస్తున్నాడు. ఈ చిత్రానికి 'ఉండిపోరాదే' అని టైటిల్‌ను ఖరారు చేశాం. సంక్రాంతి సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశాం. సినిమా రెండో షెడ్యూల్‌ను ఈనెల 28 నుండి ప్రారంభించి బెంగుళూర్, మైసూర్, కరీంనగర్, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఏకధాటిగా షూటింగ్ చేస్తాం''అని అన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్ః శ్రీను విన్నకోట, సంగీతంః సాబు వర్గీస్, పాటలుః సుద్దాల అశోక్ తేజ్, చంద్రబోస్, రామాంజనేయులు, కొరియోగ్రాఫర్ః నరేష్ ఆనంద్.



పింకీ రెడ్డి, మీనా, నగ్మా, టి.సుబ్బరామిరెడ్డి తదితరులు

ఫిబ్రవరి 17న టిఎస్ఆర్ ఫిల్మ్ అవార్డుల ప్రదానం

టిఎస్ఆర్‌టివి 9 నేషనల్ ఫిల్మ్ అవార్డుల వేడుకకు విశాఖపట్నం మరోసారి వేదిక కాబోతోంది. 2010 నుండి రెండేళ్లకు ఒకసారి కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి ఈ అవార్డులను జాతీయ స్థాయిలో అందిస్తున్నారు. ఫిబ్రవరి 17వ తేదీన విశాఖపట్నం పోర్ట్‌గ్రౌండ్‌లో 2017, 18 సంవత్సరాలకుగాను ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు టి.సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో జ్యూరీ ఛైర్మన్ సుబ్బరామిరెడ్డితో పాటు సభ్యులు డా.శోభనా కామినేని, పింకీ రెడ్డి, నగ్మా, మీనా, పరుచూరి గోపాలకృష్ణ, నరేశ్, కె.ఎస్.రామారావు పాల్గొన్నారు. వీరితో పాటుగా జీవిత, కె.రఘురామ కృష్ణంరాజు సైతం జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సమావేశంలో టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ ''2010లో మొదలుపెట్టిన ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం ఆనందంగా ఉంది. ఈసారి శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్‌కు అందజేయనున్నాం. ఈ వేడుకలో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, రజనీకాంత్, సూర్య, విక్రమ్ తదితరులు హాజరవుతారు''అని అన్నారు. పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ ''నెల్లూరులో పుట్టిన సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్, విశాఖపట్నంతో విడదీయరాని అనుబంధం ఉంది. ఆయన ఆరాధించే శివుడి ఆజ్ఞతోనే ఈ కళాసేవ అపూర్వంగా సాగుతోంది''అని చెప్పారు. మీనా మాట్లాడుతూ ''గతంలో తాను 'దృశ్యం' చిత్రానికిగాను ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నాను. ఇప్పుడు జ్యూరీలో ఉండటం ఆనందంగా ఉంది''అని పేర్కొన్నారు. తెలుగు చిత్రసీమకు చెందిన అనేక మంది జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి టి.సుబ్బరామిరెడ్డి కారకులని కె.యస్.రామారావు అన్నారు.

మురిపిస్తున్న ఊర్వశి



ఇంద్రలోక అందాల భామలు రంభ, ఊర్వశి, మేనక గురించి వినని వారుండరు. అయితే ఈ అందాలన్నీ కలగలిసి ఈ భూమి మీదకొచ్చాయా అన్నట్లుండే అందం ఊర్వశి రౌతేలాది. ఈ ముద్దుగుమ్మ తన అందచందాలు, గ్లామర్‌తో యూత్‌ను మైమరపిస్తోంది. బాలీవుడ్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఈ భామ సినిమాల్లో హాట్ హాట్‌గా దర్శనమిస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది. ఇక 'సింగ్ సాబ్ ది గ్రేట్' సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఊర్వశి రౌతేలా. ఆతర్వాత 'హేట్ స్టోరీ 4' చిత్రంతో బాలీవుడ్ ప్రేక్షకులను ఫిదా చేసింది. ప్రస్తుతం ఓ బాలీవుడ్ మూవీలో నటిస్తోంది. మరోవైపు సోషల్ మీడియాలో హాట్ హాట్ పిక్స్‌తో రెచ్చిపోవడం ఈ ముద్దుగుమ్మ హాబీల్లో ఒకటి. ఆ క్రమంలోనే తాజాగా ఊర్వశి పోస్ట్ చేసిన ఓ ఫొటో ఇప్పుడు వైరల్ అవుతోంది. వైట్ అండ్ వైట్ నైట్ డ్రెస్సులో క్లీవేజ్ సోయగాలతో మురిపిస్తోంది ఈ బ్యూటీ. తన అందచందాలతో కుర్రకారును మైమరపిస్తోంది.

ఊర్వశి రౌతేలా

చంద్రబాబునాయుడు లక్ష్మీపార్వతిల ఫస్ట్‌లుక్



శ్రీతేజ్, యజ్ఞ శెట్టి

దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ క్యాస్టింగ్ ఎలా ఉంటుందో అందరికీ తెలిసిందే. ఆయన తెరకెక్కించే సినిమాలపై ప్రేక్షకుల్లో భిన్నాభిప్రాయాలు ఉండొచ్చు కానీ ఆయన నిజ జీవిత పాత్రలకు నటీనటులను ఎంపిక చేసుకునే తీరు అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుంది. వర్మ ప్రస్తుతం 'లక్ష్మీస్ ఎన్టీఆర్' చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో లక్ష్మీపార్వతి, చంద్రబాబు నాయుడు పాత్రలను పోషించే నటీనటుల ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. 'కిల్లింగ్ వీరప్పన్' సినిమాలో నటించిన కన్నడ నటి యజ్ఞ శెట్టిని లక్ష్మీపార్వతి పాత్రకు, నటుడు శ్రీతేజ్‌ను చంద్రబాబు నాయుడి పాత్రకు ఎంచుకున్నారు రామ్‌గోపాల్ వర్మ. యజ్ఞశెట్టి, శ్రీతేజ్‌లు లక్ష్మీపార్వతి, చంద్రబాబు నాయుడు గెటప్‌లలో ఉన్న ఫొటోలను తన ట్విట్టర్ ఖాతా ద్వారా షేర్ చేసి... ఈ పాత్రలు సినిమాలో చాలా ముఖ్యమైనవి అని వర్మ చెప్పారు. ముఖ్యంగా చంద్రబాబు పాత్రధారి శ్రీతేజ్ ఫొటోలను నాలుగు, ఐదు పోస్ట్ చేసి వెరీ వెరీ ఇంపార్టెంట్ రోల్ అని... ఆయన కళ్లలో ఏదో ఉందని... తనదైన స్టైల్‌లో కామెంట్ పెట్టారు. నటుడు శ్రీతేజ్ గురించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈమధ్యే 'యన్.టి.ఆర్‌కథానాయకుడు' సినిమాలో ఆయన వై.ఎస్.రాజశేఖర రెడ్డి పాత్రలో నటించారు. ఇద్దరు భిన్న ధృవాల లాంటి రాజకీయ నాయకుల పాత్రలను ఇంత తక్కువ గ్యాప్‌లో పోషించే అవకాశం చాలా తక్కువ మంది నటులకు మాత్రమే దొరుకుతుంది. అయితే వైఎస్‌ను చంద్రబాబు నాయుడిగా మార్చడమనేది వర్మ తప్ప మరెవ్వరూ చేయలేరు. మరి యజ్ఞ శెట్టి, శ్రీతేజ్‌లు ప్రేక్షకులను ఎలా మెప్పిస్తారో చూడాలి

పోటీ

ఎస్ లక్ష్మీనారాయణ
డైరెక్టర్, రామయ్య
కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్
దిల్‌సుఖ్ నగర్, హైదరాబాద్,
8885555202

రాజ్య సంక్రమణ సిద్ధాంతాన్ని రద్దు చేసిందెప్పుడు?



హైదరాబాద్ రాష్ట్రంలో 1857 తిరుగుబాటు ప్రభావం

- 1857 సిపాయిల తిరుగుబాటు ప్రారంభమైన ఏడవ రోజున మరణించిన నిజాం – నాసిరుద్దౌలా కాగా బ్రిటీష్‌కు మద్ధతిచ్చి స్టార్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన నిజాం – అఫ్జల్‌ఉద్దౌలా.
- ఫకీర్ మౌల్వీ ఇబ్రహీం ప్రజలలో ఆత్మస్థైర్యం నింపడానికి ప్రయత్నించి నిజాం మందలింపుతో అజ్ఞాతంలోకి వెళ్లాడు.
- మౌల్వీ అబ్దుల్లా ఆంగ్లేయులపై మక్కా మసీదులో జీహాద్‌ను ప్రకటించాడు.
- 1857 జులై 17న హైడెన్ తిరుగుబాటు చేసినది. మీర్ తురేబాజ్‌ఖాన్ ఇతడు హైదరాబాద్ బ్రిటీష్ రెసిడెంట్‌లో బంధీగా ఉన్న చిదాఖాన్‌ను విడిపించుటకై రెసిడెంట్‌పై దాడి చేయగా డేవిడ్‌సన్ అణచివేశాడు.
- తురేబాజ్‌ఖాన్‌ను తుఫ్రాన్ (మెదక్) వద్ద ఎన్‌కౌంటర్ చేసి అతని శవాన్ని గొలుసులతో కట్టి కోటలో బహిరంగా ప్రదేశంర్ల వేలాడదీశాడు.
- బెంగళూరు పారిపోతున్న మౌల్వీ అల్లాఉద్దీన్‌ను మంగళంపల్లి వద్ద బంధించి అండమాన్ జైలుకు పంపగా అక్కడే 1884లో మరణించాడు.
- డేవిడ్‌సన్‌పై హత్యాయత్నం చేసినవారు – జహంగీర్‌ఖాన్.
- కెప్టెన్ అబ్బెట్‌ను కాల్చి చంపడానికి ప్రయత్నించిన వారు – డఫేదార్ మీర్ ఫిదా అలీపై తిరుగుబాట్లే కాక బ్రిటీష్ వారిక వ్యతిరేఖంగా 1860లో అనేక ప్రాంతాల్లో తిరుగుబాట్లు జరిగాయి.
- షొరాపూర్ – రాజా వెంకటప్పయ్య నాయక్, దశావర్ జిల్లాలోని మందర్గి – జమిందార్ బీంరావ్‌నందగౌడ్, అదిలాబాద్‌లోని నిర్మల్ – రాంజీ గోండు. అజంతా – బాగోసీ నాయక్ (బిల్లులు) నిజామాబాద్ – దీప్ సింగ్, కోవ్వల్‌రాజు – సఫ్తర్ ఉద్దౌలా మొర్తాండ్ జమీందార్– రుక్మారెడ్డి మొదలగు వారిని ఆంగ్లేయులు, మొదటి సాలార్‌జంగ్‌లు అణచివేశారు.

తిరుగుబాటు వైఫల్యానికి కారణాలు

- నాయకత్వ సమన్వయ లోపం ప్రధాన కారణం.
- మేధావి వర్గం, అన్నివర్గాల వారు కలిసి పాల్గొనకపోవడం.
- బ్రేక్ వాటర్స్, కొందరు భారతీయులు బ్రిటీష్ వారికి మద్ధతు పలకడం, దీనితో కానింగ్ 1857 తిరుగుబాటు అనే వరదకు భారతరాజులు ఆనకట్టగా పనిచేశారు. అని వర్ణించాడు.
- సిపాయిలు సంప్రదాయ ఆయుధాలను ఉపయోగించగా, సోల్జర్స్ ఆధునిక ఆయుధాలను ఉపయోగించారు.
- సమచార వ్యవస్థ లోపం తిరుగుబాటుదారులలో జాతీయభావం లోపించడం.
- గుర్ఖాలు, సిక్కులు బ్రిటీష్ వారికి మద్ధతు ఇవ్వడం.
- క్రమశిక్షణ కలిగిన బ్రిటీష్ సైన్యం.

తిరుగుబాటు ఫలితాలు

- బ్రిటీష్ ఈస్టిండియా కంపెనీ పాలన రద్దు చేయబడింది. దీనిస్థానంలో 1858 విక్టోరియా మహారాణి చట్టం ప్రకారం బ్రిటీష్ ప్రభుత్వం ప్రత్యక్ష పాలన ప్రారంభమైంది.
- భారతదేశం బ్రిటీష్ రాజ్యంలో ఒక భాగం అని కానింగ్ అలహాబాద్ దర్బార్ నుండి ప్రకటించాడు.
- 1858 చట్టం ప్రకారం గవర్నర్ జనరల్, వైస్రాయ్, భారతరాజ్య కార్యదర్శి నియమించబడ్డారు.
- భారతదేశం తొలి వైస్రాయ్ – కానింగ్ కాగా తొలి రాజ్యకార్యదర్శి – చార్లెస్ ఉడ్.
- బ్రిటీష్ సైన్యం పునఃవ్యవస్థీకరించబడి వ్యూహాత్మక ప్రాంతాలలో ఆంగ్లేయులకు ప్రాధాన్యత ఇచ్చారు.
- 1859లో రాజ్య సంక్రమణ సిద్ధాంతను రద్దు చేశారు.
- భారతీయుల సాంఘీక, సాంస్కృతిక, మత విషయాలలో ఆంగ్లేయుల జోక్యాన్ని నివారించడం.
- విభజించు – పాలించు అనే నూతన విధానం ప్రవేశపెట్టడం.

1857 తిరుగుబాటుపై ప్రముఖుల అభిప్రాయాలు

- భారతదేశ ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం – కారల్‌మార్క్స్.
- ఆర్.సి. మంజుందార్ – ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం కాదని వర్ణించాడు.
- సిపాయిల తిరుగుబాటు అని తొలిసారిగా జాన్‌హెన్రీలారెన్స్, మార్స్‌మన్‌లు వర్ణించారు.
- జాతీయ తిరుగుబాటు – నెహ్రూ, బెంజిమన్ డిస్రౌలి.
- ముస్లింల తిరుగుబాటు – రాబర్ట్స్, కూప్లాండ్.
- హిందూ, ముస్లింల తిరుగుబాటు – కాయే, మాలీసన్,
- ఇది కేవలం భూస్వాముల తిరుగుబాటు – నెహ్రూ. అనాగరికులు – నాగరికులకు వ్యతిరేకంగా చేసిన యుద్ధం – హోమ్స్.
- నల్లజాతి వారు – తెల్లజాతి వారికివ్యతిరేఖంగా చేసిన యుద్ధం – కాయే, మిడ్లి.
- ఇది సైనిక, పౌర తిరుగుబాట్ల కలయిక – ఎస్.బి. చౌదరి.
- సాంప్రదాయ శక్తులు, క్రిస్టియానిటికి వ్యతిరేఖంగా చేసిన యుద్ధం – రీస్.
- అందరి తిరుగుబాటు – చార్లెస్ బాల్.
- అన్ని వర్గాల తిరుగుబాటు – ఫోన్‌విల్లే.

తిరుగుబాటుపై గ్రంథాలు

- The causes of indian mutiny – సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్.
- The indian war of independence 1857 – వి.డి. సావార్కర్
- The history of sepoy war in india – కాయే.
- History of indian mutiny – టి.ఆర్. హోల్మ్స్.
- indian mutiny of 1857 – మాలీసన్
- Reballion, 1857 : A symposium – పీ.సీ. జోషి
- Civil rebellion in indian mutinies ఎస్.బి. చౌదరి
- 1857 – ఎస్.ఎన్. సెన్.
- The sopoy revolt, its causes and its consequence – హెచ్. మీడ్
- British paramountancy and indian renaissance – ఆర్.సి. మజుందార్.

19వ శతాబ్దంనాటి సామాజిక, సాంస్కృతిక జాగృతి

- 19వ శతాబ్ద ఆరంభంలో భారతదేశంలో అనేక మూఢ విశ్వాసాలు ఉండేవి.

దురాచారాలు

ఎ) సతీ ఆచారం,	బి) కులవ్యవస్థ జటిలత్వం
సి) బాల్య వివాహాలు,	డి) వరకట్న దుస్థితి
ఇ) బానిస వ్యవస్థ	ఎఫ్) దేవదాసీ
జి) పరదా పద్ధతి	హెచ్) రాజపుత్రులు ఆడపిల్లల్ని పుట్టగానే చంపడం
(బృణహత్యలు)	

మతపరమైన అంశాలు

- బహుదేవతారాధన, విగ్రహపూజ, వంశపారంపర్య పౌరోహిత్యం, కర్మకాండలు, బలలు
- మూఢవిశ్వాసాలకు, దురాచారాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి చేసిన ఉద్యమాలను 'సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాలు' అంటారు.
- భారతదేశంలో మొదటిసారిగా సాంఘిక, సాంస్కృతిక ఉద్యమాలు బెంగాల్‌లో ప్రారంభించిన వారు – రాజా రామ్మోహన్ రాయ్.

రాజా రామ్మోహన్ రాయ్)1772–1833)

- 1772, మే 22 రాధానగరంలో రమాకాంతరాయ్, తరుణీదేవి అనే దంపతులకు జన్మించాడు.
- రామ్మోహన్ రాయ్ డిగ్బీ అనే జిల్లా మెజిస్ట్రేట్ వద్ద దివాన్‌గా పనిచేసి 1814లో ఉద్యోగంను మానుకున్నారు.
- ఇతడు కాశీలో వేదాలను, పాట్నాలో ఖురాన్‌ను, టిబెట్‌లో బౌద్ధాన్ని, హిబ్రూభాషను నేర్చుకొని జుడాయిజం, బైబిల్‌లను అధ్యాయనం చేశాడు.

బిరుదులు

- రాజా –రెండవ అక్బర్ ఇచ్చాడు.
- రామ్ రాయ్ – వంశపారంపర్యంగా వచ్చింది.
- భారతదేశ సాంస్కృతిక పునరుజ్జీవన పితామహుడు
- ఆధునిక భారతదేశ పితామహుడు
- పయొనీర్ ఆఫ్ న్యూ ఇండియా.
- Father of Bengal & Indian Renaissance
- Maker of New India.
- నవయుగ వైతాళికుడు
- ప్రవక్త
- యుగకర్త

పత్రికలు

- సంవాద కౌముది (బెంగాల్ వారపత్రిక) – 1821 – భారతదేశంలో భారతీయుడు స్థాపించిన తొలి పత్రిక. ఇది 'సతి'కి వ్యతిరేకంగా ఏర్పాటు చేశారు. విగ్రహారాధనకు సంబంధించిన సుబ్రహ్మణ్య శాస్త్రిని ఓడించినది. భారత్‌లో తొలిపత్రిక –1780 బెంగాల్ గెజిట్ – జేమ్స్‌హిక్కి – ఆంగ్లం.
- మిరాత్ ఉల్ అక్బర్ (పర్షియా)–1832 –భారత్‌లో తొలి పర్షియన్ పత్రిక.
- బంగదూత – బెంగాల్, పర్షియా, హిందీ, ఇంగ్లీష్.
- బ్రహ్మణ్ సేవధి – బెంగాల్ – క్రైస్తవ మతంలోని లోపాలు ఎత్తిచూపుట.

సంస్థలు

- ఆత్మీయసభ (ఫ్రెండ్లీ అసోసియేషన్) – 1815 – కలకత్తా
- బ్రహ్మసమాజం (అర్థం – సొసైటీ ఆఫ్ గాడ్) – 1828 ఆగస్టు 20 – కలకత్తా
- ఆత్మీయ సభనే కాలక్రమంలో 1828 ప్రారంభంలో బ్రహ్మసభగా ఆ తర్వాత బ్రహ్మ సమాజంగా మారింది. బహుభార్యాత్వం ఖండించాడు.

బ్రహ్మసమాజం ప్రధాన సిద్ధాంతాలు

1) ఏకేశ్వరోపాసన 2) విగ్రహారాధనను ఖండించడం 3) బహుభార్యాతత్వం ఖండించాడు
4) బాల్యవివాహాల నిరాకరణ 5) ఆస్తి హక్కులను స్త్రీలకు కల్పించడం

- దీని తొలి కార్యదర్శి – తారాచంద చక్రవర్తి.
- ప్రతి శనివారం సమావేశమయ్యేది
- ఈ సమావేశాలను నిర్వహించినది – రామచంద్ర విద్యావాగీష్.
- తన విదేశీ స్నేహితులైన – అలెగ్జాండర్ డఫ్ (స్కాటిష్ మిసినరీ సభ్యుడు / డేవిడ్ హ్యూరే (డచ్ వాచీ తయారీదారుడు)లను ప్రోత్సహించి బెంగాల్‌లో అనేక పాఠశాలలను స్థాపించాడు.
- 1817 – హిందూ కళాశాల – 1825 – వేదాంత కళాశాల
- భారతదేశంలో ప్రాశ్చాత్య భావాలను పెంపొందించాడు.
- వేదాలు, ఉపనిషత్తులు ''ఏకేశ్వరోపాసన''ను గురించి మాత్రమే పేర్కొంటున్నాయని కొన్ని శ్లోకాలను బెంగాలీలోకి అనువదించి తన ''సంవాదకౌముది'' పత్రికలో ప్రచురించాడు.
- 1829 డిసెంబర్ 4 విలియం బెంటింక్ సహకారంతో ''సతీసహగమనం'' Regulation of XVIII రద్దు చేయించాడు.
- 1829లో రాధాకాంతదేవ్ – ధర్మసభను బ్రహ్మ సమాజానికి వ్యతిరేకంగా స్థాపించాడు.



ఉడుకెత్తుతున్న సముద్రాలు

మనం ఊహించిన దానికన్నా సముద్రాలు వేగంగా వేడెక్కుతున్నాయి. వాతావరణంలో మార్పుకు సముద్రాలు వేడెక్కడం చాలా దోహదం చేస్తుంది. ఫలితంగా భూతాపం సముద్రాల్లోని జీవ వైవిధ్యాన్ని దెబ్బతీస్తుంది. సముద్ర మత్యసంపదే ప్రపంచంలో ప్రధాన ఆహార వనరని పరిశోధకులు వెల్లడించారు. ఈ అధ్యయన వివరాలు అమెరికా జర్నల్ సైన్సులో ప్రచురించడమైంది. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ అధ్యయనానికి నాయకత్వం వహించింది. ఇటీవల కాలంలో భూతాపం మందగించిందని గత అధ్యయనాలు వెల్లడించిన వివరాలను ఈ అధ్యయనం నమ్మదగినవి కావని తోసిపుచ్చింది. హరిత వాయువుల కారణంగా 93శాతం అత్యధికంగా భూతాపం పెరుగుతోంది. శిలాజ ఇంధనాలు మండించడం వల్లనే ఈ హరిత వాయువులు ఏర్పడుతున్నాయి. అదంతా సముద్రాల్లో పేరుకుపోతున్నాయి. నాలుగు అధ్యయనాల ఆధారంగా తాజా నివేదిక 2014 –2017 మధ్యకాలంలో ప్రచురించారు. గత కాల పరిణామాల్లో సముద్రాల వేడి ఎలా ఉండేదో కచ్చితంగా ఆ నివేదికలో వివరించారు. దీని ఆధారంగా భవిష్యత్తులో అంచనాలు ఎలా ఉంటాయో కచ్చితంగా తెలుసుకోడానికి శాస్త్రవేత్తలకు అవకాశం ఏర్పడింది. చాలా కచ్చితంగా గణాంకాలు సేకరించడానికి కీలకాంశం సముద్ర మదింపు సేన చర్యలే. ఈ సేనను ఆర్గో అని వ్యవహరిస్తున్నారు. ఈ సేనలో 4000 తేలే రోబోలు పనిచేస్తున్నాయి. ఇవి ప్రపంచం లోని సముద్రాలన్నిటి లోనూ కొట్టుకుపోయి సముద్రాల వేడిని పడిగట్ట గలిగాయి. సముద్రం అడుగున 2000 మీటర్ల లోతులోకి వెళ్లి సముద్ర ఉష్ణోగ్రతలను కొలవ గలిగాయి. ఉప్పు సాంద్రత, ఇతర రసాయనాల సాంద్రతను కూడా అంచనా వేయ గలిగాయి. మిగతా సమాచారాన్ని కూడా సేకరించి బయటకు తిరిగి వచ్చాయి. 2000 సంవత్సరం నుంచి సముద్రాల వేడి ఎలా ఉందో సమగ్ర సమాచారాన్ని సేకరించాయి. ఇప్పుడు ఈ కొత్త విశ్లేషణ సముద్రాల్లో వేడి పెరుగుతోందని దానివల్ల గాలిలో ఉష్ణోగ్రత పెరుగుతోందని వెల్లడించింది. హరిత వాయువులు తగ్గించకపోతే సముద్రాల్లోని 2000 మీటర్ల లోతులోనే ఉష్ణోగ్రత ఈ శతాబ్దాంతానికి 0.78 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగిపోతుందని నివేదిక హెచ్చరించింది. సముద్రాల్లో ఉష్ణవ్యాకోచం వల్ల నీరు పొంగి సముద్ర మట్టం 30 సెంటీమీటర్ల వరకు పెరిగిపోతుందని, అంతకన్నా హిమనీనదాలు, మంచు ఫలకాలు కరిగి మరింతగా సముద్ర మట్టాలు పెరిగి పోతాయని నివేదిక వెల్లడించింది. రికార్డు ప్రకారం ఉపరితలానికి సంబంధించి 2018 అత్యంత నాలుగో ఉష్ణ సంవత్సరంగా నమోదు కాగా, సముద్రాల వేడికి సంబంధించి కూడా అత్యంత ఉష్ణసంవత్సరం కాగలదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇంతకు ముందు 2017,2016 సంవత్సరాల్లో కూడా ఇలాగే జరిగింది. ఉపరితలంపై కన్నా సముద్రాల్లో వచ్చే మార్పుల వల్ల భూతాపం సంకేతాలు సులువుగా తెలుస్తాయని పరిశోధకులు వివరాంచారు.

– సైన్స్ విభాగం

కృష్ణబిలం పుట్టుకను కనుగొన్న నాసా టెలిస్కోప్



వాషింగ్టన్: అంతర్జాతీయ వ్యోమగాముల కూటమి నాసా టెలిస్కోప్‌లను ఉపయోగించి నక్షత్రం నశించడాన్ని తిరిగి అది ఒక వస్తువుగా రూపొందడాన్ని చిత్రీకరించ గలిగింది. ఈ దృశ్యాన్ని బట్టి ఇది కృష్ణబిలమా లేదా న్యూట్రాన్ నక్షత్రమా అన్న చర్చ సాగుతోంది. హవాయిలోని నాసా ఆస్టరాయిడ్ టెరెస్ట్రెయల్ ఇంపాక్టు లాస్ట్ ఎలెర్టు సిస్టమ్ టెలిస్కోప్ 2018 జూన్ 16న రాత్రి పూట ఆకాసంలో అసాధారణ స్వల్ప సంఘటనను చిత్రీకరించిందని అమెరికా స్పేస్ ఏజెన్సీ వెల్లడించింది. ఈ దివ్యమైన సంఘటన ఎటి 2018 కౌ లేదా ది కౌ అని మారుపేరుతో వ్యవహరించడమవుతోంది. నక్షత్ర ఆవిర్భావ పాలపుంతలో లేదా సమీపాన ఇది జరిగింది. ఈ పాలపుంతను సిజిసిజి 137–068 గా పిలుస్తారు. హెర్క్యులెస్ నక్షత్ర మండలానికి 200మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఈ పాలపుంత ఉంది. మూడు రోజుల పాటు అకస్మాత్తుగా కాంతి ప్రజ్వరిల్లడంతో కౌ ఆవిర్భవించింది. ఈ కాంతి కీలకమైన సూపర్‌నోవా కన్నా పది రెట్లు కాంతివంతంగా ఉంటుంది. మరికొన్ని నెలలకు ఇది కాంతిని కోల్పోయిందని నాసా వెల్లడించింది. కొత్తగా ఏర్పడిన వస్తువు చుట్టూ నక్షత్ర వ్యర్థాలు చుట్టూ పరిభ్రమించి చెప్పుకోదగిన కాంతిని పుట్టించాయి. నెయిల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ , న్యూక్లియర్ స్పెక్ట్రోస్కోపిక్ టెలిస్కోప్ ఎరే తోపాటు అనేక నాసా మిషన్ల డేటా ఉపయోగించి శాస్త్రవేత్తలు ఆ కౌ రాకాసి కృష్ణబిలంగా భావించారు. కృష్ణబిలం ఆవిర్భావంలో పీలికలైన తెల్లని మరుగుజ్జు నక్షత్రం చాలా వేడైన భూమంత నక్షత్ర శకలంగా నక్షత్ర తుది దశగా పేర్కొంటున్నారు. తక్కువ కాలంలో కౌ భారీ ఎత్తున మబ్బుల వ్యర్థాలను ఉత్పత్తి చేసిందని ఆస్ట్రో ఫిజిసిస్టు పాల్ కుయిన్ చెప్పారు. యూనివర్శిటీ కాలేజి లండన్‌లో ఆయన ఆస్ట్రోఫిజిసిస్టుగా పనిచేస్తున్నారు. మబ్బులాంటి దాన్ని ఉత్పత్తి చేయడానికి భారీ నక్షత్రాన్ని చెల్లాచెదురు చేయడంతో భారీ కృష్ణబిలం ఆవిర్భవించడానికి దారి తీసిందని మాంద్యంగా ఉన్న కాంతి అత్యంత ప్రకాశవంతంగా తయారైందని వ్యర్థాలను జీర్ణించడానికి చాలా కాలం పడుతుందని నాసా పేర్కొం ది. ఇది కృష్ణబిలం కాదు సూపర్‌నోవాగా మరో శాస్త్రవేత్తల బృందం వాదిస్తోంది. కౌ ఏర్పడడానికి నక్షత్ర విస్ఫోటనమే కారణమని చెబుతోంది.

– సైన్స్ విభాగం

సర్వైకల్ క్యాన్సర్‌ను మొదట్లోనే కనుక్కునే ఎఐ



సర్వైకల్ క్యాన్సర్(గర్భశయ ముఖద్వారా క్యాన్సర్) ప్రారంభ దశను కచ్చితంగా కనుక్కునే కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ను శాస్త్రవేత్తలు రూపొందించారు. ఈ కృత్రిమ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆటోమేటెడ్ విజువల్ ఇవాల్యుయేషన్ అని పిలుస్తున్నారు. ఇది క్యాన్సర్ సోకే అవకాశం ఉన్న కణాలను ముందుగానే 91శాతం కచ్చితంగా కనుక్కోగలుగుతుంది. సాధారణంగా వైద్యనిపుణులు 69 శాతం వరకు ముందుగా ఈ క్యాన్సర్ కారక కణాలను కనుక్కోగలుగుతుండగా, సంప్రదాయ వైద్య పద్ధతులు, పాప్స్‌మియిర్ వంటి లేబొరేటరీ పరీక్షల వల్ల 71 శాతం వరకు ఈ క్యాన్సర్ లక్షణాలను ముందుగా కనుక్కోగలుగుతున్నారు. ఈ నేపథ్యంలో కృత్రిమ మేథో పరిజ్ఞానంతో 91 శాతం కచ్చితంగా కనుక్కోగలగడం ఎంతో ప్రయోజనం భవిష్యత్తులో చేకూరనుంది. 25 నుంచి 49 సంవత్సరాల మధ్య మహిళల్లో కెర్వికల్ క్యాన్సర్ రిస్కు ఎక్కువగా కనిపిస్తోంది. కృత్రిమ మేథో పరిజ్ఞానం ఈ కేసుల్లో 97.7 శాతం వరకు ముందుగా క్యాన్సర్ కారక కణాలను కచ్చితంగా గుర్తించ గలుగుతోంది. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో ఈ టెక్నాలజీని అందుబాటు లోకి తేవాలన్న లక్ష్యంతో పరిశోధకులు ఉన్నారు. ప్రపంచం మొత్తం మీద ఈ క్యాన్సర్ రోగులను వైద్య పరీక్షల కోసం నమోదు చేసుకుంటారు. తక్కువ ఖర్చుతో ఈ వైద్య చికిత్సను మహిళలకు అందించాలన్న సంకల్పంతో ఉన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యయనం ప్రకారం కెర్వికల్ క్యాన్సర్ అన్నది ప్రపంచం మొత్తం మీద నాలుగో స్థానంలో ఉంది. 2018 లో ప్రపంచం మొత్తం మీద కొత్తగా 5,70,000 కేసులు నమోదయ్యాయి. స్క్రీనింగ్, వ్యాక్సినేషన్‌ల్లో అత్యంత ఆధునిక విధానాలు వచ్చినా ఈ క్యాన్సర్‌కు దారితీసే పాపిలోమా వైరస్‌ను అదుపు చేయగలిగినా ఆ ప్రయోజనాలన్నీ ధనిక మహిళలకే అందుబాటులో ఉంటున్నాయి తప్ప స్వల్పాదాయ పేద వర్గాలకు సాధ్యం కావడం లేదు. 2012 లో ప్రపంచంలో కెర్వికల్ క్యాన్సర్‌తో దాదాపు 2,66,000 మంది మహిళలు మృతిచెందడం గమనార్హం.

పీచువంటి ఆహార పదార్థాలతో వ్యాధులు దూరం



పీచు లేదా నార ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకుంటే వ్యాధులు దూ రం అవుతాయని అధ్యయనంలో వెల్లడైంది. ది లాన్సెట్‌లో ప్రచురించిన ఈ అధ్యయనంలో 40 ఏళ్ల పాటు అధ్యయనం, వైద్య ప్రయోగాలు చేసిన తరువాత ఈ వివరాలను వెల్లడించారు. రోజూ కనీసం 25 నుంచి 29 గ్రాములు లేదా అంతకన్నా ఎక్కువ మొత్తంలో నార లేదా పీచుపదార్థం కలిగిన ఆహారం తీసుకోవాలని దానివల్ల ఆరోగ్య ప్రయోజనాలు సమకూరుతాయని అధ్యయనంలో వెల్లడైంది. యూనివర్శిటీ ఆఫ్ ఒటాగో పరిశోధకు లు ఈ అధ్యయనం నిర్వహించారు.

– సైన్స్ విభాగం

ఎస్‌పి, బిఎస్‌పి కూటమిని స్వాగతించిన మమత



కోల్‌కతా: రానున్న లోక్‌సభ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి–బిఎస్‌పి కూటమి ఏర్పడడాని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వాగతించారు. ఈ కూటమిని తాను ఆహ్వానిస్తున్నట్లు శనివారం ఆమె ట్వీట్ చేశారు. తన ప్రధాన శత్రువు బిజెపికివ్యతిరేకంగా కూటమిని ఏర్పాటు చేసేందుకు తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏడాదిగా దేశంలో పర్యటిస్తున్నారు. ఉత్తర భారతంలో కీలకమైన యుపిలో ఎస్‌పి–బిఎస్‌పి కూటమిగా ఏర్పడితే బిజెపి తుడిచి పెట్టుకు పోతుందని గతంలో బెనర్జీ సూచించారు. రాష్ట్రంలో 80 లోక్‌సభ సీట్లకు గానూ చెరో 38 స్థానాల్లో పోటీ చేసేందుకు ఎస్‌పి–బిఎస్‌పిలు శనివారం కూటమిగా ఏర్పడ్డాయి. అయితే అమేథీ, రాయ బరేలీలో తమ అభ్యర్థులు పోటీ చేయబోరని ఈ పార్టీలు తెలిపాయి.

చిట్‌ఫండ్ కేసులో చిదంబరం భార్యకు ఊరట

అరెస్ట్ చేయవద్దని సిబిఐకి మద్రాస్ హైకోర్టు ఆదేశం




చెన్నై: మాజీ ఆర్థికమంత్రి పి. చిదంబరం సతీమణి నళినికి మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తాత్కాలిక ఉత్తర్వుతో సిబిఐ నుంచి తాత్కాలిక రక్షణ లభించింది. శారదా చిట్ ఫండ్ కేసులో ఆమెకు పశ్చిమ బెంగాల్‌లో జ్యూరిస్‌డిక్షనల్ కోర్టు నుంచి రెగ్యులర్ యాంటిసిపేటరీ బెయిల్ లభించేవరకూ నళినిని సిబిఐ అరెస్ట్ చేయకూడదని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వు జారీ చేసింది. నళిని చిదంబరం దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌పై విచారణకు మద్రాస్ హైకోర్టు ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా జస్టిస్ జికె ఇల్లంథిరైయన్ తాత్కాలిక ఉత్తర్వును జారీ చేశారు. నళినికి జడ్జి నాలుగు వారాల తాత్కాలిక బెయిల్ మంజూరు చేశారు. ఎగ్మోర్ చీఫ్ జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ ఎదుట హాజరై, పూచీకత్తును సమర్పించాలని, ఆ తర్వాత పశ్చిమ బెంగాల్ జ్యూరిస్‌డిక్షనల్ కోర్టులో హాజరై రెగ్యులర్ యాంటిసిపేటరీ బెయిల్ పొందాలని జడ్జి ఆదేశించారు. ఇలా ఉండగా, నళిని దాఖలు చేసిన పిటిషన్‌ను స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) జి. హేమ తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కేసు హైకోర్టు పరిధిలోకి రాదు కనుక నళిని పిటిషన్‌ను కోర్టు స్వీకరించకూడదని ఆమె వాదించారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఒక ఇసిఐఆర్ (ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్‌ఫర్మేషన్ రిపోర్టు)ను రిజిస్టర్ చేసింది.

ఆప్ నాయకురాలు మీరా సన్యాల్ కన్నుమూత

ముంబయి: బ్యాంకింగ్ రంగం నుంచి రాజకీయ ప్రవేశం చేసిన మీరా సన్యాల్(57) శుక్రవారం అనారోగ్యంతో మరణించారు. రాయల్ బ్యాంక్ ఆఫ్ స్కాట్లాండ్ భారతదేశ చైరపర్సన్ ఉద్యోగాన్ని వదిలేసి ఆమ్ ఆద్మీ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన మీరా సన్యాల్ 2014లో లోక్‌సభ ఎన్నికల్లో ముంబయి సౌత్ నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆమె మరణ వార్తను ఆప్ నాయకుడు, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా ధ్రువీకరించారు. భారతదేశం ఒక గొప్ప తెలివైన ఆర్థికవేత్తను, ఒక మంచి మనసు గల వ్యక్తిని కోల్పోయిందని ఆయన ఒక ట్వీట్ ద్వారా నివాళి అర్పించారు. మీరు ఎన్నటికీ మా మనసుల్లో నిలచి ఉంటారు అని సిసోడియా పేర్కొన్నారు. ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కూడా సన్యాల్ మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. 30 సంవత్సరాల పాటు బ్యాంకింగ్ రంగంలో వివిధ హోదాలలో పనిచేసిన సన్యాల్ ఎబిఎన్ ఆమ్రో బ్యాంకు ఆసియా విభాగానికి కార్పొరేట్ ఫైనాన్స్ చీఫ్‌గా, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు.


24కిలోల బంగారం పట్టివేత



చెన్నై: అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారాన్ని పట్టుకున్నారు. ఇద్దరు ప్రయాణికులు అక్రమంగా తరలిస్తున్న 24 కిలోల బంగారాన్ని గుర్తించి విమానాశ్రయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని ఖరీదు రూ.8 కోట్ల వరకూ ఉంటుందని తెలిపారు. ఎయిర్ ఇంటెలిజెన్స్ విభాగానికి (ఎఐయు) చెందిన కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేపట్టి భారీ మొత్తంలో బంగారాన్ని సీజ్ చేశారు. బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను దక్షిణ కొరియాకు చెందిన వారిగా గుర్తించారు. వీరు హాంకాంగ్ నుంచి చెన్నైకు వచ్చారు. ఈ బంగారాన్ని ఎక్కడి నుంచి తెచ్చారు? ఏ ప్రాంతానికి తరలిస్తున్నారనే అంశాలపై దర్యాప్తు చేపట్టారు.

యుపిలో కాంగ్రెస్ ఒంటరిపోరు


ఎస్‌పి, బిఎస్‌పి పొత్తుపై స్పందించని ఆజాద్



న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్ లో లోక్‌సభ ఎన్నికలకు బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి), సమాజ్‌వాది పార్టీ (ఎస్‌పి) కూటమితో సంబంధం లేకుండా హిందీ బెల్ట్‌లోని ఈ కీలక రాష్ట్రంలో ఒంటరిగానే పోటీచేస్తుందని పార్టీ వర్గాలు తెలిపాయి. యుపిలో ప్రాంతీయంగా తన శత్రువులైన ఎస్‌పి, బిఎస్‌పి తనను వదిలేసి జతకట్టడంపై వ్యాఖ్యానించేందుకు కాంగ్రెస్ నాయకత్వం నిరాకరించింది. తాము ఎన్నికల పొత్తు పెట్టుకున్నామని బిఎస్‌పి అధినేత్రి మాయావతి, సమాజ్‌వాది నాయకుడు అఖిలేష్ యాదవ్ చేసిన ప్రకటనపై వ్యాఖ్యానించమని ఎఐసిసి ప్రధాన కార్యదర్శి యుపి పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి గులాంనబీ ఆజాద్ ను కోరినప్పుడు... తమ పార్టీ వెంటనే స్పందించలేదని, ఆదివారం లక్నోలో వివరంగా చెబుతామని చెప్పారు. అంతకు ముందు ఆజాద్ యుపి కాంగ్రెస్ అధ్యక్షుడు రాజ్ బబ్బర్, కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్, మాజీ ఎంపి ప్రమోద్ తివారీని ఆయన నివాసంలో కలుసుకున్నారు. గత రెండు రోజులుగా ఆజాద్, ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ నాయకులు రాష్ట్రంలోని ఉత్తర ప్రాంతాల నాయకులను కలుసుకుంటున్నారు. ఎస్‌పి, బిఎస్‌పి పొత్తు కాంగ్రెస్‌ను దెబ్బతీస్తుందా? అని అడగ్గా, ఆజాద్ సమాధానం చెప్పేందుకు నిరాకరించారు.

ఈ నెల 31లోగా సూక్ష్మసేద్యం పూర్తి!

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 31వ తేదీలోగా సూక్ష్మ సేద్యం పూర్తి చేయాలని అధికారులను, కంపెనీలకు వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారధి, ఉద్యానశాఖ సంచాలకులు ఎల్. వెంకట్రామ్‌రెడ్డి ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాలన్నారు. సూక్ష్మ సేద్య కంపెనీలు, అధికారులు పొరపాటు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఖచ్చితమైన పంట లెక్కలు, వెంటనే సేకరించవలసిన అవసరాన్ని చెబుతూ ప్రతి ఉద్యాన పంట తలసరి వినియోగం ఆధారంగా రాష్ట్ర జనాభాకు అవసరమైన పరిమాణాన్ని లెక్కించాలన్నారు



రాజధాని ఢిల్లీలో ప్రపంచ స్థాయి బుక్ ఫెయిర్ జరుగుతోంది. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి తస్లీమా నస్రీన్ రాసిన పుస్తకం 'బేషరమ్'ను ఆసక్తికంగా చూస్తున్న పుస్తక ప్రియులు

పది శాతం కోటాకు రాష్ట్రపతి ఆమోదం



న్యూఢిల్లీ : అగ్రవర్ణాలలోని పేదలకు పది శాతం కోటా బిల్లుకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. ప్రభుత్వోద్యోగాలు, విద్యాసంస్థలలో పది శాతం రిజర్వేషన్ల కల్పనకు ఇటీవలే పార్లమెంట్ సమ్మతించింది. దీనికి ఇప్పుడు రాష్ట్రపతి ఆమోదపు సంతకం చేసినట్లు అధికారవర్గాలు శనివారం తెలిపాయి. రాష్ట్రపతి ఆమోదంతో ఈ బిల్లుకు ఇప్పుడు చట్టబద్ధత ఏర్పడుతుంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం కోటా కల్పనతో రిజర్వేషన్లపై ఉన్న సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితి దాటిపోతుంది. తొలుత లోక్‌సభ, పిదప రాజ్యసభలు పదిశాతం కోటాకు వీలు కల్పించే రాజ్యాంగ (103వ) సవరణ చట్టానికి సుదీర్ఘ చర్చల తరువాత ఆమోదం తెలిపాయి. ప్రతిపక్ష పార్టీలు చర్చల దశలో బిల్లును వ్యతిరేకించాయి. కేంద్ర ప్రభుత్వం కేవలం లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకువస్తోందని విమర్శించాయి. ఓట్లు రాబట్టుకునేందుకు తీసుకువచ్చిన హడావిడి బిల్లు అని తెలిపాయి. అయితే బిల్లు ఓటింగ్ దశలో అత్యధిక స్థాయిలో దీనికి సానుకూలంగా ఓట్లు పడ్డాయి. దీనితో బిల్లు ఆమోదం పొందింది. లాంఛన ప్రాయంగా మిగిలిన రాష్ట్రపతి సంతకం ప్రక్రియ కూడా ఇప్పుడు పూర్తి అయింది. దేశంలోని దాదాపు 19 కోట్ల మంది జనరల్ కేటగిరి వారికి అంటే అగ్రవర్ణాలకు చెందిన ఆర్థిక వెనుకబాటుతనపు వారికి ఈ కోటా పరిధి వర్తిస్తుంది. అగ్రవర్ణాలు తమ పట్ల ఇటీవలి కాలంలో చూపుతున్న అలకను తొలిగించుకునే ప్రక్రియలో భాగంగానే బిజెపి అత్యంత వ్యూహాత్మకంగా ఈ కోటాను ఎన్నికల ఎత్తుగడగా తీసుకువచ్చిందని విశ్లేషిస్తున్నారు. ఇబిపిలకు పదిశాతం కోటా కల్పనతో సమాజంలోని అగ్రవర్ణాలు ప్రత్యేకించి గతంలో వ్యవసాయికంగా ప్రాబల్యం చాటుకున్న పాటిదార్లు, జాట్లు, గుజ్జర్లు, మరాఠాలు, కమ్మలు, కాపులు, క్షత్రియులు కోటా సౌకర్యం పొందుతారు బ్రాహ్మణులు, రాజ్‌పుత్‌లు, భూమిహార్‌లు, వైశ్యులు, రెడ్డిల వంటి పలు సామాజిక వర్గాలు కూడా లబ్ధి పొందుతాయి. . ఈ కులాల వారు చాలా కాలంగా తమకూ కోటా కల్పించాల్సిందని కోరుతున్నారు. కొన్ని ప్రాంతాలలో ఈ కోటా సాధనకు తీవ్రస్థాయి ఉద్యమాలు సాగాయి. కొన్ని సందర్భాలలో ఇవి హింసాత్మకం అయ్యాయి. ప్రస్తుత చట్టంతో వృత్తిపరంగా వ్యవసాయం ఆదాయంపరంగా వార్షికాదాయం రూ 8 లక్షల కన్నా తక్కువ ఉన్న వారికి ఈ కోటా వర్తిస్తుంది. ఐదెకరాలకు తక్కువ వ్యవసాయ భూమి, వేయి చదరపు అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణం ఉన్న ఇల్లు కలిగిన వారికి ఈ కోటా కలిసి వస్తుంది. కోటా బిల్లు మేరకు ఆదాయ, ఆస్తి పరిమితిని లెక్కించే ప్రక్రియలు పూర్తి అయితే తదనుగుణంగా సంబంధితులకు ఈ కోటా వలన దక్కే ఉద్యోగ, విద్యా ప్రయోజనాలు సమకూరుతాయి. అయితే ఈ బిల్లును సవాలు చేస్తూ ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయింది.

తెలంగాణ సేంద్రియ సాగు బోర్డు!

- ఏర్పాటు చేసేందుకు కసరత్తు
- రూపుదిద్దుకున్న విధాన ముసాయిదా
- పద్ధతిలో వాణిజ్య పంటల సాగు
- ఎగుమతులు పెంచడమే లక్ష్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : వాణిజ్య పంటలను కూడా సేంద్రియ పద్ధతిలో పండించి ఉత్పత్తులను ఎగుమతి చేసి రైతులకు మరింత లాభం చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ధేశించుకుంది. అలాగే సేంద్రియ సాగును ప్రోత్సాహించడంతో పాటు సాంకేతికంగా రైతులకు సహకరించేందుకు తెలంగాణ సేంద్రియ సాగు బోర్డును త్వరలో ఏర్పాటు చేయనున్నారు. ఈ బోర్డు రైతుల ఆర్థిక, మార్కెటింగ్ సంబంధాలను కూడా మెరుగుపర్చనుంది. ఈ మేరకు వ్యవసాయ విధానాలు, పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర సేంద్రియ సాగు విధాన ముసాయిదాను అధికారులు సిద్ధం చేశారు. రైతుల మీద అప్పుల భారం తగ్గించి, ఆత్మగౌరవంతో జీవించేలా సేంద్రియ సాగును ప్రోత్సాహించడమే ముసాయిదా ప్రధాన ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. దీని ప్రకారం రాష్ట్రంలో ప్రధానంగా సాగయ్యే వరి, పప్పు పంటలతో పాటు కూరగాయలు, వాణిజ్య పంటలైన మిర్చి, పసుపులను సేంద్రియ పద్ధతిలో సాగు చేసి ఉత్పత్తులను ఎగుమతులు చేసేలా రైతులను సంసిద్ధం చేయనున్నారు. ఇక సేంద్రియ బోర్డులో వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా, సభ్యులుగా వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, మత్స్య శాఖ, అటవీశాఖ, సేంద్రియ ధ్రువీకరణ సంస్థల అధిపతులతో పాటు వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల విసిలు అలాగే ముగ్గురు సేంద్రియ రైతులు ఉండనున్నారు. దీనికి జిల్లా, మండల స్థాయిలో కమిటీలు కూడా వేయనున్నారు. సేంద్రియ వ్యవస్థలన్నింటిని ఒకే గొడుగు కిందకు తీసుకురానున్నారు. ఇది ప్రభుత్వానికి రైతులకు మధ్య వారధిగా పనిచేయనుంది. సేంద్రియ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగేలా వినియోగదారుల్లో అవగాహన కల్పించనున్నారు. అవసరాలకు అనుగుణంగా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేంద్రియ సంస్థలతో అవగాహన కుదుర్చుకోనున్నారు. తెలంగాణ సేంద్రియ సాగు మిషన్‌తో సేంద్రియ విధానాన్ని అమలు చేయనున్నారు. ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొన్న సవాళ్లను అధిగమించేలా రైతులను సమాయత్తం చేసేలా నాణ్యమైన ఉత్పత్తులతో సాగు ఆదాయం పెంచేలా కృషి చేయాలని ముసాయిదాలో పేర్కొన్నారు.

భూసారం పెరగాలి.. రసాయనాలు తగ్గాలి

రసాయనాల వినియోగం తగ్గించి, భూసారం పెంచి ఉత్పాదకత పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు ఇన్‌పుట్స్ రూపంలో వచ్చే వాటిపై ఆధారపడే తత్వం రైతుల్లో తీసివేయనున్నారు. ఇందుకు స్థానికంగా లభించే వనరులను వినియోగించి సాగుపై రైతులు దృష్టిసారించేలా చర్యలు తీసుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించేలా చేసేలా విధానాలను రూపొందించారు. వర్షభావంపై ప్రాంతాల్లో సేంద్రియ ఎరువులు చల్లడం ద్వారా భూసారం కూడా పెరిగి, అనావృష్టి సమయంలో నష్టపోకుండా దిగుబడులను పొందే అవకాశం లభిస్తుందని ముందుగా ఆ ప్రాంతాలపైనే దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు. సేంద్రియ ఎరువులు వినియోగంతో రైతులకు రసాయనిక కాలుష్యం సోకకుండా ఉండటమే కాకుండా, పర్యావరణానికి భద్రత కల్పించినట్లువుతుంది.

ఐదు వ్యూహాలు

సేంద్రియ వ్యవసాయ విధానంలో ప్రధానంగా 5 వ్యూహాలను అవలంబించాలని నిర్ణయించారు. మొదటిది వ్యవస్థీకృత యంత్రాంగం, నిర్దిష్టమైన ప్రణాళిక, వివిధ మార్గాల నుంచి సహకారం, రైతులకు ప్రోత్సాహం వంటివి ఉన్నాయి. వ్యవస్థీకృత విధానంలో మన రాష్ట్రంలో సాగవుతున్న వాణిజ్య పంటలైన మిర్చి, పసుపు ఉత్పత్తుల ఎగుమతులకు అపార అవకాశాలు ఉన్నాయి. అయితే ఎక్కువ స్థాయిలో రసాయనాలు వినియోగించడంతో ఎగుమతుల సమయంలో నిరాకరిస్తున్నారు. వీటిని సేంద్రియ సాగు కింద పండిస్తే ప్రస్తుతం వచ్చే దానికంటే అధిక డిమాండ్ వస్తుందని రైతులు ఆదాయం రెట్టింపు అవుతుందని రైతులను ఆ దిశగా ప్రోత్సాహించేలా ప్రణాళికలు రచించనున్నారు. అలాగే మామిడి, బత్తాయి, దానిమ్మ వంటి పంటలను సేంద్రియ సాగులో పండిస్తే అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి రేటు రావడంతో రైతులకు లాభదాయకంగా ఉంటుందని పేర్కొన్నారు.

సేంద్రియ పద్ధతిలో పత్తి సాగు

రాష్ట్రంలో కొండ గిరిజన, అటవీ ప్రాంతాల్లో ఎటువంటి రసాయనాలు లేకుండా సాగు చేస్తున్నారని, సహజసిద్ధమైన కలప, స్వచ్ఛమైన తేనే తీస్తున్న ప్రాంతాలను సేంద్రియ ప్రదేశాలుగా గుర్తించనున్నారు. సేంద్రియ కూరగాయలు కూడా ఎగుమతులకు ఊతమిస్తాయని భావిస్తున్నారు. అవసరమైతే పత్తిని కూడా సేంద్రియ పద్ధతిలో సాగు చేసే అవకాశాలు పరిశీలిస్తారు. ముసాయిదాలో పేర్కొన్న అంశాల ప్రకారం తక్కువ రసాయనాలు, ఎరువులు వాడుతూ వ్యవసాయం చేస్తున్న గ్రామాలను ఎంచుకుని సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సాహిస్తారు. సేంద్రియ ఎరువుల లభ్యతను ఉండే ప్రాంతాలను పరిగణనలోకి తీసుకోనున్నారు. వర్షాధార ప్రాంతాల్లో ఎక్కువ దిగుబడులకు అస్కారం ఉన్న ప్రదేశాల్లోని రైతులను సేంద్రియ సాగు వైపు మళ్లించనున్నారు. ఎగుమతుల సామర్థ్యాలను కూడా పరిగణనలోకి తీసుకుని సేంద్రియంవైపు రైతులు దృష్టిసారించేలా చేస్తారు.

భారత్‌ను అసహనం పాలిస్తోంది



దుబాయి: గత నాలుగున్నరేళ్లుగా పెరిగిపోతున్న అసహనం, క్రోధానికి భారత్ సాక్ష్యంగా నిలిచిందని, అవి అధికారంలో ఉన్న వారి మనస్సుల్లో ఉద్భవించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తొలిసారిగా ఆయన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యుఎఇ)లో రెండో రోజు పర్యటించారు. ఈ సందర్భంగా ఐఎంటి దుబాయి యూనివర్సిటీ విద్యార్థులతో రాహుల్ సంభాషించారు. ఒక ఆలోచనను బలవంతంగా ప్రజల మనస్సుల్లోకి చొప్పించాలనుకుంటే, వారు బహుళ ఆలోచనలు గ్రహించగలరని కాంగ్రెస్ అధ్యక్షుడు పేర్కొన్నారు. భారత్‌కు ఆలోచనలు ఉన్నాయని, ఆలోచనలతోనే భారత్ ఆవిర్భవించిందన్నారు. ఇతరుల ఆలోచనలను వినడం కూడా భారత ఆలోచనల్లో భాగమని ఆయన పేర్కొన్నారు. ఆకలి వంటి అతి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటున్న భారత దేశాన్ని క్రీడల్లో నంబర్ వన్ స్థానానికి తీసుకు రావడం చాలా కష్టమన్నారు. సహనం మన సంస్కృతిలో భాగమని, క్రోధం ప్రజల మధ్య విభజనను నాలుగున్నరేళ్లుగా చూస్తున్నామని, అవి పాలకుల మనస్సుల్లో నుంచి వచ్చాయని రాహుల్ పేర్కొన్నారు. జర్నలిస్టులను కాల్చి చంపే భారత్ మనకు ఇష్టం లేదని, అందుకే దానిని మార్చాలనుకుంటున్నామని కాంగ్రెస్ నేత పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రధాన సవాల్‌గా ఉంటుందన్నారు. ప్రపంచ దృక్పథంలో భారత్‌కు ఆరోగ్య రంగంలో భారీ అవకాశాలు ఉన్నాయని రాహుల్ పేర్కొన్నారు. గ్రహంపై అతి పెద్ద జెనెటిక్ వనరులపై మనం కూర్చొని ఉన్నామని, వచ్చే 1015ఏళ్లలో వైద్య, ఆరోగ్య రంగం ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. 'బ్రెయిన్ డ్రెయిన్'20వ శతాబ్దానికి సంబంధించిన అంశమని, 21వ శతాబ్దంలో ప్రజలు నిజమైన అవకాశాలు ఉన్న చోటికి తరలి వెళ్తారన్నారు.ఈ అవకాశాలను మన దేశమే కల్పిస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు భరోసా ఇచ్చారు. మప బ్యాంకింగ్ రంగాన్ని పునర్వ్యవస్థీకరించాల్సి ఉందని, చిన్న ,మధ్య తరగతి పరిశ్రమలు పెద్ద కంపెనీలుగా ఎదిగేందుకు దోహదపడేలా ఉండాలన్నారు.

షట్‌డౌన్ రికార్డు

- దేశ చరిత్రలో 22 రోజులకుపైగా ప్రతిష్టంభన
- కొనసాగుతున్న మెక్సికో గోడ వివాదం



వాషింగ్టన్ : మెక్సికో సరిహద్దు గోడ నిర్మాణం విషయంలో డెమొక్రాట్లతో వివాదం ఏర్పడడంతో అమెరికా ప్రభుత్వం పాక్షికంగా స్తంభించింది. శనివారం నాటికి ఈ ప్రతిష్టంభన 22వ రోజుకు చేరుకుంది. అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలు ఇన్ని రోజులపాటు స్తంభించడం ఇదే మొదటిసారి. 1995–1996 బిల్‌క్లింటన్ దేశాధ్యక్షుడిగా ఉన్న సమయంలో 21 రోజులపాటు ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించాయి. ప్రస్తుత ప్రతిష్టంభన వల్ల 8 లక్షల మంది ఫెడరల్ ఉద్యోగులకు జీతాలు అందలేదు. మెక్సికో గోడ నిర్మాణం ప్రాజెక్టుకు 5.7 బిలియన్ డాలర్ల వ్యయం అవుతుందని, అది తప్పనిసరి అని ట్రంప్ చేసిన డిమాండ్‌ను వ్యతిరేకించిన అమెరికన్ కాంగ్రెస్ ప్రభుత్వోద్యోగుల వేతనాలకు సంబంధించిన బడ్జెట్‌పై సంతకం చేయడానికి నిరాకరించింది. ఫలితంగా ఎఫ్‌బిఐ ఏజెంట్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, మ్యూజియం సిబ్బందికి శుక్రవారం జీతాల చెక్కులు అందలేదు. తన ప్రతిపాదనకు కాంగ్రెస్ నుంచి ప్రతిఘటన ఎదురు కావడంతో, ట్రంప్ తను ఇప్పటివరకు తీసుకున్న చర్యల నుంచి వెనక్కు తగ్గి, ప్రతిష్టంభనను తొలగించేందుకు దేశంలో అత్యవసర పరిస్థితి విధించాలని ఆలోచిస్తున్నారు. అప్పుడు ప్రాజెక్ట్‌కు కాంగ్రెస్ అనుమతి లేకుండానే నిధులు సమకూర్చుకోవచ్చు. 'వెంటనే అత్యవసర పరి స్థితిని విధించాలనుకోవడంలేదు. అయితే, నిధులకోసం ఎమర్జెన్సీ ఒక్కటే సులువైన మార్గం. అయితే, ఆ పరిస్థితి ఏర్పడకుండా కాంగ్రెస్ బాధ్యతాయుతంగా ఆలోచించి, 5.7 బిలయిన్ డాలర్ల బడ్జెట్‌కు ఆమోదం తెలుపుతుందని ఆశిస్తున్నా ను. ఒక వేళ...అప్పటికీ వాళ్లు దిగిరాకపోతే, అప్పుడు నేను నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటిస్తాను. అందుకు నాకు పూర్తి హక్కుంది' అని అమెరికా అధ్యక్షుడు స్పష్టం చేశారు. ఇలాంటి వివాదాస్పద నిర్ణయాన్ని తీసుకోడానికి తాను వెనకడాబోనని ఆయన ఇప్పటికే కొన్నిసార్లు సూచించారు. ఇలా ఉండగా, ట్రంప్ సమావేశమైన తర్వాత రిపబ్లకన్ మిత్రుడ సెనేటర్ లిండ్‌సే గ్రాహం ట్వీట్ చేస్తూ 'మా అధ్యక్షుడు నేషనల్ ఎమర్జెన్సీ ప్రకటిస్తార'న్నారు. అయితే వైట్ హౌస్ మీటింగ్‌లో ట్రంప్ మాట్లాడుతూ... ఎమర్జెన్సీ విధించే అధికారాలు తనకు ఉన్నాయని, అందువల్ల సుప్రీంకోర్టుతో పోరాటాలు చేయాల్సిన పరిస్థితి తప్పుతుందని చెప్పారు. ట్రంప్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని ప్రతిపక్షాలు చెబుతున్నాయి.

దక్షిణ మధ్య రైల్వే మరో మైలురాయి

- టికెట్ల తనిఖీలో నూతన విధానానికి శ్రీకారం
- సిబ్బందికి హెచ్‌హెచ్‌టిల అందజేత
- పలు రైళ్లల్లో నేటి నుంచి అమల్లోకి



మన తెలంగాణ / హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే మరో రైలురాయిని అధిగమించింది. సాంకేతిక దిశగా అడుగులు వేస్తూ రైల్వే వ్యవస్థ పనితీరులో ప్రత్యేకతను చాటుకుంటు న్న దక్షిణ మధ్య రైల్వే టికెట్ తనిఖీల్లో సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ప్రయాణికుల టికెట్ల తనిఖీలను హైటెక్ పద్ధతిలో నిర్వహించనున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డిజిటల్ ఇండియాలో భాగంగా ఈ విధానానికి శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ మార్గదర్శకాలకు అనుగుణంగా దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన హ్యాండ్ హెల్డ్ టెర్మినల్స్ (హెచ్‌హెచ్‌టి)లను టిక్కెట్ల తనిఖీ కోసం వినియోగంలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా రిజర్వుడ్ ప్రయాణికుల వివరాలను తనిఖీ చేయడంతో పాటు ఖాళీ బెర్తుల వివరాలను ఎప్పటికప్పుడూ తెలుసుకోవడం, వివిధ స్టేషన్ల మధ్య ఖాళీ బెర్తుల కేటాయిం పునకు పూర్తి పారదర్శక విధానానికి ఈ టెక్నాల్జీ ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికే రైల్వేలో పలు జోన్లలో ఈ విధానం అమలవుతున్న దక్షిణ మధ్య రైల్వేలో మొదటిసారిగా ఈ నూతన విధానానికి శ్రీకారం చుట్టినట్లు అధికారులు తెలిపారు. రాజధాని, శతాబ్ధితో పాటు భారతీయ రైల్వేలో ప్రయోగాత్మకంగా 51 రైళ్లల్లో ఈ తరహా విధానం అమలు కు శ్రీకారం చుట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఇందుకోసం ఆయా రైళ్లల్లో పనిచేసే 40 మంది సిబ్బందికి హెచ్‌హెచ్‌టిలను అందజేసినట్లు చెప్పారు. టికెట్ తనిఖీ వ్యవస్థ రూపాంతరం చెందే దిశగా అమలు చేసే ఈ విధానాన్ని కదిలే రైళ్లల్లో ఎప్పటికప్పుడూ బెర్తుల వివరాలు, ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో గుణాత్మక మార్పులు తీసుకువచ్చే ఈ వ్యవస్థను గురువారం సికింద్రాబాద్ డివిజన్‌లో డివిజనరల్ రైల్వే మేనేజర్ అమిత్ వరదాస్ ప్రారంభించారు. సికింద్రాబాద్ టు పుణే టు సికింద్రాబాద్ (12026 / 12025) శతాబ్ధి ఎక్స్‌ప్రెస్‌లో విధి నిర్వహణలో ఉన్న తనిఖీ సిబ్బందికి ఈ పరికరాలను సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో గురువారం అందజేశారు.

ఈ విధానం అమల్లోని రైళ్ల వివరాలు

- సికింద్రాబాద్ టు పుణే టు సికింద్రాబాద్ (12026 / 12025) శతాబ్ధి ఎక్స్‌ప్రెస్
- సికింద్రాబాద్ టు హజరత్ నిజాముద్దీన్ (12437 / 12438) సికింద్రాబాద్ రాజధాని ఎక్స్‌ప్రెస్
- చెన్నయ్ సెంట్రల్ టు హజరత్ నిజాముద్దీన్ (12433 / 12434) చెన్నయ్ సెంట్రల్ రాజధాని ఎక్స్‌ప్రెస్
- బెంగుళూరు టు హజరత్ నిజాముద్దీన్ (22691 / 22692) బెంగుళూరు రాజధాని ఎక్స్‌ప్రెస్

నూతన విధానం ఉపయోగాలివి

- నూతన విధానం వల్ల టికెట్ తనిఖీ సిబ్బంది ప్రయాణికుల బెర్తుల వివరాలను సులభంగా నమోదు చేసుకోవచ్చు. దీనివల్ల ఖాళీల వివరాలను సులభంగా తెలుసుకొని అవసరైన వారికి కేటాయించే అవకాశముంటుంది. దీని వల్ల ప్రయాణికుల లబ్ధి చేకూరుతుంది.
- ప్రయాణికులు ఎప్పటికప్పుడూ మార్గమధ్యంలో ఖాళీ బెర్తుల వివరాలను తెలుసుకోవడంతో పాటు తదుపరి స్టేషన్లలో అవసరమున్న ప్రయాణికులకు బెర్తులు కేటాయించే అవకాశముంటుంది.
- రిజర్వేషన్ చార్టు తయారైన తర్వాత రద్దు చేసిన బెర్తుల వివరాలను వెంటనే హెచ్‌హెచ్‌టిలకు చేరడం వల్ల టికెట్ లేని ప్రయాణికులను ఆరికట్టవచ్చు.
- దీనివల్ల బెర్తుల కేటాయింపులో పూర్తి పారదర్శకత ఉంటుంది.
- క్లాస్ బదిలీ చేసేందుకు కూడా ఈ విధానం ఉపయోగపడుతుంది.
- ఆహారంతో పాటు బెడ్‌రోల్స్ సరఫరా వివరాలను కూడా ఖచ్చితంగా తెలుసుకునే వీలుంది.
- హెచ్‌హెచ్‌టిలను రిజర్వేషన్ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానించడం వల్ల రీఫండ్ త్వరితంగా అందుతుంది.
- వివిధ కోచ్‌లలో తనిఖీ సిబ్బంది త్వరగా ఆర్‌ఎసిని క్లియర్ చేయడానికి ఉపయోగపడుతుంది.
- కాగిత రహిత వినియోగంతో పాటు పర్యాపరణకు కూడా ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని రైల్వే అధికారులు వివరించారు.

తొలి వన్డేలో విజయం సాధించడం ఆనందం కలిగించింది. రిచర్డ్‌సన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. డ్రాఫ్ కూడా తనవంతు సహకారం అందించాడు. రోహిత్ పోరాటం ఆకట్టుకుంది. రానున్న మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తాం.

– ఆస్ట్రేలియా కెప్టెన్ అరోన్ ఫించ్



చెలరేగిన రిచర్డ్‌సన్
రోహిత్ సెంచరీ వృథా
తొలి వన్డేలో భారత్ ఓటమి

ఆసీస్ అదరహో..

సిడ్నీ: భారత్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు శుభారంభం చేసింది. శనివారం జరిగిన తొలి వన్డేలో ఆస్ట్రేలియా 34 పరుగుల తేడాతో భారత్‌ను ఓడించింది. ఈ విజయంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0 ఆధిక్యాన్ని అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన టీమిండియా నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 254 పరుగులు మాత్రమే చేసి పరాజయం పాలైంది. రోహిత్ శర్మ (133) అద్భుత సెంచరీ సాధించినా ఫలితం లేకుండా పోయింది. ఆస్ట్రేలియా యువ స్పీడ్‌స్టర్ రిచర్డ్‌సన్ అద్భుత బౌలింగ్‌తో జట్టును గెలిపించాడు. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మంగళవారం ఆడిలైడ్‌లో జరుగుతుంది.

ప్రారంభంలోనే విలవిల

భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన టీమిండియాకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్లు రిచర్డ్‌సన్, బెహ్రెన్‌డ్రాఫ్ అసాధారణ బౌలింగ్‌తో భారత బ్యాట్స్‌మెన్‌ను హడలెత్తించాడు. వీరిద్దరి విజృంభణతో భారత్‌కు వికెట్లు నిలుపు కోవడమే కష్టంగా మారింది. కెరీర్‌లో తొలి మ్యాచ్ ఆడిన బెహ్రెన్‌డ్రాఫ్ మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సంచలనం సృష్టించాడు. అసాధారణ బౌలింగ్‌ను కనబరిచిన బెహ్రెన్‌డ్రాఫ్ తొలి ఓవర్ చివరి బంతికి ఓపెనర్ శిఖర్ ధావన్‌ను వెనక్కి పంపాడు. బెహ్రెన్‌డ్రాఫ్ వేసిన బంతికి ధావన్ వికెట్ల ముందు దొరికి పోయాడు. అప్పటి వరకు భారత్ స్కోరు ఒక పరుగు మాత్రమే. ఆ తర్వాత రిచర్డ్‌సన్ భారత ఇన్నింగ్స్‌ను శాసించాడు. అసాధారణ బౌలింగ్‌ను కనబరిచిన రిచర్డ్‌సన్ ఇన్నింగ్స్ నాలుగో ఓవర్‌లో రెండు వికెట్లు తీసి భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. తొలుత టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి (3)ను రిచర్డ్‌సన్ ఔట్ చేశాడు. అదే ఓవర్‌లో అంబటి రాయుడును రిచర్డ్‌సన్ పెవిలియన్ బాట పట్టించాడు. దీంతో భారత్ 4 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకు పోయింది.

రోహిత్, ధోని పోరాటం

ఈ దశలో క్రీజులోకి వచ్చిన మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనితో కలిసి మరో ఓపెనర్ రోహిత్ శర్మ పోరాటం కొనసాగించాడు. ఇద్దరు సమన్వయంతో ఆడుతూ ముందుకు సాగారు. భారీ షాట్ల జోలికి వెళ్లకుండా వికెట్లను కాపాడుకునేందుకు ప్రాధాన్యత ఇచ్చారు. దీంతో స్కోరు నత్తను తలపించింది. మరోవైపు ఆస్ట్రేలియా బౌలర్లు కచ్చితమైన లైన్ అండ్ లెన్త్‌తో బౌలింగ్ చేయడంతో భారత్‌కు పరుగులు రావడమే గగనంగా మారింది. పరుగులు చేయకున్నా రోహిత్, ధోని వికెట్లు పడకుండా జాగ్రత్త పడ్డారు. కుదురుకున్న తర్వాత రోహిత్ కాస్త దూకుడును పెంచాడు. అయితే ఆస్ట్రేలియా బౌలర్లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ భారత బ్యాట్స్‌మెన్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యారు. 17 ఓవర్లోగానీ భారత్ స్కోరు 50 పరుగులకు చేరుకోలేక పోయింది. దీన్ని బట్టి ఆస్ట్రేలియా బౌలర్లు ఏ స్థాయిలో ఒత్తిడి తెచ్చారో ఊహించుకోవచ్చు. అయితే డ్రింక్స్ విరామం తర్వాత రోహిత్ తన మార్క్ షాట్లతో అలరించాడు. ఆస్ట్రేలియా బౌలర్లపై ఎదురుదాడి చేస్తూ వరుస సిక్సర్లు కొట్టాడు. మరోవైపు ధోని కూడా దూకుడును పెంచాడు. ఇద్దరు గాడిలో పడడంతో పరుగుల వేగం ఊపందుకుంది. ఇదే క్రమంలో రోహిత్ శర్మ 62 బంతుల్లో మూడు సిక్స్‌లు, రెండు ఫోర్లతో అర్ధ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. కాగా, 25.2 ఓవర్లలో భారత్ స్కోరు వందకు చేరింది. మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన ధోని 96 బంతుల్లో మూడు ఫోర్లు, సిక్స్‌తో 51 పరుగులు చేసి ఔటయ్యాడు. ఇదే సమయంలో నాలుగో వికెట్‌కు 137 పరుగులు జోడించాడు.

శర్మ దూకుడు

ధోని ఔటైనా రోహిత్ తన దూకుడును కొనసాగించాడు. అతనికి దినేశ్ కార్తీక్ అండగా నిలిచాడు. ఆస్ట్రేలియా బౌలర్లను హడలెత్తించిన రోహిత్ శర్మ వరుస సిక్స్‌లు, ఫోర్లతో చెలరేగి పోయాడు. అతన్ని ఔట్ చేసేందుకు ఆస్ట్రేలియా బౌలర్లు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. కీలక ఇన్నింగ్స్ ఆడిన రోహిత్ 110 బంతుల్లో ఏడు ఫోర్లు, 4 సిక్స్‌లతో సెంచరీ పూర్తి చేశాడు. రోహిత్‌కు ఇది వన్డేల్లో 22వ శతకం కావడం విశేషం. ఇదే క్రమంలో ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో నాలుగు సెంచరీలు సాధించిన తొలి విదేశీ బ్యాట్స్‌మన్‌గా రోహిత్ చరిత్ర సృష్టించాడు. విండీస్ దిగ్గజం రిచర్డ్స్ పేరిట ఉన్న మూడు సెంచరీల రికార్డును రోహిత్ బద్దలు కొట్టాడు. కాగా, సెంచరీ తర్వాత రోహిత్ మరింత చెలరేగి పోయాడు. అయితే 129 బంతుల్లో పది ఫోర్లు, 8 భారీ సిక్సర్లతో 133 పరుగులు చేసి స్టోయినిస్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో భారత గెలుపు అవకాశాలకు తెరపడింది. చివర్లో భువనేశ్వర్ కుమార్ దూకుడుగా ఆడినా ఫలితం లేకుండా పోయింది. కీలక ఇన్నిగ్స్ ఆడిన భువనేశ్వర్ 4 ఫోర్లతో 29 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. కార్తీక్ (12), జడేజా (8), కుల్దీప్ (3), షమి (1) నిరాశ పరిచారు. ఆస్ట్రేలియా బౌలర్లలో రిచర్డ్‌సన్ 10 ఓవర్లలో 26 పరుగుల మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు తీశాడు. బెహ్రెన్‌డ్రాఫ్, పీటర్ సిడిల్ రెండేసి వికెట్లు పడగొట్టారు. రిచర్డ్‌సన్‌కు మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు లభించింది.

రాణించిన టాప్ ఆర్డర్

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేపట్టిన ఆస్ట్రేలియాకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్‌గా బరిలోకి దిగిన కెప్టెన్ అరోన్ ఫించ్ (6) భువనేశ్వర్ ప్రారంభంలోనే పెవిలియన్ పంపించాడు. మరో ఓపెనర్ అలెక్స్ కారే ఐదు ఫోర్లతో 24 పరుగులు చేసి కుల్దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. దీంతో ఆస్ట్రేలియా 41 పరుగులకే ఓపెనర్ల వికెట్లను కోల్పోయింది. ఈ దశలో సీనియర్ ఆటగాళ్లు ఉస్మాన్ ఖ్వాజా, షాన్ మార్ష్‌లు అద్భుతం బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నారు. ఇద్దరు భారత బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. కీలక ఇ న్నింగ్స్ ఆడిన ఖ్వాజా ఆరు ఫోర్లతో 59 పరుగులు చేశాడు. షాన్ మార్ష్ 4 ఫోర్లతో 54 పరుగులు సాధించాడు. మరోవైపు దూకుడుగా ఆడిన పీటర్ హాండ్స్‌కొంబ్ ఆరు ఫోర్లు, రెండు సిక్స్‌లతో 61 బంతుల్లోనే 73 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. కాగా, ఆల్‌రౌండర్ స్టోయినస్ రెండు ఫోర్లు, మరో రెండు సిక్స్‌లతో 47 పరుగులు చేసి నాటౌట్‌గా ఉన్నాడు. దీంతో ఆస్ట్రేలియా స్కోరు 288 పరుగులకు చేరింది. భారత బౌలర్లలో భువనేశ్వర్, కుల్దీప్ రెండేసి వికెట్లు పడగొట్టారు.





స్కోరు బోర్డు:

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: అలెక్స్ కారే (సి) రోహిత్ (బి) కుల్దీప్ యాదవ్ 24, అరోన్ ఫించ్ (బి) భువనేశ్వర్ కుమార్ 6, ఉస్మాన్ ఖ్వాజా ఎల్బీ–బి రవీంద్ర జడేజా 59, షాన్ మార్ష్ (సి) షమి (బి) కుల్దీప్ 54, పీటర్ హాండ్స్‌కొంబ్ (సి) ధావన్ (బి) భువనేశ్వర్ 73, మార్కస్ స్టోయినస్ నాటౌట్ 47, మాక్స్‌వెల్ నాటౌట్ 11, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం 50 ఓవర్లలో 288/5.

బౌలింగ్: భువనేశ్వర్ కుమార్ 10–0–66–2, ఖలీల్ అహ్మద్ 8–0–55–0, మహ్మద్ షమి 10–0–46–0, కుల్దీప్ యాదవ్ 10–0–54–2, రవీంద్ర జడేజా 10–0–48–1, అంబటి రాయుడు 2–0–13–0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) మాక్స్‌వెల్ (బి) స్టోయినస్ 133, శిఖర్ ధావన్ ఎల్బీ–బి బెహ్రెన్‌డ్రాఫ్ 0, విరాట్ కోహ్లి (సి) స్టోయినస్ (బి) రిచర్డ్‌సన్ 3, అంబటి రాయుడు ఎల్బీ–బి రిచర్డ్‌సన్ 0, మహేంద్ర సింగ్ ధోని ఎల్బీ–బి బెహ్రెన్‌డ్రాఫ్ 51, దినేశ్ కార్తీక్ (బి) రిచర్డ్‌సన్ 12, రవీంద్ర జడేజా (సి) షాన్ (బి) రిచర్డ్‌సన్ 8, భువనేశ్వర్ కుమార్ నాటౌట్ 29, కుల్దీప్ యాదవ్ (సి) ఖ్వాజా (బి) సిడిల్ 3, మహ్మద్ షమి (సి) మాక్స్‌వెల్ (బి) స్టోయినస్ 1, ఎక్స్‌ట్రాలు 14, మొత్తం 50 ఓవర్లలో 254/9.

బౌలింగ్: బెహ్రెన్‌డ్రాఫ్ 10–2–39–2, రిచర్డ్‌సన్ 10–2–29–4, పీటర్ సిడిల్ 8–0–48–1, నాథన్ లియాన్ 10–1–50–0, మార్కస్ స్టోయినస్ 10–0–66–2, మాక్స్‌వెల్ 2–0–18–0.


బ్యాటింగ్ వైఫల్యం వల్లే



సిడ్నీ: ప్రారంభంలోనే కీలక వికెట్లు కోల్పోవడం తొలి వన్డేలో ఓటమికి ప్రధాన కారణం. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా అద్భుత ఆటను కనబరిచింది. అయితే రోహిత్ శర్మ, ధోనిలు ఆడిన ఇన్నింగ్స్‌లు చిరకాలం గుర్తుండి పోతాయి. ఒత్తిడిలోనూ ఇద్దరు ఎంతో సమన్వయంతో ఆడి జట్టు గెలుపు అవకాశాలను చిగురింపచేశారు. కాగా, తొలి వన్డేలో ఓటమి బాధకు గురి చేసింది. తమ ఆట ఇలా ఉంటుందని ఊహించలేదు. ఆస్ట్రేలియాతో పోల్చితే మేము చాలా బలంగా ఉన్నాం. అయినా తొలి వన్డేలో ఓడడం జీర్ణించుకోలేక పోతున్నా. రానున్న మ్యాచుల్లో మరింత మెరుగైన ఆటను కనబరచాలి. ఈ మ్యాచ్‌లో బౌలర్లు బాగానే రాణించారు. అయితే బ్యాటింగ్ వైఫల్యం కలవరపెట్టిందో నాతోపాటు ధావన్, రాయుడు ప్రారంభంలోనే ఔట్ కావడంతో జట్టు మళ్లీ కోలుకోలేక పోయింది. మిగిలిన రెండు మ్యాచుల్లో గెలిచి సిరీస్ గెలుచు కోవడమే తమ ముందున్న ఏకైక లక్ష్యం.

టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి

సమష్టి విజయమిది



భారత్‌పై విజయం సాధించడం ఎంతో సంతోషానిచ్చింది. సమష్టి పోరాటం వల్లే విజయం దక్కింది. తొలి మ్యాచ్‌లోనే గెలవడం ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసింది. బ్యాటింగ్, బౌలింగ్‌లో పైచేయి సాధించడం ఆహ్వానించదగ్గ పరిణామం. మ్యాచ్‌లో నాలుగు వికెట్లు తీయడాన్ని గర్వంగా భావిస్తున్నా. మిగిలిన మ్యాచుల్లో మరింత మెరుగ్గా ఆడడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. అయితే తొలి వన్డేలో ఓడినంత మాత్రాన భారత్‌ను తక్కువ అంచనా వేయలేం. మిగిలిన మ్యాచుల్లో భారత్ చెలరేగి పోవడం ఖాయం.

ఆస్ట్రేలియా స్పీడ్‌స్టర్ రిచర్డ్‌సన్

సెమీస్‌లో హైదరాబాద్ ఓటమి



బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పిబిఎల్)లో హైదరాబాద్ హంటర్స్ పోరాటం సెమీఫైనల్లోనే ముగిసింది. శనివారం జరిగిన రెండో సెమీఫైనల్లో ముంబయి రాకెట్స్ చేతిలో ఓటమి చవిచూసింది. పూర్తి ఆధిపత్యం చెలాయించిన ముంబయి రాకెట్స్ 4–2తో హైదరాబాద్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఆదివారం ఫైనల్లో బెంగళూరుతో తలపడుతుంది. మహిళల సింగిల్స్ హైదరాబాద్ స్టార్ పి.వి.సింధు విజయం సాధించినా ఫలితం లేకుండా పోయింది. 15–6, 15–5తో పర్దేశిను ఓడించింది. అయితే మిగతా మ్యాచుల్లో ఓటమి పాలుకావడంతో హైదరాబాద్ సెమీస్‌లోనే ఇంటిదారి పట్టింది.



సిడ్నీ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ సాధించిన చెక్ రిపబ్లిక్ స్టార్ పెట్రా క్విటోవా, రన్నరప్ ఆశ్లే బార్టీ (ఆస్ట్రేలియా)

ధోనికి అంపైర్ షాక్

సిడ్నీ: తొలి వన్డేలో భారత్ ఓటమికి అంపైర్ తప్పుడు నిర్ణయం కూడా ఓ కారణమని చెప్పాలి. నిలకడగా ఆడుతున్న మహేంద్ర సింగ్ ధోని అంపైర్ తీసుకున్న తప్పుడు నిర్ణయానికి పెవిలియన్ చేరాల్సి వచ్చింది. ఈ విషయాన్ని ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ రిచర్డ్‌సన్ కూడా పరోక్షంగా ఒప్పుకున్నాడు. ధోని ఔట్ కాలేదనే విషయం రీప్లేలో తేలింది. అయితే అంపైర్ అప్పటికే ఔట్ ఇవ్వడంతో ధోని వెనుదిరగక తప్పలేదు. అంపైర్ నిర్ణయంపై సమీక్షకు వెళితే ఫలితం వేరే విధంగా ఉండేది. అయితే అప్పటికే రాయుడు ఓ సమీక్షను వాడడంతో భారత్‌కు ఆ ఛాన్స్ కూడా లేకుండా పోయింది. కాగా, అంపైర్ మైకెల్ గవుఫ్ తీసుకున్న ఈ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా భారత అభిమానులు ఆగ్రహ్యం వ్యక్తం చేస్తున్నారు.

సౌతాఫ్రికాకు ఆధిక్యం



జోహెన్నస్‌బర్గ్: పాకిస్థాన్‌తో జరుగుతున్న మూడో, చివరి టెస్టులో దక్షిణాఫ్రికా కీలకమైన తొలి ఇన్నింగ్స్ ఆధిక్యాన్ని సాధించింది. సౌతాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌లో 262 పరుగులకు ఆలౌటైంది. తర్వాత తొలి ఇన్నింగ్స్ చేపట్టిన పాకిస్థాన్ 185 పరుగులకు ఆలౌటైంది. ఒలివర్ మరోసారి అద్భుత బౌలింగ్‌తో పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. ఒలివర్‌కు ఐదు వికెట్లు దక్కాయి. ఫిలాండర్ మూడు, రబడా రెండు వికెట్లు తీశారు. పాక్ జట్టులో సర్ఫరాజ్ అహ్మద్ (50) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. తర్వాత రెండో ఇన్నింగ్స్ చేపట్టిన సౌతాఫ్రికా శనివారం ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది.

ఆస్ట్రేలియా అరుదైన రికార్డు



సిడ్నీ: అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యంత అరుదైన ఘనతను ఆస్ట్రేలియా జట్టు సాధించింది. భారత్‌తో శనివారం జరిగిన తొలి వన్డేలో గెలిచిన ఆస్ట్రేలియా అరుదైన మైలురాయిని అందుకుంది. ప్రపంచ క్రికెట్‌లో 1000వ విజయాన్ని సాధించిన తొలి జట్టుగా ఆస్ట్రేలియా చరిత్ర సృష్టించింది. ఆస్ట్రేలియా క్రికెట్ ప్రస్థానంలో ఇది 1000వ విజయం కావడం విశేషం. తొలి వన్డేలో భారత్‌ను ఓడించిన ఆస్ట్రేలియా ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు ఆస్ట్రేలియా టెస్టుల్లో 384 విజయాలు సాధించింది. 558 వన్డేల్లోనూ గెలిచింది.

మరో 58 అంతర్జాతీయ ట్వంటీ–20 మ్యాచుల్లో కూడా ఆస్ట్రేలియా జయకేతనం ఎగుర వేసింది. దీంతో అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా విజయాల సంఖ్య 1000కి చేరింది. 1877లో ఆస్ట్రేలియా తొలి విజయాన్ని అందుకుంది. మెల్‌బోర్న్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో ఆస్ట్రేలియా విజయం సాధించింది. ఆ తర్వాత ఆస్ట్రేలియా మళ్లీ వెనుదిరిగి చూడలేదు. టెస్టుల్లో, వన్డేల్లో అయితే ఎదురులేని శక్తిగా మారింది. విండీస్ ఆధిపత్యానికి తెరపడిన తర్వాత ఆస్ట్రేలియాకు ఎదురులేకుండా పోయింది.

ప్రస్తుతం ఇంగ్లండ్, భారత్, సౌతాఫ్రికా జట్లు వరుస విజయాలు సాధిస్తున్నా ఆస్ట్రేలియా రికార్డును అందుకోవడం అంత సులువు కాదు. రెండో స్థానంలో ఉన్న ఇంగ్లండ్ 774 విజయాలు సాధించింది. భారత్ 711 విజయాలతో మూడో స్థానంలో నిలిచింది. అయితే వన్డేల్లో ఆస్ట్రేలియా తర్వాత భారత్ అత్యధికంగా 492 వన్డేల్లో విజయం సాధించింది.

కోస్తా కర్ణాటక నుంచి నైరుతి మధ్యప్రదేశ్ వరకు, ఉత్తర ఇంటీరియర్ కర్ణాటక, మరాఠ్వాడ, విదర్భ మీదుగా 0.9 కి.మీల ఎత్తు వరకు ఉపరితల ద్రోణి ఏర్పడిందని శనివారం వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. దీనివలన రాగల మూడు రోజులపాటు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని వారు పేర్కొన్నారు. కోస్తా, ఆంధ్ర, రాయలసీమల్లో మూడు రోజులు పొడి వాతావరణం నెలకొంటుందని ఆ శాఖ పేర్కొంది.

జాడలేక నెలరోజులైంది!

డిసెంబర్ 13...జనవరి 13...సరిగ్గా నెలరోజులు. మేఘాలయాలోని గని కార్మికులు అక్కడి తూర్పు జైంటియా జిల్లాలో విస్తరించుకుని ఉన్న బొగ్గు గనులలో బందీ అయ్యారు. ఈ ఎలుక బొరియల తరహా గనులలో 320 నుంచి 350 అడుగుల లోతుకు కనీసం 15 మంది గని కార్మికులు తట్టా పారాలతో వెళ్లారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ వీరి జాడలేకుండా పోయింది. ఈ గనులు అక్రమం. అక్రమార్జనలకు అలవాటుపడ్డ కొందరు ఈ గనుల అక్రమ రాజ్యాన్ని నెలకొల్పారు. ఇక రోజువారీ కూలీలు తవ్వకాలకు వెళ్లుతుంటారు. బతుకు పోరు సాగించే దశలో వీరు నల్ల బంగారం వెతుకులాటకు వెళ్లి తమ బతుకులు ఆగం చేసుకుంటున్నారు. అయితే అనివార్యపు మెతుకు వెతుకులాటలో ఇప్పుడు భూమి అట్టడుగున గనులలో దిక్కులేకుండా చిక్కుకున్న తమ వారు జీవించే ఉన్నారనే ఆశలు తమకు లేవని, కనీసం తమ వారి అవశేషాలను అయినా తమకు అప్పగించాలని కార్మికుల ఆప్తులు, బంధు-వులు దీనంగా వేడుకుంటున్నారు. తమ వారి జాడ తెలిస్తే చాలని వారు కోరుతున్నారు. అయితే సహాయక చర్యలు నేటికీ కొనసాగుతుండడంతో కూలీలు జీవించి ఉన్నారా అన్న అనుమానాలు వెంటాడుతున్నాయి.





ఇరుకు దారులు.. ఎలుక బొరియలు

ఈశాన్య బొగ్గు గనులలో బతుకు అమాసలు

షిల్లాంగ్ : దేశంలో ప్రత్యేకించి ఈశాన్యంలోని మేఘాలయాలో చాలా ఏళ్లుగా విచ్చలవిడిగా బొగ్గు గనుల తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ తవ్వకాల పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నాయి. ఇక అత్యంత ఇరుకైన ఎలుక బొరియల గనులలోకి గని కార్మికులు తవ్వకాలకు వెళ్లడం , వీటిలో అత్యధికం అక్రమ గనులు కావడంతో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. కొందరి భౌతిక కాయాల అవశేషాలకు కూడా వారి ఆప్తులు నోచుకోలేకపోతున్నారు. మేఘాలయాలోని మారుమూల ప్రాంతపు గనులలో చిక్కుపడ్డ కార్మికుల జాడ కోసం సహాయక బృందాలు 18 రోజులుగా ప్రయత్నిస్తున్నాయి. అంతకు వారం పదిరోజుల ముందే గనిలో కార్మికులు చిక్కుపడ్డారు.

ఎలుక బొరియల మాదిరి గనుల తవ్వకాలు

అత్యంత ఇరుకు అయిన ప్రవేశ మార్గాలతో ఎలుకల బొరియలను తలపించే గనుల్లో తవ్వకాలు ఇప్పటివి కావు, అనాదిగా సాగుతున్నాయి. ఎక్కడైతే భూగర్భంలో బొగ్గు , బంగారం ఇతరత్రా ఎటువంటి ఖనిజాలు ఉన్నట్లు తెలిసినా ముప్పును గురించి చూడకుండా అత్యంత ఇరుకైన బొరియల గుండా గనులలోకి వెళ్లే తంతుసాగుతోంది. ఈ గనుల తవ్వకానికి దళారులు అక్రమార్జన పరులు రోజుకూలీ వారిగా కొంచెం ఎక్కువ ఆశచూపి మనుష్యులను తవ్వకాలకు దింపుతున్నారు. దళారులు భారీగా దండుకుంటున్నారు. ప్రాణాలకు తెగించి గనులలోకి వెళ్లే కూలీలకు లెక్కలలోకి అధికారపు రికార్డులలోకి రాని ఈ గని కార్మికులకు ముట్టేది అతి తక్కువ. పైగా అత్యంత అశాస్త్రీయంగా పద్ధతి అంటూ లేకుండా సాగే ఈ గనుల తవ్వకాలతో పర్యావరణం దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం అయింది. దీనితో జాతీయ హరిత ట్రిబ్యునల్ వారు మేఘాలయాలోని ఇటువంటి ఇరుకు గుంతల గనులలో తవ్వకాలను నిషేధించారు. ఈ గనుల నుంచి వెలువడే ఆమ్ల వ్యర్థాలతో ఇక్కడి కోప్లీ నది విషపూరితం అవుతోందని , దీనిని పరిరక్షించి ప్రజలను ఆదుకోవాలని దాఖలు అయిన పిటిషన్‌పై ట్రిబ్యునల్ స్పందించి అక్రమ తవ్వకాలు చెల్లనేరవని ప్రకటించింది. అయితే ఈ రూలింగ్ వెలువడ్డా ఇప్పటికీ అక్రమ తవ్వకాలు జోరుగాసాగుతున్నాయి.

పర్యావరణ పతనం ఎందుకు ? ఎట్లా?

అశాస్త్రీయంగా, సరైన అంచనాలు లేకుండా కేవలం అడ్డగోలుగా, కేవలం దొరికే బొగ్గుపై ఆశలతోనే సాగే తవ్వకాలతో మేఘాలయాల్లోని గ్రామీణ ప్రాంతాలకు ముప్పు వాటిల్లుతోంది. ఈ ప్రాంతంలోని నదులు, ఈ ప్రాంతంలోని కాలువల్లోని నీరు ఈ గనుల తవ్వకాలతో వెలువడే ఆమ్లాలతో దెబ్బతింటోంది. తాగేందుకు, పంటలు పండించుకునేందుకు పనికిరాకుండా అవుతోంది. గనుల తవ్వకాల తరువాత కలుషితం అవుతోన్న నీరు ఈ ప్రాంతపు మొక్కలకు చెట్టుచేమలకు , జంతువులకు ముప్పుగా మారుతోంది. ఇక్కడి వాతావరణ, పర్యావరణ దుస్థితిపై షిల్లాంగ్‌లోని నార్త్ – ఈస్టర్న్ హిల్ యూనివర్శిటీకి చెందిన అధ్యయన బృందం విశ్లేషణ జరిపింది.

తరాలుగా ఈ గనులలో భూగర్భపొరలలో ఆమ్ల పదార్థాలు రగులుకుంటూ వస్తున్నాయి. గనుల తవ్వకాల దశలో అత్యంత ప్రమాదకర ఆమ్లంతో కూడిన జలంభారీ స్థాయిలో ఈ ప్రాంతంలోకి చేరుకుంటున్నది. ఈ ప్రాంతపు జలాశయాలలోకి జారుకుంటున్నది. ప్రత్యేకించి ఇక్కడి కొపిలీ నది ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆమ్లభరితం అయిందని , అంతేకాకుండా ఈ ప్రాంతంలోని భూగర్భ జలాలు కూడా తరాలకు సరిపడా విషతుల్యం అయ్యేందుకు రంగం సిద్ధం అయిందని షిల్లాంగ్ వర్శిటీ పరిశోధనా పత్రం తెలిపింది. అయితే దీనిని హెచ్చరికలుగా భావించి తగు నివారణ చర్యలు తీసుకోవడంలో జాప్యం జరుగుతోంది. గనులలోని భారీ లోహాలను తీసివేయడంతో , బొగ్గు నిక్షేపాలకు పై ప్రాంతంలో రాతి పొరలలో ఇనుము, మ్యాంగనీస్, అల్యూమినియం వంటివి అత్యధికంగా ఉంటాయి. గనుల తవ్వకాల దశలో ఈ భారీ లోహాలు కరిగిపోవడం గనులలోపలి ప్రవాహాలకు చేరడం , ఇవి దిగువ ప్రాంతానికి చేరుకోవడంతో ఈ ప్రాంతపు పర్యావరణం అంతకు మించి జల సమతుల్యం పూర్తిగా దెబ్బ తింటోందని వెల్లడైంది.

మైనింగ్ నిషేధంతో స్థానికులకు బతుకుదెరువు తిప్పలు

అధికారికంగా ఈ ప్రాంతంలో ఈ ఇరుకు బొరియల గనుల తవ్వకాలపై నిషేధం విధించారు. అయితే పేదరిక ఈశాన్యంలోని మేఘాలయాలో సహజవనరులపై ఆధారపడి వేలాది మంది బతుకులీడుస్తున్నారు. గుట్టలు కొండలు, గనులు చెట్లు చేమలలోని సహజ వనరులు వీరికి తరాలుగా జీవనాధారం అవుతూ వస్తోంది. ఈ క్రమంలో గనుల తవ్వకాలు స్థానికులకు జీవనగమనపు అనుసంధానపు ఉపాధిగా మారింది. స్థానికులకు చాలా మందికి మైనింగ్‌తో ఉద్యోగ ఉపాధి దక్కుతోంది. గనుల అక్రమ తవ్వకాలపై నిషేధంతో అంతర్గతంగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. ఇక్కడి వారికి సరైన ఉపాధి , పునరావాసం కల్పించాల్సి ఉందని లేకపోతే తమకు పస్తులు తప్పవని స్థానికులు హెచ్చరిస్తూ వస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులతోనే తాము బొరియల గనులలోకి పోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మేఘాలయా అసెంబ్లీ ఎన్నికలలో ఈ మైనింగ్ విషయం ప్రతిపార్టీ అజెండాలో భాగం అయింది బిజెపి మద్దతుతో ఇక్కడ కొలువు తీరిన నేషనల్ పీపుల్స్ పార్టీ ప్రభుత్వం ఈ గనులలో తవ్వకాలపై నిషేధాన్ని సుప్రీంకోర్టులో ఒక పిటిషన్ ద్వారా సవాలు చేసింది. నవంబర్‌లో కేసు దాఖలు చేశారు. ఇప్పటికీ వెలికితీసిన బొగ్గును తరలించేందుకు ఈ నెల 31 వతేదీ వరకూ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. అయితే ఓట్ల కోసం ఎన్నికల సమయంలో అక్రమ మైనింగ్ నిరోధానికి చర్యలు లేదా ఇక్కడి వారికి ప్రత్యామ్నాయ ఉపాధి గురించి పార్టీలు నేతలు చెపుతూ ఉంటారని , ఆ తరువాత ఏమీ జరగదదని, స్థానికులకు ఏమీ ఒరగదని విమర్శలు వెలువడుతూ వస్తున్నాయి.

ఆద్యంతం అనియంత్రణతో కూడుకున్న ఇక్కడి మైనింగ్ సంబంధిత రవాణా వ్యవస్థ వెనుక పలువురు స్థానిక రాజకీయ నేతల హస్తం ఉందని సుప్రీంకోర్టులో సిటిజన్స్ రిపోర్టు పిటిషన్ దాఖలు అయింది. ఈ అక్రమ మైనింగ్‌ను సాగిస్తూ వస్తున్న దర్జా దొరలలో పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారని పేర్కొంటూ వారి పేర్లను కూడా ఈ పిటిషన్‌లో సుప్రీం కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ ప్రాంతంలో గనుల అక్రమ తవ్వకాలు, బొగ్గు కార్మికుల రవాణా, క్రమేపీ ఈ ప్రాంతంలో భూముల విలువల హెచ్చింపు వంటి పలు ప్రక్రియలు సాగుతున్నాయి. వీటికి అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీల పెత్తనం అజ్ఞాతపు శక్తిగా మారుతోందని స్వచ్ఛంద సంస్థలు వాపోతున్నాయి. ఇక్కడి గనులలో చిక్కుపడ్డ కార్మికులు ఇప్పటికీ సజీవులా? మృతులా? అనేది తేలకపోవడం ఇప్పటి దుష్ఫలితం అయిన దశలో ఈ అక్రమ మైనింగ్ వ్యవహారం చర్చనీయాంశమైంది.





కూటములు విఫల ప్రయోగం

- రాబోయేది మళ్లీ బిజెపి ప్రభుత్వమే
- 'అయోధ్య'పై కావాలనే కాంగ్రెస్ అడ్డంకులు
- రిజర్వేషన్లపై తప్పుడు ప్రచారం
- ఆ మూడు రాష్ట్రాలకు సిబిఐ అంటే భయమెందుకు?
- అవినీతి మచ్చలేని ప్రభుత్వం మాదొక్కటే
- రైతులపై విపక్షాలవి ఓటు బ్యాంకు రాజకీయాలు
- బిజెపి జాతీయ మండలి సమావేశాల్లో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : బిజెపి వ్యతిరేక కూటమిని విఫల ప్రయోగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు. బంధుప్రీతి, అవినీతిని ప్రోత్సహించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కచోటికి చేరి మజ్బూర్(నిస్సహాయ) సర్కార్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నాయని దుయ్యబట్టారు. అన్ని రంగాల్లో దేశాభివృద్ధికోసం బిజెపి మాత్రం మజ్బూత్(పట్టిష్ట వంతమైన) ప్రభుత్వాన్ని నెలకొల్పుతుందని అన్నారు. సుస్థిర ప్రభుత్వం వస్తే వాళ్ల రాజకీయ దుకాణాలు బంద్ అవుతాయని బెంబేలెత్తిపోతున్నారని ఎద్దేవా చేశారు. శనివారంనాడు ఇక్కడ బిజెపి జాతీయ మండలి సమావేశాల్లో మోడీ ప్రసంగించారు. ఒకప్పుడు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన పార్టీలన్నీ ఇప్పుడు సిద్ధాంతాలను పక్కనపెట్టి అదే పార్టీతో జట్టుకట్టుతున్నాయని విమర్శించారు. కూటమి ప్రయోగం తెలంగాణలో విఫలమైందని మోడీ గుర్తు చేశారు. జాతీయస్థాయిలో కూడా అది ఫలించబోదని, ఎవరెన్ని కూటములు కట్టినా కేంద్రంలో రాబోయేది కచ్చితంగా మళ్లీ బిజెపి సర్కారేనని మోడీ స్పష్టం చేశారు. అయోధ్య అంశాన్ని కొలిక్క రాకుండా కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని, వాళ్ల న్యాయవాదుల చేత కోర్టులో అడ్డంకులు సృష్టిస్తోందన్నారు. అగ్రవర్ణాలలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఉద్యోగాలు, విద్యా సంస్థలలో 10 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాలపై మోడీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ ప్రజలందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాలకు చెందిన ప్రజలకు రిజర్వేషన్లు కల్పించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఆయన తెలిపారు. ఇబిసి రిజర్వేషన్లపై ఎస్‌సిలు, ఎస్‌టిలు, ఇతర వెనుకబడిన కులాల మధ్య భయాందోళనలు సృష్టించడానికి తన రాజకీయ ప్రత్యర్థులు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తమ రాజకీయ లబ్ధి కోసం ఒక భయంకరమైన ప్రచారాన్ని వారు వ్యాప్తి చేస్తున్నారని ప్రధాని వ్యాఖ్యానించారు. "ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు రిజర్వేషన్లను ఎవ్వరూ కాదనలేరన్నది నిర్వివాదాంశం. చారిత్రకంగా ఈ వర్గాలు అన్యాయానికి గురయ్యాయి. ఈ వర్గాలకు రిజర్వేషన్లు ఎప్పటికీ ఉంటాయి" అని మోడీ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల ప్రభుత్వాలు సిబిఐకి సాధారణ అనుమతి నిరాకరించడంపైనా ప్రధాని స్పందించారు. సిబిఐకి వాళ్లు ఎందుకు భయపడుతున్నారని, ఎలాంటి అవకతవకలకు అక్కడ పాల్పడుతున్నారో చెప్పాలని నిలదీశారు. అవి వెలుపలికి వస్తాయనే ఇలాంటి చర్యలకు దిగుతున్నాయని ఆక్షేపించారు. నేను గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు అప్పటి యుపిఎ ప్రభుత్వం సంవత్సరాల కొద్దీ తనను సిబిఐని ఉపయోగించుకుని వేధింపులకు గురిచేసిందని, అయినప్పటికీ తానెప్పుడు సిబిఐకి సాధారణ అనుమతిని నిరాకరించలేదని ప్రధాని గుర్తు చేశారు. దేశ చరిత్రలో అవినీతి మరకలు లేని ప్రభుత్వం తమదేనని అన్నారు. అవినీతిరహితంగా దేశాన్ని నడపవచ్చునని బిజెపి మాత్రమే నిరూపించిందని మోడీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు రైతులను ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని, మేం మాత్రం వారికి ఎదురవుతున్న సవాళ్లను రూపుమాపడానికి ప్రయత్నిస్తున్నామని అన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి బిజెపి ప్రభుత్వం రాత్రింభవళ్లు పనిచేస్తుందన్నారు. ఏక్ భారత్, శ్రేష్ట భారత్ బిజెపి లక్ష్యమన్నారు.

ఆ ఫలితాలతో డీలా పడొద్దు : అమిత్ షా



ఇటీవల వెలువడని అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు, ముఖ్యంగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల ఓటములతో బిజెపి కార్యకర్తలు ఢీలా పడొద్దని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పిలుపునిచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికలు బిజెపికి చాలా ముఖ్యమైనవని అన్నారు. కాంగ్రెస్ పాలనలో పక్షపాత ధోరణులు క్యాన్సర్‌లా పాకాయని, ప్రజాస్వామ్యాన్ని అవి మరింత బలహీనపరిచాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతి ఓటరును కలిసి బిజెపి లక్ష్యాలను వివరించాలని కోరారు. ఎంపిలంతా సొంత రాష్ట్రాలకు వెళ్లే కార్యకర్తలు, ప్రజలతో మమేకం కావాలని అమిత్ షా దిశానిర్దేశం చేశారు.

కూటములతో వచ్చేది అరాచక పాలనే: యోగి



వచ్చే లోక్‌సభ ఎన్నికల కోసం బిజెపికి వ్యతిరేకంగా ఏర్పడే ప్రతిపక్షాలకు చెందిన ఏమహాకూటమయినా అరాచకాన్ని, అవినీతిని, రాజకీయ అస్థిరతను సృష్టిస్తుందని ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యానించారు. శనివారం నాడిక్కడ బిజెపి జాతీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగిస్తూ ఒకరంటే ఒకరికి పడని వారు కూడా ఇప్పు డు మహాకూటమి గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సమాజంలోని అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా బిజెపి పనిచేస్తుందని, ప్రజలందరి విశ్వాసాలను బిజెపి గౌరవిస్తుందని ఆయన చెప్పారు. కులతత్వాన్ని, ప్రాంతీయతత్వాన్ని పెం చిపోషించిన కాంగ్రెస్‌పార్టీ గడచిన 50 ఏళ్లుగా దేశాన్ని అభివృద్ధికి దూరం చేసిందని ఆరోపించారు. రానున్న లోక్‌సభ ఎన్నికలలో బిజెపి గత ఎన్నికల కన్నా మెరుగైన ఫలితాలను సాధించగలదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మోడీ నాయకత్వంలో బలమైన, సమర్థవంతమైన ప్రభుత్వం తిరిగి ఏర్పడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

హంపికి న్యూయార్క్ టైమ్స్ గుర్తింపు

52 ప్రపంచ పర్యాటక ప్రదేశాలలో రెండవ స్థానం



బెంగళూరు: సుసంపన్నమైన శిల్ప కళావైభవానికి ప్రసిద్ధి చెందిన ఒకనాటి విజయనగర సామ్రాజ్య రాజధాని హంపికి అరుదైన గుర్తింపు లభించింది. న్యూయార్క్ టైమ్స్ గుర్తించిన ప్రపంచంలోని తప్పనిసరిగా చూడదగ్గ పర్యాటక ప్రదేశాలలో రెండవ స్థానాన్ని హంపి దక్కించుకుంది. శిథిలనగరంగా మారిన హంపిని ప్రపంచ వారసత్వ నగరాల జాబితాలో కొన్నేళ్ల క్రితం యునెస్కో చేర్చగా ఇటీవలే కొందరు ప్రపంచ పర్యాటక ప్రేమికులకు చెందిన ఒక కమిటీ తుంగభద్ర నది ఒడ్డున వెలసిన హంపి క్షేత్రాన్ని ఆసియాలోనే అతి ముఖ్యమైన పర్యాటక ప్రదేశంగా ఎంపిక చేసింది. ఇప్పుడు ప్రముఖ ఆంగ్ల దినపత్రిక న్యూయార్క్ టైమ్స్ హంపికి 52 ప్రపంచ పర్యాటక ప్రదేశాలలో రెండవ స్థానాన్ని ఇచ్చింది. కరీబియన్ ద్వీపాలకు చెందిన ప్యూర్టో రీకో ద్వీపానికి ఈ జాబితాలో ప్రథమ స్థానం లభించడం విశేషం.

అలోక్‌వర్మ అవినీతిపై ఆధారాలు లేవు

సివిసి విచారణ పర్యవేక్షించిన ఎకె పట్నాయక్ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : సిబిఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ అవినీతికి పాల్పడ్డారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవని, ఆయనపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సివిసి) విచారణను సుప్రీంకోర్టు తరఫున పర్యవేక్షించిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ స్పష్టం చేశారు. శనివారం మీడియాతో ఆయన మాట్లాడారు. కేవలం సిబిఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా చేసిన ఆరోపణ లపైనే అలోక్ వర్మపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ దర్యాప్తు జరిపి సుప్రీం కోర్టుకు నివేదిక సమర్పించిందని, ఆ నివేదికలోని అంశాలకు తనకు ఎంత మాత్రం సంబంధం లేదని పట్నాయక్ స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని తాను లిఖిత పూర్వకంగా సుప్రీంకోర్టుకు తెలియజేశానని చెప్పారు. అంతేకాకుండా అలోక్ వర్మపై సివిసి విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్ఎం లోధా కూడా అలోక్ వర్మపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని శుక్రవారం ఏఎన్ఐ వార్తా సంస్థతో వ్యాఖ్యానించారు. అలోక్ వర్మపై వేటు గురించి ఆయన మాట్లాడుతూ సిబిఐపై రాజకీయ పెత్తనం కొనసాగినంతకాలం ఇలాంటివి జరుగుతూనే ఉంటాయని ఆయన వ్యాఖ్యానించారు. అలోక్ వర్మపై వచ్చిన ఆరోపణలను విశ్వసించేందుకు తగిన ఆధారాలు ఉన్నాయంటూ సివిసి సమర్పించిన నివేదిక ఆధారంగానే ఆయన్ని సిబిఐ డైరెక్టర్ పదవి నుంచి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎంపిక కమిటీ తొలగించిన సంగతి తెలిసిందే.

కూటమికి లక్ష్యం, సిద్ధాంతం లేదు



మన తెలంగాణ/హైదరాబాద్ : బిజెపికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఏర్పడుతున్న మహా కూటమికి ఒక లక్ష్య ం, సిద్ధాంతం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మ ణ్ విమర్శించారు. అసలు ఆ కూటమికి నాయకుడెవరో చెప్పాలని డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలో జరుగుతున్న బిజెపి జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో ముచ్చటిస్తూ, పార్లమెం ట్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా జాతీయ కార్యవర్గ సమావేశం జరిగిందన్నారు. ఈ సమావేశానికి పార్టీ జాతీయ నాయకులతో పాటు అన్ని రాష్ట్రాల అధ్యక్షులు, వివిధ హోదాల్లో ఉన్న నేతలు హాజరయ్యారని తెలిపారు. బిజెపి జాతీయ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీలు హాజరై స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలతో పార్టీ నేతలకు మార్గదర్శకం చేశారని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంసిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారని లక్ష్మ ణ్ చెప్పారు. కూటమి పేరు మీద ఒక్కటవుతున్న పార్టీలు ముందుగా ప్రధాన మంత్రి అభ్యర్థి ఎవరో చెప్పే ధైర్యం ఉందా అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో బిజెపి పక్షాన అమిత్‌షా, మోడీలే మా స్టార్ క్యాంపెయినర్లు అని వ్యాఖ్యానించారు.

గతంలో కంటే మరిన్ని ఎక్కువ సీట్లు సాధిస్తాం

2014లో వచ్చిన సీట్ల కంటే త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి మరిన్ని సీట్లు సాధించడం ఖాయమని బిజెపి పార్లమెంటరీ పార్టీ నాయకులు బాల సుబ్రహ్మణ్యం వ్యాఖ్యానించారు. ఎక్కువ సీట్లు సాధించడానికి అవసరమైన వ్యూహాలను జాతీయ కార్యవర్గంలో చర్చించామన్నారు.

Printed and Published by **Tumu Mohan Rao** on behalf of Moveon Media Private Limited, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037 Medchel-Malkajgiri District, TELANGANA and Published from H.No.1-1-60/7A, 4th floor Beacon towers, street no.13, Jawaharnagar, near RTC X Roads Hyderabad-500020 Telangana state, Editor : **Anjaiah Polisetty**, RNI No. TELTEL/2012/42234. Email Id. editor@manatelangana.org. Phone No.040-27655666